

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

10-5-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 99 పేజీలు: 10+4 వెల: 8.00


## పంజాబ్ పరిశ్రమల మంత్రిని అరెస్టు చేసిన ఇడి

5లో

## సిడిఎస్‌గా రాజా సుబ్రమణి నియామకం



శనివారం గవర్నర్ అర్లేకర్‌నుంచి అనుమతిపత్రం అందుకుంటున్న టివికె అధ్యక్షుడు విజయ్

# విజయుడే..

## ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్

### 120 మంది ఎమ్మెల్యేల మద్దతుతో గవర్నర్‌కు లేఖ సమర్పించిన టివికె చీఫ్ విజయ్

### నేటి ఉదయం 10గం.కు చెన్నై నెహ్రూ స్టేడియంలో ప్రమాణం

**చెన్నై,మే 9:** తమిళనాట పొలిటికల్ మిస్టరీ ఎట్టకేలకు వీడింది. గడచిన ఐదురోజులుగా అటు రాష్ట్రప్రజలను ఇటు రాజకీయపార్టీల్లోను తీవ్ర ఉత్కంఠకు తెరతీసిన పొత్తులు ఇపుడు కొలిక్కి వచ్చాయి. కేవలం రెండేరెండు స్థానాలవద్ద నిలిచిపోయిన టివికె మెజార్టీ మార్కు రెండుపార్టీలు శనివారం మద్దతు ఇవ్వడంతో కొలిక్కి వచ్చింది. మెజార్టీ మార్కును దాటి 120 స్థానాలకు చేరడంతో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ >>2

# రబీలో భారీగా ధాన్యం సేకరణ

### బాయిల్డ్ రైస్ కొనుగోలుకు కేంద్రం అంగీకారం

### 8 లక్షల మె.ట మేర కేంద్రం కొనుగోలు

### ధాన్యానికి నిధులు 24 గంటల్లో రైతు ఖాతాల్లో జమ

### ఖరీఫ్, రబీలో 70 ల.మె.టన్నుల సేకరణ లక్ష్యం: మంత్రి నాదెండ్ల



**విజయవాడ,మే 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బాయిల్డ్ రైస్ కొనుగోలు చేయాలని కేంద్రాన్ని కోరగా, ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రాష్ట్రం నుంచి 8 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరించేందుకు కేంద్రం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. రాష్ట్ర రైతుల ఇబ్బందులను గుర్తించి కేంద్రం పెద్ద మనసు చాటుకుంది. 8 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ సేకరణకు అనుమతి ఇవ్వడంతో రైతన్నలకు ఊరట లభించిందన్నారు. రబీలో రూ.4,410కోట్ల ధాన్యం కొని 24 గంటల్లోనే 94 శాతం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం చారిత్రాత్మక రికార్డు అని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ ఎస్. ఢిల్లీరావుతో కలిసి ధాన్యం కొనుగోలు తీరుతెన్నులపై సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రబీ సీజన్‌లో ఇప్పటివరకు రూ.4,410 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. అందులో 94 శాతం నిధులను కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేశామని పేర్కొన్నారు. ఇది చారిత్రాత్మక రికార్డు అని, గత ప్రభుత్వాల హయాంలో నెలల తరబడి నిరీక్షిచాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టిందని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో గతంలో ఎన్నడూ లేని విధంగా పారదర్శకత, వేగాన్ని తీసుకొచ్చామని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పౌరసరఫరాల శాఖ, జిల్లా యంత్రాంగం, కార్పొరేషన్ సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. రైతుల కోరిక మేరకు ఇతరజిల్లాల మిల్లర్లు వచ్చి ధాన్యం సేకరించే అంశంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా మిల్లర్లలకు అనుమతి ఉందని, అవసరమైతే పొరుగు జిల్లాల మిల్లర్లకు కూడా వెసులుబాటు కల్పించేలా సోమవారం జరిగే ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకుంటామన్నారు. లారీలు, గోనె సంచులనాణ్యత వంటి చిన్నచిన్న స్థానిక సమస్యలను సిబ్బంది ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో ధాన్యం సేకరణ, కొనుగోలు, చెల్లింపుల గురించి రైతులతో నేరుగా మాట్లాడి ఆరా తీశాం. ఎన్టీఆర్ జిల్లాలో ధాన్యం సేకరణ గణనీయంగా పెరిగింది. గత ఏడాది కేవలం 30 వేల మెట్రిక్ టన్నులు సేకరించగా, ఈ ఏడాది ఇప్పటికే 80 వేల మెట్రిక్ టన్నులు సేకరించాం. అంచనాల కంటే దిగుబడి ఎక్కువగా ఉన్నందున జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి మేరకు ఎన్టీఆర్ జిల్లాకు అదనంగా మరో 30 వేల మెట్రిక్ టన్నుల కోటాను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నాం. ఈ రబీలో జిల్లా నుంచిమొత్తం లక్షా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించబోతున్నామన్నారు.



బెంగాల్ సిఎంగా ప్రమాణం చేసిన సువేందుతో ప్రధాని మోడీ, గవర్నర్ ఆర్ఎన్ రవి

# 'అధికారి' చేతికి బెంగాల్ పగ్గాలు

- 9వ సిఎంగా ప్రమాణం
- మరో ఐదుగురు మంత్రులు కూడా..
- ప్రధాని మోడీ, కేంద్రమంత్రులు, ఎన్డీయే నేతలు హాజరు

**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని చారిత్రాత్మక 'బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్'లో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. బెంగాల్ గవర్నర్ ఆర్.ఎన్.రవి ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జెపి నడ్డా, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సిఎంలు చంద్రబాబు నాయుడు, యోగి ఆదిత్యనాథ్, >>2



సభావేదికపై మఖన్‌లాల్ సర్కార్‌కు పాదాభివందనం చేస్తున్న ప్రధాని మోడీ- 5లో



విశాఖలోని కైలాసగిరిపై ఏర్పాటు చేసిన త్రిశూల్

# విశాఖలో 'త్రిశూల్' వైభవం

### కైలాసగిరిపై ఆధ్యాత్మిక శోభ

**విశాఖపట్నం, మే 9 ప్రభాతవార్త:** విశాఖ పర్యాటక మణిహారమైన కైలాసగిరి నూతనంగా ఏర్పాటు చేసిన 65 అడుగుల డమరుకం తో కూడిన త్రిశూల్ ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం కైలాసగిరి పై మహా శివుడుకి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం త్రిశూలంకు పూజలు చేశారు. రాష్ట్ర మున్సిపల్ పురపాలక >>2

# ప్రజలందరికి సమ న్యాయం



శనివారం రాజమహేంద్రవారంలో కోర్టుల భవనాలను ప్రారంభించి మాట్లాడుతున్న హైకోర్టు సిజె లీసాగిల్

- న్యాయ మౌలిక వసతులు ప్రజల విశ్వాసానికి ప్రతీకలు కావాలి
- రాజమహేంద్రవరంలో 10 కోర్టుల భవన సముదాయం ప్రారంభించిన హైకోర్టు సిజె లీసా గిల్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, మే9, ప్రభాతవార్త:** న్యాయ మౌలిక వసతులు కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించిన భవనాలు మాత్రమే కాకుండా ప్రజల భావోద్వేగాలకు, న్యాయ వ్యవస్థ నిబద్ధతకు ప్రతీకలని జస్టిస్ లిసా గిల్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ శనివారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నూతనంగా నిర్మించిన 10 కోర్టుల భవన సముదాయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రధానన్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థలో ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించి నప్పుడే న్యాయం సమాజంలోని ప్రతి వర్గానికీ చేరుతుందని అన్నారు. రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి ప్రాంతాల సాంస్కృతిక, సాహిత్య, న్యాయ వారసత్వాన్ని ప్రస్తావిస్తూ,ఈ నేల నుంచి అనేక మంది ప్రముఖ న్యాయమూర్తులు,న్యాయవాదులు, సాహితీవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధులు వెలుగులోకి వచ్చారని కొనియాడారు.

న్యాయ వ్యవస్థలో సాంకేతికత ప్రాధాన్యం రోజురోజుకూ పెరుగుతోందని, డిజిటలైజేషన్ ఇప్పుడు అనివార్యమైందని ఆమె అన్నారు. కోవిడ్ కాలంలో కూడా భారత న్యాయస్థానాలు ప్రజలకు అందుబాటులో ఉండటం దేశ న్యాయ వ్యవస్థ గొప్పతనమని పేర్కొన్నారు. అయితే కృత్రిమ మేధస్సు వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సాంకేతికతను మన ప్రయోజనానికి ఉపయోగించు కోవాలే గానీ, స్వతంత్ర ఆలోచనను కోల్పోవద్దని అన్నారు. చాట్‌జీపీటీ వంటి సాధనాలు మానవ ఆలోచనకు ప్రత్యామ్నాయం కావని స్పష్టం చేశారు.కొత్త కోర్టు భవన సముదాయానికి నిరంతర నిర్వహణ, అవసరమైనప్పుడు ఆధునీకరణ ఉండాలని, దీనిపై పరిపాలన దృష్టి సారించాలని సూచించారు.

మధ్యవర్తిత్వం (మీడియేషన్) ప్రాధాన్యాన్ని వివరించిన ఆమె, మీడియేషన్‌ను కేవలం కుటుంబ వివాదాలు లేదా మోటార్ ప్రమాద కేసులకు మాత్రమే పరిమితం చేయరాదన్నారు. వివాదాలను తీర్పుతో ముగించడమే కాకుండా, పరస్పర అవగాహనతో పరిష్కరించడమే నిజమైన విజయమని చెప్పారు. న్యాయవాదులు, న్యాయాధికారులు మీడియేషన్‌ను మరింత ప్రోత్సహించాలని ఆమె కోరారు. కోర్టులు కేవలం వివాదాలు తీర్చే స్థలాలుగా కాకుండా, పరస్పర విభేదాలు తొలగి సఖ్యత నెలకొనే వేదికలుగా మారాలని ఆకాంక్షించారు. విచారణలు వేగంగా పూర్తయ్యేందుకు సాక్షుల హాజరు తదితర అంశాల్లో పోలీసు శాఖ పూర్తి సహకారం అందించాలని సూచించారు. ఈ భవన నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, అధికారులు, కార్మికులు అందరినీ అభినందించిన ఆమె, ఈ నూతన కోర్టు భవనం సత్యం, న్యాయం, ధర్మానికి మార్గదర్శకంగా నిలిచి న్యాయ సేవలను మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయ >>2

# కడపలో బాహాబాహీ

### అల్మాస్‌పేట సర్కిల్‌లో ఏరియా పేరుపై వివాదం

### రెండు వర్గాల ఘర్షణలతో ఉద్రిక్తత

### రాళ్లదాడిలో గాయపడిన సిఐ



రాళ్లదాడిలో గాయపడిన సిఐ నరసింహా

**కడప కార్పొరేషన్ మే 9 ప్రభాతవార్త:** కడప నగరంలోని అల్మాస్పేట సర్కిల్ దగ్గర శనివారం ముస్లింలు నిరసనకు దిగారు. అల్మాస్పేట సర్కిల్‌లో హనుమాన్ సర్కిల్ అని బ్యానర్లు వేయడంపై వివాదం రాజుకుంది. రెండు వర్గాలు రాళ్లు విసురు కోవడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడికి పోలీసులు చేరుకొని పరిస్థితిని అదుపు చేయడానికి ప్రయత్నం చేశారు. ఆందోళనలు తిరిగి గొడవకు దారితీసింది. రెండు వర్గాల వారు రాళ్లు విసురుకున్నారు. రాళ్ల దాడిలో తాలూకా సిఐ నరసింహ తలకి గాయమైంది. కొంతమంది పోలీసులు గాయపడ్డారు. దీంతో పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. కడప నగరంలో విఘ్నేశ్వరుని ఆలయం ఎదుట 12వ తేదీ హనుమాన్ విగ్రహావిష్కరణ నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు.

అలాగే హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ బైక్ ర్యాలీ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హనుమాన్ సర్కిల్ అని బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీంతో ముస్లింలు టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా నామకరణం చేయాలని పట్టుబట్టారు. అల్మాస్పేట సర్కిల్లో టిప్పు సుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, టిప్పు సుల్తాన్ సర్కిల్‌గా పేరు మార్చాలని చివరి సర్వసభ్య సమావేశంలో వైసిపి పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. అయితే దీన్ని వ్యతిరేకిస్తూ హిందూ సంఘాలు అలాగే బిజెపి ఆధ్వర్యంలో ఇక్కడ నిరసన కూడా తెలిపారు. అయితే ప్రస్తుతం ఇక్కడ రేపు హనుమత్ జయంతి సందర్భంగా 31 అడుగుల హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బ్యానర్లపై హనుమాన్ సర్కిల్ అని ఉండడంతో కొంతమంది ముస్లింలకు నచ్చలేదు. అల్మాస్పేట సర్కిల్‌కి సంబంధించి టిప్పు సుల్తాన్ బొమ్మతో కూడిన బ్యానర్ పట్టుకొని ముస్లింలు ఆందోళన చేపట్టారు. హిందువులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హిందువులు కూడా జై శ్రీరామ్ నినాదాలు చేశారు. పరిస్థితి చేయి దాటి రాళ్లు విసురుకున్నారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ఆందోళన కారులను చదరగొట్టారు. దీంతో పరిస్థితి కంట్రోల్ అయింది.

## పలువురు ఐఎఎస్ అధికారుల బదలీ

**విజయవాడ, మే 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పలువురు ఐఎఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఐఎఎస్ అధికారుల బదిలీలు, అదనపు బాధ్యతలపై ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు జివో ఆర్టీ నెంబర్ 918ను సిఎస్ జి.సాయి ప్రసాద్ జారీ చేశారు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగాఉన్న శశి భూషణ్ కుమార్‌కు జల వనరులశాఖ బాధ్యతలు అప్పగించింది. జల వనరుల శాఖ స్పెషల్ సిఎస్, ఫుల్ అడిషనల్ ఛార్జ్ భాత్యతలనుంటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జీ.సాయి ప్రసాద్‌కు ఉపశమనం లభించినట్లయింది. పర్యావరణ, అటవీ శాఖ ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పూర్తి అధనపు భాద్యతలు అప్పగించింది. వెంటనే ఈ ఉత్తర్వులు అమలు లోకి వస్తాయని ప్రభుత్వం వెల్లడించింది.

# నకిలీ డిఎస్పీ

# రూ. 40 లక్షల టోకరా!



డీఎస్పీ అవతారమెత్తిన సరస్వతి

### అప్పు ఎగ్గొట్టేందుకు కి(లేడి) దౌర్జన్యం

### పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

### 'అనంత'లో నయా మోసం

**అనంతపురం క్రైమ్ మే 9 ప్రభాతవార్త:** ఇటీవల అనంతపురం జిల్లాతో పాటు తెలుగు రాష్ట్రాల్లో కుదిపేసిన హనీ ట్రాప్ ఉదంతం మరవకముందే మరో నయా మోసం వెలుగు చూసింది. ఆర్థిక మోసాలకు, నేరాలకు అనంతపురం జిల్లా కేరాఫ్‌గా మారిందని జిల్లా వాసులు హడలెత్తిపోతున్నారు. ఓ లేడీ తాను మహిళా పోలీస్ స్టేషన్‌లో డిఎస్పీగా పనిచేస్తున్నానంటూ మరో దందాకు తెరలేపింది. పరిచయస్తుడితో 40 లక్షల దాకా అప్పుగా వసూలు చేసింది. తీసుకున్న అప్పు మూడేళ్లుగా తిరిగి చెల్లించకపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కట్ చేస్తే... కళ్యాణదుర్గం మండలం ముదినాయన పల్లి గ్రామానికి చెందిన సరస్వతి అనే మహిళ అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామానికి చెందిన రంగనాయకులతో పరిచయం ఏర్పడింది. తాను అనంతపురం లోని >>2

# గుంతలులేని రోడ్లు లక్ష్యం



శనివారం ప్రొద్దుటూరులో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న మంత్రి జనార్దన్ రెడ్డి

### వివిధ ప్రాంతాలలో రోడ్ల విస్తరణకు ప్రాధాన్యం

### ఆర్ అండ్ బిని నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వం: మంత్రి జనార్దన్ రెడ్డి

**ప్రొద్దుటూరు మే 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు ఏర్పాటు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన 5 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రొద్దుటూరు పట్టణంలోని కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముందుగా మంత్రి కొర్రపాడు రోడ్డులోని వాసవీ మాత శమీ దర్శన మందిరం వద్ద అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించి, శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం మంత్రి బిసి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్సీ ప్రభుత్వం గత 5 సంవత్సరాలలో ప్రజా వేదిక కూల్చి విధ్వంసంతో మొదలుపెట్టిందని, కూటమి ప్రభుత్వం వికాసం తో పాలన ప్రారంభించిందని తెలిపారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పులు చెల్లిస్తూ, గుంతలమయమైన రోడ్లకు మరమ్మత్తులు, నూతన రోడ్ల నిర్మాణం, సంక్షేమం, అభివృద్ధి, సూపర్ 6 అమలు, పారిశ్రామికీకరణ, ఉద్యోగాలు విడుదల చేస్తూ ఆదర్శవంతమైన పాలన సాగిస్తోందని వివరించారు. వైఎస్సార్సీ ప్రభుత్వం ఆర్ అండ్ బి శాఖను నిర్వీర్యం >>2



శనివారం బెంగాల్ సిఎం సువేందు అధికారిని అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

# పశ్చిమబెంగాల్ సిఎం సువేందు అధికారికి సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ,మే 9, ప్రభాతవార్తప్రతినిధి:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన సువేందు అధికారిని సిఎం చంద్రబాబు అభినందించారు. ప్రజాసేవ కోసం బాధ్యతలు స్వీకరిస్తున్న ఆయన మంత్రివర్గ సభ్యులందరికీ కూడా చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసంతో కొత్త ప్రభుత్వం తన పదవీకాలాన్ని ప్రారంభిస్తున్న ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతునన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ దూరదృష్టి నాయకత్వం, 'వికసిత భారత్' స్వప్నం స్ఫూర్తిగా ఈ ప్రభుత్వం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పశ్చిమబెంగాల్‌లో కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది.పశ్చిమబెంగాల్ సిఎంగా సువేందు అధికారి ప్రమాణస్వీకారం చేశారు. సువేందు అధికారితో సిఎంగా గవర్నర్ ప్రమాణం చేయించారు. మంత్రులుగా అగ్నిమిత్ర పాల్, దిలీప్ ఘోష్, అశోక్ కిర్తానియా, నిశిత్ ప్రామాణిక్, క్షుదిరామ్ టుడు ప్రమాణం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్, జేపీ నడ్డా, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు.

# మస్కట్ నుంచి స్వదేశానికి చేరుకున్న షహనాజ్ డి.సిఎం పవన్‌కు కృతజ్ఞతలు

**విజయవాడ మే 9 ప్రభాతవార్త ప్రతినిధి:** మస్కట్‌లో చిత్రహింసలకు గురై స్వదేశానికి చేరుకున్న షహనాజ్ అనే మహిళ డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మదనపల్లె ఎస్పీ, ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురానికి చెందిన షహనాజ్ ఉపాధి నిమిత్తం మస్కట్‌కు వెళ్లారు. అక్కడ సేఠ్ పెడుతున్న ఇబ్బందులు తట్టుకోలేక ఏడుస్తూ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అందులో పవనన్నా..నన్ను చంపేస్తారన్నా..ప్లీజ్ కాపాడన్నా అంటూ వేడుకున్నారు. స్పందించిన పవన్ షహనాజ్‌ను స్వదేశానికి రప్పించేందుకు చర్యలు చేపట్టారు. విదేశాంగ శాఖ, దౌత్య కార్యాలయాల అధికారులతో డిప్యూటీ సిఎం కార్యాలయం సంప్రదింపులు జరిపింది. పవన్, అధికారుల చొరవతో షహనాజ్ శుక్రవారం స్వస్థలానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమెతో పాటు కుటుంబసభ్యులు శనివారం మదనపల్లెలలోని ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, అదనపు ఎస్పీ వెంకటాద్రి, రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ దళారుల మాటలు నమ్మి విదేశాలకు వెళ్లి ఎవరూ మోసపోవద్దని సూచించారు.

# ప్రతి ఓటరు ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వామి కావాలి

## విజయవంతమైన ఎన్నికల నిర్వహణకు ఇది నూతన ఆరంభం

## ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్



శనివారం తిరుచానూరు ఆలయంలో అమ్మవారి ధ్వజస్తంభానికి మొక్కుతున్న సిఇసి జ్ఞానేశ్‌కుమార్

**తిరుమల,మే 9ప్రభాతవార్తప్రతినిధి:** ప్రతి ఓటరు ప్రజాస్వామ్య బలోపేతానికి భాగస్వామి కావాలని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. కుటుంబ ఓటర్లందరికీ ఇది ఒక కొత్త దినమని, విజయవంతమైన ఎన్నికల నిర్వహణకు ఇది నూతన ఆరంభంగా భావిస్తున్నానని అన్నారు. రెండురోజుల తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం తిరుమల శ్రీవారి ఆలయంలోనికి సిఇసి జ్ఞానేశ్‌కుమార్ దంపతులు చేరుకున్నారు. టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, తిరుమల డిఎస్పీ విజయశేఖర్ స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకున్నారు. వేదపండితులు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు సాయంత్రం తిరుచానూరులో పద్మావతి అమ్మవారిని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, టిటిడి జెఇఒ వీరబ్రహ్మాం ఉన్నారు.

# గుంతలులేని రోడ్లు లక్ష్యం

>> చేస్తే కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందన్నారు. నేటికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పెట్టుబడిదారులను బెదిరించాలని చూడటం దారుణమన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అభివృద్ధి పట్ల నిబద్ధత కలిగిన వ్యక్తి అని, తనను ఆయన ఎప్పుడు కలిసినా అభివృద్ధి పనులే కోరతారన్నారు. ఇంత అనుభవం వున్న నాయకుడు అభివృద్ధి ని కాంక్షి స్తూ, శాంతియుత వాతావరణం నెలకొల్పితే, ప్రతిపక్షాలు బురదజల్లడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ అభివృద్ధి పట్ల చిత్తశుద్ధితో వున్నారని స్పష్టం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు తమ పాలనలో జరిగిన మంచిని ఇంటింటికి తెలిపి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి మున్సిపాలిటీ, పంచాయితీ కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ముందుగా టిడిపి యువ నాయకులు నంద్యాల కొండారెడ్డి మాట్లాడుతూ కొర్రపాడు రోడ్డు విస్తరణ పనుల కోసం గత 10 సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రజలకు ప్రస్తుతం ఆ కల నెరవేరిందన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన ఆర్టీపిపి థర్మల్ రోడ్డు ను కూడా కూటమి ప్రభుత్వంలో బిల్లులు మంజూరు చేయించి, పూర్తి చేస్తున్నామని వివరించారు. అదేవిధంగా పట్టణంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి డిమార్ట్ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ, రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి వాసవీ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ పనులు, అదేవిధంగా లింగాపురం, కల్లూరు రోడ్డు నిర్మాణం, పొట్టిపాడు రోడ్డు విస్తరణ పనులకు వెరసి మొత్తంగా పట్టణంలో దాదాపు 90 కోట్ల రూపాయల నిధులు మంత్రి జనార్ధన్ రెడ్డి మంజూరు చేశారని వివరించారు. ప్రొద్దుటూరు పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారులు జమ్మలమడుగు రోడ్డు, మైదుకూరు రోడ్డు, ఎర్రగుంట్ల రోడ్డు, కొర్రపాడు రోడ్డు అవసరమైన మేరకు 100 అడుగుల వరకు విస్తరణ, వాసవీ సర్కిల్, రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద వున్న సర్కిల్ ను పట్టణానికి తలమానికంగా రూపొందించడానికి ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కాగా ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం మంత్రులు, అధికారుల సహకారం మరువలేనిదని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో దాదాపు గత 10 సంవత్సరాలుగా అభివృద్ధి కుంటుపడిన నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల సహకారంతో నిధులు మంజూరై అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. తమకు ప్రభుత్వం అందించే ప్రతి రూపాయిని సక్రమంగా వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణానికి మంత్రి జనార్ధన్ రెడ్డి వస్తున్నారని తెలిసి ఈ కొర్రపాడు రోడ్డు విస్తరణ పనుల ప్రారంభోత్సవం ఏర్పాటు చేశామని, ఆయన విచ్చేయడం ఆనందకరమన్నారు.

# బెంగాల్ పగ్గాలు

>> రేఖా గుప్తాలతో పాటు వివిధ రాష్ట్రాల సిఎంలు హాజరయ్యారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో బిజెపి చారిత్రాత్మక విజయం సాధించిన విషయం తెలిసిందే. 207 స్థానాలను కైవసం చేసుకుని, పశ్చిమ బెంగాల్‌లో ప్రాంతీయ రాజకీయ శక్తుల దీర్ఘకాలిక ఆధిపత్యానికి తెరదించి కొత్త రాజకీయ అధ్యాయానికి నాంది పలికింది.

**ఐదుగురు మంత్రులు ప్రమాణస్వీకారం**

పశ్చిమ బెంగాల్‌లో తొలి బిజెపి ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి బాధ్యతలు స్వీకరించడంతో, ఆయన కొత్తగా ఏర్పాటుచేసిన మంత్రివర్గంలో పాత, కొత్త ముఖాల కలయిక కనిపించింది. ప్రాంతాలు, వర్గాల మధ్య సమతుల్యత కనిపిస్తున్నది. ఇందులో మహిళలతో పాటు రాజబన్షీ, మతువా, గిరిజన వర్గాలకు కూడా ప్రాతినిధ్యం ఉంది. అధికారితో పాటు, దిలీప్ ఘోష్, అగ్నిమిత్ర పాల్, నిసిత్ ప్రమణిక్, ఖుదీరామ్ టుడు, అశోక్ కీర్తనియాతో సహా ఐదుగురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ఘోష్, పాల్‌లను అధికారికి డిప్యూటీలుగా నియమించే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.

**ముఖ్యమంత్రిగా నా ప్రాధాన్యతలివే!**

పశ్చిమ బెంగాల్ తొమ్మిదవ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత, సువేందు అధికారి ఒక పరిపూర్ణ రాజనీతిజ్ఞుడిలా వ్యవహరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం రవీంద్రనాథ్ టాగోర్ జయంతి రోజునే జరగడం విశేషం. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, టాగోర్ జన్మస్థలమైన జోరాసంకో ఠాకూర్‌బారిని సందర్శించిన అధికారి తన తొలి వ్యాఖ్యలలో "ఇది ఒక పవిత్రమైన రోజున జరిగిన శుభారంభం" అని అన్నారు. కొత్త ముఖ్యమంత్రిగా తన ప్రాధాన్యత విద్య, సంస్కృతి వంటి రంగాలలో రాష్ట్రం కోల్పోయిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమేనని, కాబట్టి ఇతరులను విమర్శించడానికి తనకు ఇప్పుడు సమయం లేదని ఆయన పేర్కొన్నారు. "బెంగాల్ ఇప్పటికే ఎన్నో నష్టాలను చవిచూసింది. పశ్చిమ బెంగాల్ గొప్ప సంస్కృతి చాలా వరకు దెబ్బతింది. విద్యా రంగం కుప్పకూలింది. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌ను పునర్నిర్మించడమే నా బాధ్యత. ఈ బాధ్యతలు చాలా భారీగా ఉన్నాయి. కాబట్టి ప్రస్తుతానికి, ఇతరులను విమర్శించడానికి నాకు సమయం లేదు" అని అధికారి వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా తాను ఎటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా ఉంటానని కూడా ముఖ్యమంత్రి అధికారి తెలిపారు. "విమర్శించాలనుకునే వారు విమర్శించడం కొనసాగించవచ్చు. ప్రజలలో, ముఖ్యంగా ఈసారి పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలను ఇప్పటికీ విమర్శిస్తున్న వారిలో, సద్బుద్ధి కలగాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. "పశ్చిమ బెంగాల్ ఇప్పుడు ప్రగతి, అభివృద్ధి, పరిపూర్ణత దిశగా పయనిస్తుందని తాను దృఢంగా విశ్వసిస్తున్నాను," అని సీఎం అధికారి అన్నారు.

# విజయుడే..

>> అర్లేకర్ ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించారు. దీనితో టివికె శ్రేణులు మొత్తం సంబరాల్లో మునిగిపోయారు. ఇప్పటివరకూ 107 స్థానాలు మెజార్టీ ఉన్న విజయ్ సొంతపార్టీకి కాంగ్రెస్ ఐదుస్థానాలు తోడు కావడంతో 112కి చేరింది. సిపిఐ, సిపిఎం, విసికె, ఐయుఎంఎల్ పార్టీలకు ఉన్న రెండేసి స్థానాలు మొత్తం మద్దతుప్రకటించడంతో మెజార్టీమార్కు దాటి 120కి చేరింది. దీనితో గవర్నర్ సంతృప్తివ్యక్తంచేస్తూ తమిళనాడు ముఖ్యమంత్రిగా జోసెఫ్ విజయ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించి ప్రభుత్వం ఏర్పాటుచేయాలని ఆహ్వానించారు. దీనితో పతాకస్థాయిలో జరిగిన చర్చలు, ససేమిరా అన్న డిఎంకె మిత్రపక్షాలు ఎట్టకేలకు శాంతించినట్లయింది. ముందురోజు అర్ధరాత్రివరకూ తాము టివికెకు మద్దతివ్వడంలేదని విసికె, ఐయుఎంఎల్ పార్టీలు తెగేసి చెప్పాయి. డిఎంకె అధ్యక్షుడు స్టాలిన్‌ను కలిసిన తర్వాత వారు పత్తాలేకుండాపోయారు. అలాగే సిపిఐ, సిపిఎం పార్టీలుకూడా తాము బయటినుంచి మద్దతిస్తామని ప్రభుత్వంలోచేరమని ప్రకటించాయి. మతతత్వశక్తులకు ఆస్కారం ఇవ్వకూడదన్న లక్ష్యంతోనే సుస్థిర ప్రభుత్వం ఏర్పాటుకోసం టివికె పార్టీ, అధినేత విజయ్‌కు సంపూర్ణమద్దతుప్రకటిస్తున్నట్లు చెప్పాయి. వాస్తవానికి శనివారం కూడా ఉత్కంఠతోనే కొనసాగింది. సాయంత్రంవరకూ విజయ్‌కు గవర్నర్ అర్లేకర్ అపాయింట్‌మెంట్ లభించలేదు. ముందుగా ఏర్పాటుచేసుకున్న కార్యక్రమాలకారణంగా గవర్నర్ కేరళకు వెళతారని లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే గవర్నర్ తనపర్యటనను వాయిదావేసుకుని విజయ్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వడంతో ఈసారి తనకు మద్దతుఇస్తున్న పార్టీల నాయకులను వెంటబెట్టుకుని మరీ వెళ్లారు. అలాగే ఆపార్టీల నాయకులు ఇచ్చిన లేఖలను సైతం అందచేయడంతో సమగ్ర పరిశీలన అనంతరంప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించారు. మొత్తంగాచూస్తే గవర్నర్ అర్లేకర్‌ను విజయ్ నాలుగుపర్యాయాలు కలుసుకున్నారు. చివరకు సాయంత్రం 6.15 గంటలప్రాంతంలో నాలుగోసారి అపాయింట్‌మెంట్‌లో టివికె చీఫ్‌కు లైన్ క్లియర్ అయింది.

**ప్రమాణస్వీకారం సమయం మార్పు...**

ముందుగా అనుకున్నట్లు విజయ్ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రమాణ స్వీకారంచేస్తారని పార్టీనేతలుప్రకటించారు. అయితే గవర్నర్ ఇచ్చినలేఖలో ఉదయం పది గంటలకు విజయ్ ప్రమాణ స్వీకారంచేస్తారని ఉంది. దీనితో సమయాన్ని గవర్నర్‌ప్రకటించినట్లుగానే ఉదయం పది గంటలకు మార్చారు. అయితే అసెంబ్లీలో బలనిరూపణను విజయ్ ఈనెల 13వ తేదీలోపు నిరూపించుకోవాలని గవర్నర్ తన లేఖలో వివరించారు.

**విజయ్‌తోపాటు కేబినెట్‌లో 9 మంది...**

కాగా కేబినెట్ మంత్రులు కూడా విజయ్‌తోపాటు తొమ్మిదిమంది మొత్తంప్రమాణ స్వీకారంచేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పరిపాలన, హోంమంత్రిత్వశాఖలు విజయ్‌వద్దనే ఉంటాయని చెపుతున్నారు. ప్రజాపనులశాఖకు సెంగొట్టియాన్, అర్బన్ పాలనా శాఖకు ఎన్ ఆనంద్, విద్యుత్‌మంత్రిగా సిడిఆర్‌నిర్మల్ కుమార్; క్రీడలు మద్యనిషేధశాఖమంత్రిగా అథవ్ అర్జునలకు స్థానం కల్పిస్తారని చెపుతున్నారు. అయితే ఇవన్నీ సోషల్‌మీడియాలో వచ్చినవి మాత్రమే కావడంతో వాటికిఅంతగా విశ్వసనీయతలేదు.

**ఎఐఎడిఎంకె చీలికవర్గం రెడీ...!**

ఇదిలా ఉంటేఅన్నాడిఎంకెలో 12 మంది ఎమ్మెల్యేలు పళనిసామి నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరంతాకూడా టివికెలోని అథవ్ అర్జున్‌కుటచ్‌లోకి వచ్చారని సమాచారం. మూకుమ్మడిగా అన్నాడిఎంకెకు రాజీనామాచేసి ఒకప్రత్యేక కూటమిగా టివికె విజయ్‌కు మద్దతిచ్చేవిధంగా రహస్య మంతనాలుజరుగుతున్నాయి. అన్నాడిఎంకె ఏర్పాటుచేసినఅత్యవసర సమావేశానికి వీరెవ్వరూ కూడా శనివారం హాజరుకాకపోవడంతో మరిన్ని ఊహాగానాలకు అవకాశం ఇచ్చినట్లయింది. దీనికితోడు బయటినుంచి మద్దతుమాత్రమే ఉన్నందున ఏనిమిషంలో అయినా ముప్పు ఉంటుందని అందుకే ముందుజాగ్రత్తగా సమీకరణలు మార్చుకోవాలనికూడా విజయ్‌పార్టీ సీనియర్లు భావిస్తున్నారు.

# రేపు ఢిల్లీ వెళ్లనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే 9,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 11న ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర హోంశాఖ, జలశక్తి, ఇతర కేంద్రమంత్రులను చంద్రబాబు కలవనున్నారు. జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సిఎం చంద్రబాబు భేటీ కానున్నారు. సిఎం వెంట మంత్రి నిమ్మల, సిఎస్ సాయిప్రసాద్, ఇతర అధికారులు ఉంటారు. పోలవరం పురోగతి, పునరావాసం, రెండోదశ పనులపై సీఎం చర్చించనున్నారు. అనంతరం సీఐఐ వార్షిక సదస్సుకు సీఎం చంద్రబాబు హాజరుకానున్నారు.

# సమ న్యాయం

>> మూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేయాలంటే బార్ మరియు బెంచ్ మధ్య పరస్పర గౌరవం, సహకారం, సమన్వయం అత్యంత అవసరమని పేర్కొన్నారు.కార్యక్రమంలో జస్టిస్ ఆర్. రఘునందన్ రావు, జస్టిస్ బి.వి.ఎల్.ఎన్. చక్రవర్తి, జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిహెచ్.వి. ప్రసాద్, పలువుర న్యాయ మూర్తులు, న్యాయ వాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, ఎస్పీ డి నరసింహ కిషోర్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా,తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

10-05-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
అష్టమి మ.3.01
ధనిష్ఠ మ.12.46
వర్జ్యం : లేదు
దు.సా.4.42-సా.5.33
రాహుకాలం - సా.4.30-6.00

## వారఫలం

**మేషం:** ఇంటి యందు శుభకార్యాలు జరుగుతాయి. ఒక అవకాశం వెతుక్కుంటూ రాగలదు. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**వృషభం:** వ్యాపారాలకు సంబంధించిన ఒప్పందాలు కుదురుతాయి. అనూహ్యంగా స్థిరాస్తుల ధరలు పెరుగుతాయి.

**మిథునం:** రహస్య చర్యలు ఫలిస్తాయి. ఇతరులను ఆర్థికముగా ఆదుకుంటారు. పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు.

**కర్కాటకం:** డాక్యుమెంట్స్ లిఖిత పూర్వము వ్యవహారముల యందు జాగ్రత్తను వహించాలి. నూతన విద్యావకాశాలు.

**సింహం:** వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకుని ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. స్థలాలు కొనుగోలు యత్నాలు సాధిస్తారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. షేర్లు, భూముల క్రియ విక్రయాలలో లాభాలు అందుకుంటారు.

**తుల :** సున్నితమైన అంశములతోటి, వివాదాస్పదమైన వ్యక్తుల తోటి ముడిపడి ఉంటాయి. ఉద్యోగులకు స్థానచలనం.

**వృశ్చికం:** ఓర్పు, నేర్పులతోనే కార్యసాధన ఔతుంది. సహనమునకు పరీక్షలు ఎదురు అవుతాయి. సేవాకార్యక్రమాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** ముఖ్యముగా గంటలు, గంటలుగా ప్రతి విషయంలో ఆలోచించే విధానానికి స్వస్తి చెప్పండి. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

**మకరం:** మీ సలహాలు, నైపుణ్యము మకు కాక ఇతరులకు ఉపయోగపడతారు. పొదుపు పథకాలు కలిసి వస్తాయి.

**కుంభం:** మీకు రావలసిన ప్రతి ఫలము కొద్దిగా మాత్రమే చేతికి అందుతుంది. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** న్యాయబద్ధమైన రావలసిన ధనము వాయిదాల వద్దతిలో డొనేషన్స్‌ను స్వీకరించినట్లుగా తీసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం కైలాసగిరి కొండపై ఉన్న గ్లాస్ బ్రిడ్జిన సందర్శించిన మంత్రి నారాయణ తదితరులు

# గ్లాస్ బ్రిడ్జి ప్రధాన ఆకర్షణ: మంత్రి నారాయణ

**విశాఖపట్నం, మే 9 ప్రభాతవార్త:** కైలాసగిరి కొండపై ఇటీవల ప్రారంభించిన గ్లాస్ బ్రిడ్జిను మంత్రి పి నారాయణ సందర్శించారు. శనివారం ఉదయం కైలాసగిరి పై త్రిశూల్‌ను ప్రారంభించిన తర్వాత వి ఎంఆర్‌డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ గ్లాస్ బ్రిడ్జి గురించి మంత్రి వర్యులకు వివరించారు. దీంతో అత్యంత ప్రజా ఆదరణ పొందిన గ్లాస్ బ్రిడ్జిను ఆయన సందర్శించారు. ఆయనతో పాటు ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి, లోకం మాధవి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ సతీష్, విఎంఆర్‌డిఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ కూడా గ్లాస్ బ్రిడ్జి పై కొంత సమయం గడిపారు. గ్లాస్ బ్రిడ్జి నగర పర్యాటకులను మరింత ఆకట్టుకుంటుందని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# విశాఖలో 'త్రిశూల్' వైభవం

>> శాఖ మంత్రి పి. నారాయణ, రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ., సెర్ప్, ఎన్.ఆర్.ఐ సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్ , విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, వంశీ కృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణ మూర్తి, లోకం నాగ మాధవి, విఎంఆర్డిఏ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ , మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ .తేజ్ భరత్, తదితరులు పాల్గొని త్రిశూల్ శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర మంత్రి పి. నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యాటకానికి పెద్ద పీట వేస్తున్నారని, పర్యాటకం ద్వారా ఆదాయం రావటమే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కైలాసగిరి ఒక పర్యాటక హబ్ గా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేయటం జరిగిందన్నారు. 65 అడుగుల ఎత్తున త్రిశూల్ ను ఏర్పాటుచేసిన వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ని, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్‌కి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ నగరాన్ని అత్యున్నత నగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎనలేని కృషి చేస్తున్నారని, వేల కోట్లు పెట్టుబడులు తీసుకువస్తున్నారు అని పేర్కొన్నారు. త్రిశూల్ అనేది వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ కల అని, అది ఈరోజు సాకారమైందని అన్నారు. కైలాసగిరి పై ప్రారంభించిన త్రిశూల్ విశాఖ పర్యాటకానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీ భరత్ మాట్లాడుతూ కైలాసగిరి పై నలుమూలల నుంచి కనిపించేలా ఏర్పాటుచేసిన త్రిశూల్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందన్నారు. కైలాసగిరి నీ మరింత అభివృద్ధి చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందించటం కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. గాలుల తీవ్రతను తట్టుకునేలా త్రిశూల్ నిర్మాణం జరిగిందన్నారు. ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యే లు పల్లా శ్రీనివాసరావు, విష్ణు కుమార్ రాజు, బండారు సత్యనారాయణ మూర్తి, పంచకర్ల రమేష్ బాబు, లోకం మాధవి, విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

## బాలిక ఫిర్యాదుపై నమోదు

## సాయి భగీరథ్ ఫిర్యాదుతో బాలిక, ఆమె తల్లిదండ్రులపై కరీంనగర్‌లో మరో కేసు నమోదు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో పోక్సో కేసు నమోదయ్యింది. గత డిసెంబర్ 31వ తేదీన శివార్లలోని చేవెళ్ల పరిధిలోని ఆలూరులో ఒక ఫాం హౌస్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల సందర్భంగా స్నేహితులతో కలిసి వున్న సమయంలో సాయి భగీరథ్ తన పట్ల రెండుసార్లు అసభ్యంగా ప్రవర్తించాడని, మద్యం తాగమని బలవంతం చేశాడని 17 ఏళ్ల బాలిక శుక్రవారం రాత్రి మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు సాయి భగీరథ్‌పై బిఎన్ఎస్ 74, 75 సెక్షన్లతో పాటు పోక్సో సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. కాగా ఈ ఘటనపై డిసిపి కోటిరెడ్డి ప్రభాతవార్తతో మాట్లాడుతూ బాధిత బాలిక ఫిర్యాదు మేరకు సాయి భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, నిందితుడికి నోటీసులు ఇస్తామని, దీనిపై సాక్షాలు, ఆధారాల ప్రకారం విచారణ వుంటుందని తెలిపారు.

**సాయి భగీరథ్ ఫిర్యాదు మేరకు కరీంనగర్‌లో బాలికతో పాటు తల్లిదండ్రులపై కేసు నమోదు**

ఇదిలావుండగా బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై బ్లాక్ మెయిల్ కింద మరో కేసు నమోదు చేశారు. సదరు బాలిక తనకు స్నేహితుల ద్వారా పరిచయం అయ్యిందని, ఇతర స్నేహితులతో వున్నట్లుగానే ఆ బాలికతోనూ తాను మర్యాదగా వున్నానని, అయితే కొంతకాలంగా ఆమెను వివాహం చేసుకోమని తల్లిదండ్రులు వేధించసాగారని సాయి భగీరథ్ తన ఫిర్యాదులో తెలిపారు. వీరి వేధింపులు తాళలేక ఒకసారి 50 వేల రూపాయలు ఇచ్చానని, తాజాగా ఐదు కోట్ల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని సాయి భగీరథ్ తెలిపాడు. బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు చాలా మందిని వేధిస్తున్నారని అతను తెలిపారు. వీరిపై నిర్మల్ పోలీసు స్టేషన్‌లో గత ఏప్రిల్ నెలలో కేసు నమోదయ్యిందని సాయి భగీరథ్ తెలిపాడు.

**సాయి భగీరథ్‌పై చర్యలకు సబితా రెడ్డి డిమాండ్**

కాగా సాయి భగీరథ్ వ్యవహారంపై మాజీ మంత్రి సబితా రెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ మైనర్ బాలిక పట్ల అతని ప్రవర్తన దారుణంగా వుందని అన్నారు. ఈ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించి, సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఇదే ఘటనపై బిఆర్ఎస్ నేత, మాజీ పోలీసు అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మైనర్ బాలికపట్ల బండి సంజయ్ కుమారుడు అనుచితంగా ప్రవర్తించడం దారుణమని, అతన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# రూ. 40 లక్షల టోకరా!

>> మహిళా పోలీస్స్టేషన్‌లో డిఎస్పీగా డ్యూటీ చేస్తున్నానని నమ్మబలికింది. ఈ నేపథ్యంలో 2023లో రంగనాయకులు వరుసకు సోదరుడైన రామానాయుడును రంగనాయకులు సరస్వతిని పరిచయం చేశాడు. ఈ పరిచయం నేపథ్యంలో సరస్వతి రామానాయుడితో వున్న పరిచయంతో అప్పుగా డబ్బులు అడిగింది. ఇంట్లో తన పిల్లలకు ఆరోగ్యం సరిగా లేనందున ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నానని, అత్యవసరంగా డబ్బులు అవసరమని, తనకు డబ్బులు అప్పుగా ఇవ్వాలని భరోసా కల్పించింది. ఇలా పలు మార్లు కుటుంబ అవసరాల కోసం, వ్యక్తి గత అవసరం నిమిత్తం అప్పు చేసింది. దీంతో రామానాయుడు పలు దఫాల్లో రూ.40 లక్షల దాకా సరస్వతికి అప్పు ఇచ్చాడు. తీసుకున్న అప్పుకు సరిపడా ప్రాంసరీ నోట్లు రాయించుకున్నాడు. అయితే కొంతకాలం గడిచాక తన వద్ద తీసుకున్న అప్పు తీర్చాలని సరస్వతిని కోరాడు. తనకు మంచి ఆస్తుపాసులు ఉన్నాయని, తన తమ్ముడు సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తున్నాడని అప్పు తీర్చేస్తానని నమ్మబలికింది. ఇలా మూడేళ్లుగా ఇవే మాటలు ప్రతిసారి చెప్పసాగింది. చివరకు అప్పు తీర్చమని గట్టిగా దబాయించడంతో సరస్వతి బాధితునిపై ఎదురుదాడికి దిగింది. తీసుకున్న అప్పు ఇచ్చేది లేదని, నీ చేత ఏమైతే అది చేసుకోపో అంటూ బుకాయించింది. ఎక్కువ మాట్లాడితే నీకు ఇబ్బంది తప్పదని బెదిరించసాగింది. ఇలా పలు దఫాలుగా బాధితుడు రామానాయుడుకు సరస్వతి నుండి బెదిరింపులు రావడంతో తాను మోసపోయానని గ్రహించాడు. అయితే ఇచ్చిన అప్పు తిరిగి ఇవ్వడమే కాకుండా తనపై దౌర్జన్యానికి పాల్పడుతోందని బాధితుడు లబోదిబోమన్నాడు. పలుమార్లు సరస్వతికి ఫోన్ చేసినా అందుబాటులోకి రావడంలేదని బాధితుడు రామానాయుడు వాపోతున్నాడు. చివరకు చేసేది లేక పోలీసులను ఆశ్రయించాడు. అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సరస్వతిపై ఫిర్యాదు చేశాడు. రామానాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్చార్జి సీఐ పుల్లయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# పోలీసులకు సవాల్ విసురుతున్న వరుస నేరాలు

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న నేరాలు, రాజకీయ ప్రేరేపిత ఘటనలు పోలీసులకు సవాల్ విసురుతున్నాయి. ఓవైపు దొంగతనాలు, పట్ట పగలు నగల దుకాణాల లూటీలు, ఇంకోవైపు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల మాఫియా కార్యకలాపాలు, రోడ్డు ప్రమాదాలు, పోలీసులను ఉక్కిరి బిక్కిరి చేస్తుండగా మరోవైపు రాష్ట్రంలో ఆయా ప్రాంతాలలో రాజకీయ పార్టీలు ఒకరిపై మరొకరు ఇష్టానుసారం దూషించుకుంటూ పరస్పరం దాడులకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఇదే సమయంలో అనేకచోట్ల పరువు హత్యలు, కుటుంబ హత్యలు, పాత కక్షల కారణంగా జరిగే హత్యలు పెట్రేగిపోతున్నాయి. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో గణాంకాల ప్రకారం శాంతి భద్రతలు, నేరాలకు సంబంధించి రాష్ట్రం మంచి రికార్డులు కలిగివున్నా క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులు వుండడం గమనార్హం. తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే నంబర్‌గా వుందని సిఎం, మంత్రులు మొదలుకొని పోలీసు ఉన్నతాధికారుల వరకు పదేపదే వేదికల సాక్షిగా చెబుతున్నా నేరాల సంఖ్య పెరిగిపోతున్నాయి. టెక్నాలజీని వాడి నేరాలను నివారిస్తామని, ఫ్రెండ్లీ పోలిసింగ్‌తో శాంతి భద్రతలను కాపాడతామని పోలీసులు చెబుతున్నా వాస్తవంలో ఇది సత్ఫలితాలను ఇవ్వడం లేదని పోలీసులే చెబుతున్నారు. ఇలా జరగడానికి అనేక కారణాలున్నాయి. ఇందులో మొదటిది బేసిక్ పోలిసింగ్‌కు పోలీసులు దూరమవుతుండడం, రెండవది పోలీసు భర్తీలు క్రమం తప్పకుండా జరగకపోవడం, జనాభాకు అనుగుణగా కనీస స్థాయిలో అయినా సిబ్బంది పెరగక పోవడంగా నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఏయేటికాయేడు పట్టణీకరణ పెరుగుతూపోతుండగా ఆయా ప్రాంతాల పోలీసు వ్యవస్థ ఇప్పటికీ గ్రామీణ పోలీసు విభాగాల స్థాయిని దాటడం లేదనేది కాదనలేని వాస్తవం. పోలీసు సిబ్బందిని భారీ స్థాయిలో కాకున్నా కనీస స్థాయిలో అయినా నిపుణుల సూచనల మేరకు పెంచాల్సిన అవసరం ఎంతయినా వుంది. ఇకపోలీసు ఆధునీకరణ భవనాల నిర్మాణం, సిసి కెమెరాల ఏర్పాటు వరకే పరిమితం కాగా, పోలీసు శాఖలో అవినీతి అధికారుల ఏరివేత కాగితాలకే పరిమితమయ్యింది. రాజకీయ సిఫార్సులతో పోస్టింగులు విపరీతంగా పెరిగిపోతున్నాయనే విమర్శలు ఎక్కువగా వుండగా దీనివల్ల సమర్థులైన అధికారులు ఏళ్ల తరబడి లూప్‌లైన్‌లోనే వుంటూ అక్కడే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక పోలీసు శాఖకు సర్కారు గతంలో ఎన్నడు లేనంతగా ప్రాధాన్యతను ఇవ్వడం తెలిసిందే. ఇదే సమయంలో కేంద్ర హోం శాఖ కూడా ఆధునీకరణ



విషయంలో పెద్దఎత్తున నిధులను మంజూరు చేస్తోంది. దీంతో పాటు పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసు అంశానికి మరింత తోడ్పాటును అందించేందుకు ప్రజలతో మరింత సత్సంబంధాలు పెంచుకునేందుకు రిసెప్షన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఇక కేంద్రం అందిస్తున్న నిధులతో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు నేరాల నివారణ, నేరగాళ్ల పట్టివేత కోసం సిసిటిఎన్ఎస్ పేరిట మరో పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఇదంతా నాణానికి ఒకవైపు మాత్రమేనని చెప్పాలి. రెండవ వైపు వున్న అంశాన్ని పరిశీలిస్తే పోలీసు శాఖను క్షేత్రస్థాయిలో పరిపుష్టి చేయడంతో పాటు పూర్తి స్థాయిలో బలోపేతం చేసేందుకు సర్కారు ఇంకా చాలా చేయాల్సి వుందని పోలీసు అధికారులే అంటున్నారు. తెలంగాణ పోలీసు శాఖలో ప్రస్తుతం కొత్త భవనాల నిర్మాణం ఓవైపు పాత భవనాలకు కొత్త సొగసులు అద్దడం వేగంగా జరుగుతున్నాయి. దీనివల్ల పోలీసు స్టేషన్లకు కార్పొరేట్ హంగులు సమకూరాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే ఇదే సమయంలో ఖాళీల భర్తీ వేగంగా జరగడం లేదు. అవసరం అయినచోట అదనపు సిబ్బంది సమకూరడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లలో అదనపు సిబ్బంది గురించి ఇక్కడి అధికారులు చాలా కాలంగా సర్కారును కోరుతున్నా దీనిపై పాలకుల నుంచి పెద్దగా స్పందన కానరావడం లేదు. దేశంలో ఐదవ అతిపెద్ద పోలీసు కమిషనరేట్‌గా వున్న హైదరాబాద్ సిటీ పోలీసు విభాగంలో సిబ్బంది కొరత మరింత తీవ్రంగా వుంది. దీంతో ఇక్కడి అధికారులు చాలా సందర్భాలలో హోంగార్డులతో నెట్టుకు వస్తుండడంతోపాటు సిబ్బందిపై అదనపు భారాన్ని మోపుతున్నారు. సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధుల్లోనూ ఇటువంటి పరిస్థితులే వున్నాయని చెప్పాలి. అరకొర సిబ్బందితో శాంతి భద్రతల పర్యవేక్షణ, నేరాల నివారణ, ట్రాఫిక్ అజమాయిషీ తోపాటు వివిఐపిల బందోబస్తు ఇతరత్రా విధుల నిర్వహణ ఈ మూడు కమిషనరేట్ల అధికారులకు అనేకసార్లు తలప్రాణం తోకకు వస్తోందని చెప్పాలి. హైదరాబాద్‌లో గడచిన రెండేళ్ల కాలంలో జరిగిన ప్రపంచ స్థాయి సదస్సులు, ప్రముఖుల పర్యటనలకు బందోబస్తు ఏర్పాటు చేయడం కోసం పోలీసులు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. ఓవైపు సిబ్బంది కొరత ఇంకోవైపు భర్తీ కానీ ఖాళీలతో ఇబ్బంది పడుతున్న ఇక్కడి అధికారులకు కొత్తగా వచ్చి చేరుతున్న వాహనాలకు డ్రైవర్లను సమకూర్చడం కూడా కొన్ని సార్లు కష్టంగా మారుతోంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, కమిషనరేట్లలోనూ దాదాపు ఇదే పరిస్థితులు వున్నాయంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న చోరీలు, పట్టపగలు నగల దుకాణాలలో చొరబడుతూ, సిబ్బందిపై కాల్పులు జరుపుతూ నగలనులూటీ చేస్తున్న ఘటనలు, ఎటిఎంల చోరీలు, ఎటిఎంల వద్ద నగదు వుంచే వారిపై కాల్పులు జరిపి మరీ దోపిడి చేస్తున్న ముఠాల ఉదంతాలు ఆయా ప్రాంతాల పోలీసులకు పెను సవాల్‌గా మారుతున్నాయి. ఈ తరహా నేరాలలో నిందితులుగా వున్న వారిలో అనేక మంది ఇతర ప్రాంతాలకు చెందిన వారు కావడం, వీరిలో చాలామంది కొత్తవారు వుండడం, వీరికి సం బంధించిన సమాచార సేకరణ, అరెస్టు చేయడం పోలీసులకు కష్టంగా మారుతోంది. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలు ముఖ్యంగా ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాల పోలీసుల సహ కారం ఇక్కడి పోలీసులకు అంతగాలభించక పోవడం పోలీసులకు సమస్యగా మారింది. దీనిపై ఆయా రాష్ట్రాలలో కొత్తగా నేరాలు చేస్తున్న వారి వివరాలను తెప్పించుకోవడం తో పాటు ఇక్కడ జరిగిన నేరాలతో వాటిని ఎప్పటికప్పుడు సరిచూసుకుంటే ఇక్కడి నేరాలను నియంత్రించే వీలుంటుందని విశ్రాంత పోలీసులు చెబుతున్నారు. కొత్తగా నేరస్తులుగా మారుతున్న యువత విషయం లో తల్లిదండ్రుల పాత్ర కీలకంగా వుండాలని, తమ వారిని నేరాలవైపు మళ్లకుండా జాగ్రత్తగా వుండేలా పోలీసులు కృషి చేయాలని విశ్రాంత పోలీసు అధికారులు చెబుతున్నారు. ఇక గడచిన కొంతకాలంగా రాజకీయ ప్రేరేపిత ఘటనల వల్ల అనేకచోట్ల రెండు పార్టీల మధ్య వివాదాలు మొదలై, గొడవలకు దారితీస్తూ పరస్పరం దాడుల వరకు వెళుతున్నాయి. కరీంనగర్‌లో గురువారం నాడు బిఆర్ఎస్ నేతలు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై చేసిన విమర్శలు శృతిమించడంతో బిజెపి నాయకులు ఒక్కసారిగా దాడికి దిగారు. ఇదే సమయంలో బిఆర్ఎస్ నాయకులు ఎదురుదాడికి దిగడంతో పరస్పరం కొట్టుకునే వరకు పరిస్థితులు వెళ్లాయి. ఈ వివాదం కారణంగా శనివారం నాడు బిఆర్ఎస్ నాయకులు కరీంనగర్ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈతరహా గొడవలు ఇంతకు ముందు కూడా అనేక పార్టీల మధ్య జరిగాయి. ఈ ఘటనలు పోలీసులకు మనశాంతి లేకుండా చేస్తున్నాయి. ●

రాష్ట్రంలో జరుగుతున్న నేరాలలో 70 శాతం ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాలకు చెందిన వారే వుండడం ఇక్కడి పోలీసులకు తలనొప్పిగా మారింది. స్నాచింగ్‌ల వరకువస్తే ఉత్తరాది నేరగాళ్లు, దృష్టి మరల్చి నేరాలుచేసే నేరస్థులు తమిళనాడుకు చెందిన వారు ఎక్కువగా వుండేవారు. బ్యాంకు దోపిడీలు, బంగారు నగల లూటీలు, కిడ్నాప్‌లు ఉత్తరాది, పశ్చిమాది రాష్ట్రాల నేరగాళ్లు,వైట్‌కాలర్ నేరాలకు తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల నేరస్థులు కారకులయ్యే వారు. ఇదే సమయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేరగాళ్లు కూడా కొన్ని రకాల నేరాల్లో వుండేవారు, వీరంతా స్నాచింగ్‌లు, నకిలీ కరెన్సీ చలామణి,తాళాలు వేసిన ఇళ్లకు కన్నాలు వేయడం వంటి నేరాల్లో కూడా ఇక్కడి వారు వుంటునాన్నరు. అయితే ఇటీవల కాలంలో అన్ని నేరాలలో ఇతర ప్రాంతాల నేరగాళ్ల హస్తం ఎక్కువగా వుండడం వల్ల వారి గురించిన సమాచారం పోలీసులకు అందడం లేదు. నేరాలవిషయం ఇలావుంచితే కుటుంబ హత్యలు, పాత కక్షల కారణంగా జరుగుతున్న హత్యలు, పరువు హత్యలు, చిన్నపాటి గొడవల వల్ల జరిగే హత్యలు,దోపిడీ దొంగలు చేస్తున్న హత్యలు, ప్రేమ వ్యవహారం వల్ల జరిగే హత్యలు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయి. చిన్న చిన్న విషయాలకే హత్యలు జరుగుతుండడం ఇటీవల పెరిగిపోయాయి. భార్యలను భర్తలు చంపడం, భర్తలను భార్యలు హత్యలు చేయడం, దంపతులు గొడవలు పడి తమ పిల్లలను చంపుతుండడం పెరిగిపోతున్నాయి. ఇక పరువు హత్యల సంగతి సరేసరి. ఈ హత్యలకు శాంతి భద్రతలకు సంబంధం లేకున్నా సమాజంలో పెరిగిపోతున్న అశాంతికి ఒక సంకేతంగా చెప్పాలి. ఇక దీనికితోడు సైబర్ నేరాలు, డ్రగ్స్ నేరాలు మరింత పెరిగాయి. సైబర్ నేరాలపెరుగుదల రాష్ట్రంలో ఎక్కువయ్యాయని గణాంకాలు చెబుతున్నాయి. డ్రగ్స్‌కు సంబంధించిన కేసుల సంఖ్య కూడా భారీగానే వుంటోంది.

# రాజకీయ సునామీ

తమిళనాడు

**ఎ.వి.వి ప్రసాద్**

రాజకీయ సునామీ అంటే ఎలా ఉంటుందో, అది ఎంతటి కల్లోలాన్ని సృష్టిస్తుందో గతవారం తమిళనాట అనుభవంలోకి వచ్చింది. ఏ పార్టీకి పూర్తి మెజారిటీరాని విచిత్ర పరిస్థితిలో ఒక పార్టీ లేదా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే ఎటువంటి 'విపత్కర పరిస్థితి'ని చవిచూడవలసి వస్తుందో విజయ్ ఉదంతం చాటిచెప్పింది. గత సోమవారం ఎన్నికల ఫలితాల రోజున కేవలం పది సీట్ల దూరంలో విజయ్ టివికె నిలబడవలసి వచ్చింది. ముందుకు వెళ్లాలంటే ఎవరో ఒకరి మద్దతు కావాలి. హోరాహోరీగా పోరాడి మళ్లీ వెనక్కి వెళ్లలేదు కూడా. దాదాపు ఆరు దశాబ్దాలుగా ద్రవిడ పార్టీలు మాత్రమే రాజ్యం చేస్తున్న తమిళనాట వాలు మళ్లిస్తూ విజయ్ కొత్త చరిత్రను సృష్టించారన్నది కాదనలేం. ఒకటి రెండు మినహా ఏ సర్వేలు కూడా విజయ్ ఇంతటి ఘనమైన విజయం సాధించగలరని అంచనా వేయలేకపోయాయి. జయలలిత మరణానంతరం అన్నాడిఎంకె బలహీనపడడంతో ఈసారి కూడా డిఎంకేయే అధికారంలోకి రావొచ్చని మెజారిటీ సర్వేలు పేర్కొన్నాయి. అయితే వాటి అంచనాలను తలకిందులు చేస్తూ ప్రముఖ సినిమా నటుడైన జోసెఫ్ విజయ్ నిజంగానే రాజకీయ సునామీని సృష్టించారు. ఫలితాల తర్వాతకూడా ఆ సునామీ వారంరోజుల పాటు కొనసాగిందంటే భవిష్యత్తులో విజయ్ ప్రభావం ఎంతఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ద్రవిడ సిద్ధాంతాలకు,ద్రవిడ వాదానికి భిన్నంగా ఏ పార్టీ వచ్చినా, ఎవరు మాట్లాడినా తమిళనాట దానికి ఎలాంటి మద్దతు లభించదనే చెప్పాలి. ఇంతకు ముందు గొప్ప ముఖ్య మంత్రులుగా చెలామణి అయిన కరుణానిధి, ఎమ్జీఆర్, జయలలిత సినిమా రంగానికి చెందినవారే అయినా ద్రవిడ సిద్ధాంతాలపైనే తమ పార్టీ పునాదులు నిర్మించుకున్నారు. వారి అఖండ విజయాల వెనుక ఉన్న రహస్యం అదే. కానీ విజయ్ సినిమా రంగంలో తనకున్న విశేషమైన పాప్యులారిటీని రాజకీయాల్లో కూడా పరీక్షించుకోవాలనుకొని ఓ 'ప్రయోగం' చేసి చూశారు. అనుకొన్నట్లే అది 'క్లిక్' అయింది కూడా. బొమ్మ బ్లాక్ బస్టర్ అన్నట్లు సునామీనే సృష్టించింది. అయితే వందరోజుల పోస్టర్ పడింది కానీ లాభాలు గుప్పిట్లోకి రాలేదన్నట్లు మెజారిటీ మార్కుకు పది సీట్ల దూరంలో ఉండిపోవడంతో అసలైన 'పొలిటికల్ డ్రామా' అప్పటి నుంచే మొదలయింది. అత్యధిక సీట్లున్న పార్టీగా టివికె ఆవిర్భవించినందున తమకే తొలుత అవకాశమివ్వాలనీ, రెండు వారాలలో అసెంబ్లీలో బలం నిరూపించుకొంటామనీ గవర్నర్ తో జరిపిన తొలి భేటీలోనే విజయ్ చెప్పారు కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు.



విజయ్

అప్పటి నుంచి చిన్న పార్టీల మద్దతు కూడ గట్టడానికి ఆయన చాలా ప్రయత్నాలు చేశారు. తర్వాత నాలుగు రోజుల్లో మరో రెండు సార్లు గవర్నర్ అర్లేకర్‌ను లోక్ భవన్ లోనే కలిసారు. తనకు మద్దతిచ్చేవారి సంఖ్య పెరుగుతోందని చెప్పారు. ఈలోగా ఐదు సీట్లున్న కాంగ్రెస్ డిఎంకె కూటమి నుంచి బయటకు వచ్చి టివికెకు మద్దతు ప్రకటించింది. రెండు సీట్లలో పోటీ చేసిన విజయ్ తిరుచ్చి-2 సీటును వదిలేసి పెరంబూరు మాత్రమే నిలుపుకొనడంతో 107కు తగ్గిన టివికె బలం కాంగ్రెస్ చేరికతో 112కు పెరిగింది. రెండోసారి గవర్నర్‌ను కలిసినప్పుడు ఆ విషయం విజయ్ చెప్పినా, గవర్నర్ ససేమిరా అనడంతో విజయ్ మళ్లీ ప్రయత్నాలు ఆరంభించారు. అప్పటికే 'రాజకీయ ఉద్రిక్తత' పెరిగిపోయి సునామీ ప్రభావం అధికమైంది. వామ పక్షాలు తొలుత తిరస్కరించినా, తర్వాత విజయ్‌కి మద్దతివ్వడాకి ముందుకు రావడంతో నాలుగు సీట్లు పెరిగి బలం 116కు చేరింది. దానితో ఆయనలో ఆశలు కూడా పెరిగాయి. ఇక తన ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి గవర్నర్ అంగీకరించవలసిందే అనుకొన్నారు. డిఎంకె కూటమిలోనే ఉన్న విసికె (విడుతలై చిరు తైగల్ కట్చి), ఐయుఎంఎల్ కూడా మద్దతిస్తామని చెప్పడంతో బలం 120కి చేరుతున్నదనీ ఇక తిరుగులేదనీ భావించిన విజయ్ శుక్రవారం సాయంత్రం మళ్లీ గవర్నర్‌ను కలిసారు. 116 మంది ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు ఇచ్చారు. ఆ సమయానికి విసికె, ఐయుఎంఎల్ మద్దతు లేఖలు గవర్నర్‌కు చేరకపోవడంతో ఆయన వారిని మళ్లీ వెనక్కిపంపారు. పూర్తి మెజారిటీతో వస్తేనే ప్రమాణ స్వీకారానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తా నని చెప్పడంతో మళ్లీ ఆ రెండు పార్టీల మద్దతు లేఖల కోసం శుక్రవారం అర్ధరాత్రి దాటే దాకా ఏకబిగిన విజయ్ ప్రయత్నిస్తూనే ఉన్నారు. తొలుత మద్దతు ఇస్తానని చెప్పి అడ్డం తిరిగిన ఆ రెండు పార్టీలలో ఐయుఎంఎల్ తాము డిఎంకె కూటమిలోనే ఉంటామని ప్రకటించి ఆశ్చర్యపరచగా, విసికె తన గొంతెమ్మ డిమాండ్లను బయటపెట్టింది. డిప్యూటీ సిఎం, తిరుచ్చి సీటు, మరో మంత్రిపదవి ఇస్తేనే మద్దతు ఇస్తామని విసికె చెప్పడంతో ఆట మళ్లీ మొదటికి వచ్చింది. శనివారం నాటికి కూడాఇంకా రెండు సీట్ల దూరంలోనే టివికె నిలబడింది. ఈ మధ్యలో డిఎంకె, అన్నాడిఎంకె వేగంగాపావులు కదప డం ఆరంభించాయి. 47సీట్లున్న అన్నాడిఎంకె, 59సీట్లున్న డిఎంకె కలిసి రంగంలోకి దిగుతున్నాయనే వార్తలు గుప్పుమనడంతోఎవరు ఏం చేస్తున్నారో, ఎవరి వ్యూహాలు ఏమిటో, ఎవరు ఎవరిని పడగొట్టాలనుకుంటున్నారో అర్థంకాని రాజకీయ అయోమయ పరిస్థితి ఆవరించింది. మద్దతిస్తామన్న వారికి మంత్రి పదవులు,ఇతర ప్రయోజనాలు ఆశచూపినా,టివికెకు చివరిదాకా ఆశించిన సీట్లు రాకపోవడం కూడా విచిత్రమే. పార్టీ పెట్టిన రెండేళ్లలోపునే 35శాతం ఓట్లు టివికె సాధించిందంటే అది సినిమా రంగంలో విజయ్‌కి గల ప్రజాదరణ వల్లనే. అయితే తొలుత టివికెకు పూర్తి మెజారిటీరాకపోవడంతో అన్నిపార్టీలు తమ ఆట ఆరంభించాయి. చివరికి విజయ్ గెలుపు సాధించారు కానీ ఫలితాల అనంతరం ఇంతటి రాజకీయ గందరగోళం అవాంఛనీయమే అని చెప్పాలి. ●

# సవాళ్ల సుడిగుండంలో 'పెద్దన్న'!

అమెరికా

**గన్ని మోహన్**

ఇరాన్‌పై యుద్ధం, అణ్వాయుధ తయారీపై ఆంక్షలు, ప్రస్తుతం ఉన్న యురేనియం నిల్వలు తమ పరం చేసుకోవడం వంటి ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఏకపక్ష వైఖరికి చెక్‌పెడుతూ మధ్యవర్తుల నిర్ణయంతో దిగిరాక తప్పలేదు. పైకి గంభీరంతో ఉన్నప్పటికీ అమెరికాకు సంబంధించి 40 రక్షణరంగ స్థావరాలను ఇరాన్ దెబ్బతీసిందన్నది జగమెరిగిన సత్యం. బాహ్యప్రపంచంలో ఇలాఉంటే పాలనాపగ్గాలు చేపట్టిన వెనువెంటనే ప్రపంచ దేశాలపై సుంకాలు విధించిన ట్రంప్ ఇప్పుడు న్యాయస్థానాల్లోకూడా ప్రతికూలతలు ఎదుర్కొంటున్నారు. సుంకాలను విధించడం తప్పని పదిశాతం ప్రపంచ దేశాలపై విధించిన వాణిజ్యసుంకాలు చెల్లవని పేర్కొంటూ వాటిని తిరిగి చెల్లించాల్సిందేనంటూ అంతర్జాతీయ వాణిజ్య న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ట్రంప్‌లో అసహనం పెంచింది. ముగ్గురు న్యాయమూర్తుల ప్యానెల్ ఉన్న న్యూయార్కు కోర్టు మెజార్టీ అభిప్రాయంతో సుంకాలను తోసిపుచ్చింది. ఈ సుంకాలు చెల్లుబాటు కావని, చట్టపరిధిలో లేని అనధికారిక నిబంధనలని పేర్కొంటూ కేసుతీర్పు వెలువరించారు. ఈచట్టంతో అధ్యక్షుడికిసుంకాల విధింపుపై సమగ్ర అధికారాలిచ్చిందనడాన్ని కూడా అంగీకరించలేదు. రెండంకెల సుంకాలను సుప్రీంకోర్టు గత ఫిబ్రవరిలో కొట్టివేసిన తర్వాత ట్రంప్ తనకు విచక్షణాధికారాలున్నాయని పదిశాతం తాత్కాలిక సుంకాలను ప్రపంచ దేశాలన్నింటిపైనా విధించారు. నార్వే నుంచినైజీరియా వరకూ అమెరికాలోనికి వస్తున్న 60శాతం దిగుమతులపై ఈ సుంకాలు విధిస్తామని వెల్లడించింది. పాలనా యంత్రాంగం1974 వాణిజ్య చట్టంసెక్షన్ 122 ప్రకారం కొత్తసుంకాలు విధించేందుకు అధికారాలున్నాయని ట్రంప్ ఈ సుంకాలు విధించారు. ఈ సుంకాల విధింపు నిబంధనలు జులై 24తేదీతో ముగిసిపోతుంది. ఇప్పటికే 25శాతం విధించిన సుంకాలన్నింటినీ వెంటనే వెనక్కి ఇచ్చేయాలన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులతో ట్రంప్ ఖజానా దాదాపుగా ఖాళీఅయ్యేప్రమాదం ఉంది. ఓపక్క ఇరాన్‌తో యుద్ధంలో రోజుకు రెండు బిలియన్ డాలర్లకు తగ్గకుండా జరిగిన వ్యయంతో అమెరికా ఖజానా దాదాపుగా నిండుకున్న పరిస్థితికి చేరుకుది. ఈ దశలో పదిశాతం సుంకాలను కూడా రద్దుచేసి వీటిని రికవరీకోసం మళ్లీ వ్యాజ్యం దాఖలుచేస్తే ట్రంప్ హయాంలో ట్రెజరీకి ఎనలేని కష్టాలు ఎదురవుతాయని చెప్పకతప్పదు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల తర్వాతట్రంప్ 1977నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం'ఈపా'ను ప్రయోగించారు. అమెరికా వాణిజ్యలోటును పూడ్చుకునేందుకు ఈవ్యవస్థ అమలు తప్పనిసరి అని యంత్రాంగం భావించడంతో ట్రంప్ ఈ పది శాతం సుంకాల ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై సంతకాలుచేసారు. అయితే సుప్రీంకోర్టు గత ఫిబ్రవరిలోనే ఈ ఈపా చట్టం ఎలాంటి సుంకాలు విధించేందుకు అధికారాలివ్వలేదని, అమెరికా రాజ్యాంగం కాంగ్రెస్‌కు మాత్రమే సుంకాలు, పన్నులు నిర్ణయించే అధికారాలున్నాయని అభిప్రాయపడింది.



ట్రంప్

అయినా అమెరికా ప్రజాప్రతినిధుల సభ కొన్ని పరిమిత అధికారాలు ట్రంప్‌నకు ఇవ్వవచ్చని సమగ్ర ట్యారిఫ్‌లకు అధికారాలుండవని చెపుతూ సుంకాలవిధింపును కొట్టివేస్తూ వెంటనే వాటిని తిరిగి చెల్లించాలనికూడా ఆదేశించింది. దీనితో ఒక్కసారిగా సుమారు 15 లక్షలకోట్లకుపైగా సుంకాల చెల్లింపుల రూపంలో ట్రంప్ ఖజానాకు అదనపు భారంపడింది. అయితే ఈ తీర్పుపై అమెరికా కోర్ట్ ఆఫ్అప్పీల్స్‌కు వెళ్లే అవకాశం ఉంది. వాషింగ్టన్‌లో ఉన్న ఈ కోర్టు వివాదాలకు వెళ్లినతర్వాతనే సుప్రీంకోర్టువరకూ మళ్లీ వెళ్లాల్సి ఉంటుంది. చైనా, యూరోపియన్ యూనియన్, జపాన్ వంటి 16వాణిజ్య భాగస్వాములు ఈ పదిశాతం సుంకాలకు భిన్నంగా వారుసైతం అమెరికా నుంచి వచ్చే దిగుమతులపై ప్రతీకార సుంకాలు విధించారు. ప్రపంచంలోని 60 దేశాల నుంచి 99శాతం దిగుమతులు అమెరికాకు జరుగుతున్నాయి. నిజానికి వినియోగరంగ ఉత్పత్తుల నుంచి భారీ ఉత్పత్తుల వరకూ అన్నీ కూడా దిగుమతులపైనే అమెరికా ఆధారపడుతున్నది. ఈసుంకాలతో అమెరికా ట్రెజరీ నిండిందని తాము ఖజానాను భర్తీచేసి ఆర్థిక పరిపుష్టిని చేకూర్చినట్లు ట్రంప్ గర్వపడుతూ ట్రూత్ వ్యాఖ్యలు చేసినప్పటికీ న్యాయస్థానాల్లో ఆయనకు చుక్కెదురవుతోంది. అటు యుద్ధాలతో ప్రపంచ దేశాలనుంచి కూడా ట్రంప్ వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. గల్ఫ్‌దేశాలు కూడా తమకు జరిగిన నష్టానికి పరిహారం కోరుతున్నాయి. మరోపక్క ఇరాన్ కూడా అదే తీరులోఉంది. ఈ క్రమంలోట్రంప్‌నకు అటు న్యాయస్థానాల పరంగా కూడా తీవ్రస్థాయి చిక్కులు ఎదురవుతున్నాయి. ఇప్పటివరకూ దాఖలైన ఏఒక్క వ్యాజ్యంలోనూ దిగువ కోర్టునుంచి సుప్రీంకోర్టు వరకూ పాలన యంత్రాంగాన్ని సమర్థిస్తూ వచ్చిన నిర్ణయాలు లేవు. ఈ వాణిజ్య వివాదాలఅంతర్జాతీయ న్యాయస్థానం కూడా అదేతరహాలో తీర్పునివ్వడంతో ట్రంప్‌నకు రానున్న మధ్యంతర ఎన్నికల్లో మరింతగా ప్రతికూలత ఎదురవుతుందనడంలో ఎలాంటి సందేహంలేదు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా ట్రంప్ పాలనకు రేటింగ్ పడిపోయింది. 40శాతానికి కూడా రేటింగ్ లేకపోవడంతో సంస్థాగతంగా ఎలాంటి మార్పులు చేయాలన్న అంశంపై ట్రంప్ తన అంతర్గత మిత్రులతో తర్జనభర్జనలుపడుతున్నారు. ఇరాన్‌తో యుద్ధంతోనే అత్యధికశాతం వ్యతిరేకత వ్యక్తం అయింది. గ్రీన్‌ల్యాండ్ స్వాధీనం, క్యూబాపై సైనిక చర్య చేపడతామన్న హెచ్చరికలు వంటివి ట్రంప్‌పాలన తీరును తప్పుపట్టేవిధంగా ఉన్నాయని సొంతపార్టీ నేతలే విమర్శలుగుప్పించారు. చట్టసభల్లో మెజార్టీ ఉందని ఏకపక్ష వైఖరితో వ్యవహరించే అమెరికా అధ్యక్షుడికి న్యాయస్థానాలు వేస్తున్న మొట్టికాయలు ప్రపంచ దేశాల్లో అధ్యక్షుడి ప్రతిష్టకు మచ్చతీసుకురావడంతోపాటు రానున్న మధ్యంతర ఎన్నికల్లో ఇదే అతిపెద్ద అడ్డంకిగా మారుతుందని ట్రంప్ గ్రహించకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ●

# విద్యార్థుల అధ్యయన విధానాల్లో సంస్కరణలు అవసరం

**మల్లాడిశ్రీనగేష్**

తల్లిదండ్రులు అక్షరాస్యులైనా నిరక్షరాస్యులైనా వారు పిల్లల పట్ల,వారు చదువులో కనబరిచే ప్రతిభపాటవాల పట్ల ఎప్పుడూ వేయికళ్ళతో ఎదురుచూస్తుంటారు. తలిదండ్రులు వలస కార్మికులైనా, దినసరి వేతన కుటుంబమైనా, ఆర్థికపటంలో చివరిస్థానంలో వున్నా మారుతున్న కాలంతో మనం కూడా మారాలనే దృక్పథంతో పిల్లల చదువు, వారి భవిష్యత్తు పట్ల ఊహించని మార్పును మనం చూస్తూనే వున్నాం. రెక్కలకష్టంతో తమ పిల్లల్ని చదివించడానికి ఒంటరి తల్లి సైతం తనవంతు కృషి చేయడం అందరికీ గమనార్హం. తన బిడ్డ తమలా కూలీనాలీ చేయకూడదని చిన్నదైనా సర్కారు లేదా ప్రైవేట్కొలువైనా చాలునని తద్వారా బానిస బ్రతుకులకు విమోచన కలుగుతుందని కలలు కనేకాలమిది. వ్యవసాయం సన్నగిల్లింది, వ్యవసాయ భూములు రొయ్యల, చేపల చెరువులుగా మారిపోయాయి. కొంచెం రోడ్డుపరిధిలో ఉంటే రియల్ఎస్టేట్ రంగానికి తాకట్టుగా మారిపోతున్నాయి. గ్రామాల్లో వ్యవ్యసాయం కనుమరుగైన తరుణంలో మరే ఇతర నైపుణ్యాలు లేని ఎన్నో గ్రామీణ కుటుంబాలు వలసల బాటలతో సరైన బతుకు లేక ఆర్థికబాధలతో అతలాకుతమౌతున్నారు. ఈకష్టంలో కూడా పిల్లల చదువు భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు తల్లిదండ్రుల యత్నాలు ఇంతాఅంతా కాదు. అందుకే స్వగ్రామమైనా, పరప్రాంతమైనా తమపిల్లలను పాఠశాలకు పంపించడం తప్పనిసరిగా ముందుకు రావడం ఊహించని మార్పుకాదు. అనివార్యమైందని చెప్పకతప్పదు. రాబోవు కాలంలో కొలువు దొరికితేనే బతుకుభరోసాతో అనేక కుటుంబాలు భావిస్తున్నాయి. దీనికితోడు ప్రభుత్వాలు కూడా తదనుగుణమైన ప్రణాళికల తోపిల్లల్ల చదువుకు భరోసాకల్పిస్తూ ఇంతవరకూ బడిచూడని పిల్లలను కూడా వారి వయసు ఆధారిత తరగతిలో నమోదుచేయడం విద్యాహక్కుకు విస్తృత ప్రాధ్యాన్యం కల్పించినప్పటికీ, బడిలో చేరిన పిల్లలు ఎక్కువ శాతం వారి అభ్యసనలో వెనుకబడి ఉండడం ఓపెద్దసవాలు. విద్యాహక్కు చట్టం 2009ప్రభావం దేశంలో 6-14వయసు కలిగిన విద్యార్థుల పాఠశాల నమోదు గత రెండు దశాబ్దాల నుండి 95శాతంకాగా ప్రస్తుతం 98.1 శాతంగా నమోదు కావడం చాలాశుభపరిణామం. అంటే 2018 తోపోల్చుకుంటే 2024 నాటికి నమోదు శాతం 66. 8శాతం పెరిగినట్టు చెప్పవచ్చు. ఒకప్పుడు ప్రభుత్వబడుల్లో విద్యార్థుల నమోదు లేక సతమతమోతూ ఉంటే ప్రభుత్వప్రయత్నాలు, తలిదండ్రుల ఉత్సుకత, ఎలిమెంటరీస్థాయి వరకు ఉచిత నిర్బంధ విద్యకు కంకణంకట్టుకున్న విద్యాహక్కు చట్టం 2009 వెరసి బడి బయటవున్న బడిఈడు పిల్లలను కూడా పరిగణనలోనికి తీసుకొని లెక్కిస్తే పిల్లల నమోదు సుమారు 98.1శాతం వరకు చేరినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పిల్లలచేరికసరే వారిరేటెన్షన్ నాణ్యమైనవిద్య , అభ్యసనా సామర్థ్యాల సాధన, తలిదండ్రులు నిరక్షరాస్యులైనా తల్లిదండ్రుల ప్రోత్సహం ,విద్యాహక్కు చట్ట నిబద్ధత, పిల్లలకు ప్రభుత్వం సమకూరుస్తున్న మధ్యాహ్నభోజనం, ఉచితపుస్తకాల, దుస్తుల పంపిణీ అమ్మఒడి లాంటి పిల్లలసంక్షేమానికి ఉపకరించే ఉపకారవేతనాలు సైతం చదువంటే భయపడి బడిమానేసి లేదా చదువుకుందాం సంస్కరించుకుందామని ఎందరో బాలలుబడిలోప్రవేశించారు. అయినా 15 సంవత్సరాల విద్యాహక్కు చట్టం అమలు తర్వాత కూడా బడిలో ప్రవేశించిన మొదటి జనరేషన్ తొలి అక్షరాస్యతకు నోచుకున్న కుటుంబాల పిల్లలు ఇంకా అభ్యసనాలేమితో కొట్టుమిట్టాడడం నిజంగా శోచనీయం. ఈ అభ్యసనాలేమితో సతమతమవుతున్న 40శాతం విద్యార్థుల్లోనే నిజంగా చాలాకాలం చదువుకు నోచుకోని కుటుంబాల నుండి బడిపట్ల ఆసక్తితో బడిబాటపట్టి అభ్యసనాసామర్థ్యాలలేమితో సతమతౌతున్న ఎక్కువ శాతం విద్యార్థులు ఆకోవకుచెందిన వారే ! ఈదుస్థితికి బాధ్యులెవరు?చదువు అనే మహానదిలో సురక్షితంగా ఒడ్డుకురావడానికి సరైన ఈతలో శిక్షణ ఇవ్వకుండా అభ్యసనా సామర్థ్యాల సర్వేపేరిట విద్యార్థుల మనోభావాలను పెద్ద పరీక్షకు గురిచేయడం ఎంతవరకు సమం



జసం. నేలవీడిసాము చందాన చదువు ఒకటికాదు ఎన్నెన్నో జాతీయ ,రాష్ట్రీయసర్వేలు జరుగుతూనే వున్నాయి. కానీ చదువులో, బోధనాసరళిలో, తరగతి గది నిర్వహణలో, పాఠశాల నిర్వహణలో,పిల్లల ప్రతిభలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉండడం విద్యా వ్యవస్థకు, ఉపాధ్యాయులకు, తలిదండ్రులకు సమాజానికి ఎప్పటికీ విప్పలేని చిక్కుముడిగా కనబడుతోంది. నేలవీడి సాము చేసినట్టు ఉన్నపరిస్థితులను చక్కబెట్టకుండా, తరగతి వారీసామర్థ్యాలను పెంపొందించడానికి తక్షణవ్యూహాలను రచించకుండా కృత్రిమమేధస్సు, డిజిటల్‌బోధన, ఆంగ్ల మాధ్యమం, అలాగే బోరేటరీలు తప్పనిసరియే కానీ అందరికీ సమాన విద్యను అందించడంలో విఫలమౌతున్నాం. విద్యార్థుల తరగతి వారీ లేదా పాఠ్యంశం పూర్తికా గానే విద్యార్థుల ప్రతిభనురోజు వారీలేదానెలవారీ అంచనా వేయకుండా సిలబస్‌ను పూర్తిచేయడమే ప్రథమకర్తవ్యంగా పాఠశాలలు పరిగెడుతుంటే,తరగతిగదిలో వున్నవందశాతంవిద్యార్థుల ప్రగతిని ఎలా పునరుద్ధరించగలం. ఈపరిస్థితులు ఎప్పటికీ ప్రశ్నార్థకమే. 5వతరగతిలో ప్రవేశించినప్పటికీ 2వ తరగతిపాఠ్యంశాలను కూడా చదవలేని లేదా కనీసగణిత సామర్థ్యాలను సాధించలేని విద్యార్థుల పరిస్థితి ఎలా చక్క బడుతుంది. ఒకవాక్యాన్ని కూడా క్షుణ్ణంగా చదవలేని విద్యార్థి తన తరగతిలో నిర్దేశించిన సబ్జెక్టులను ఎలా చదవగలరు. ఉతీర్ణత ఎలాసాధించగలరు. ఇప్పటికే 8వతరగతిలో ప్రవేశించినప్పటికీ విద్యార్థులు ఒకపేరా కూడా తడబడకుండా తప్పులు లేకుండా చదవలేకపోతున్నారు అంటే ఆకోవకు చెందిన విద్యార్థులుచదువు కాలమంతా ఒక విష వలయంలోనే చిక్కుకుపోతున్నారు. ఈ పరిస్థితిలో పదవ తరగతిలో ప్రవేశించే నాటికి పాఠశాలలు 80శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఇదే దీక్ష,పట్టుదల, ప్రణాళిక,బోధనా లేదా పరీక్షల్లో ఉత్తీర్ణతసాధించే వ్యూహాలు ఎందుకు ప్రాథమికపాఠశాల స్థాయి నుండి అమలు కావడంలేదు. ఎన్నాళ్లీ సర్వేలు చర్చలు అకడెమిక్ చక్రం పరిగెడుతూ వుంది. విద్యార్థులపై తరగతులకు ఉతీర్ణలవుతూనేఉన్నారు. అభ్యసనకు అందని అయోమయంలో పడిపోతున్నారు. ఉదాహరణకు ఈ మధ్యనే యెన్.సి.ఆర్.టి నిర్వహించిన ఫరక్రాష్టీయసేవాక్షన్సర్వే ప్రకారం సుమారు 75శాతంమంది 9 వతరగతి విద్యార్థులు చిన్నచిన్న కాన్సెప్ట్లను కూడా అర్థం చేసుకోనిదుస్థితిలో ఉన్నారు. అంతేకాక చిన్నచిన్న గణిత సంబంధిత సమస్యలను కూడా చేయలేని పరిస్థితిలోఉన్నారు. ఫరక్రాష్టీయ సేవాక్షన్ సర్వేలో ముందంజలో వున్న పంజాబ్, కేరళ, హిమాచప్రదేశ్ వంటి రాష్ట్రాలను ప్రగతిసాధనలో వారు రచించిన వ్యూహాలను అధ్యయనం చేయలేమా? దేశంలో సుమారు 47శాతం 3వతరగతి విద్యార్థులు చిన్న కథను కూడా చదివి అర్థం చేసుకోలేనిస్థితిలో వున్నారు. 36 శాతం మంది విద్యార్థులు కూడికలు కూడా చేయలేకపోయారు. 6 వతరగతిలో సుమారు 34శాతం మంది స్థానిక సంస్థలు, మార్కెట్, ఇతరసంస్థల పని గురించి కుడా తెలియపరచలేకపోయారు. 9వతరగతి విద్యార్థులు సుమారు 55 శాతం మంది సోషల్ స్టడీస్ సబ్జెక్టులో రాజ్యాంగం గురించి, వాటి సూత్రాలు, జాతీయఉద్యమాల గురించి వెల్లడించలేని పరిస్థితిలో వున్నారు. ఇకతెలుగురాష్ట్రాలు పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్రం జాతీయస్థాయిలో 9వతరగతిలో 17 వస్థానం, 6వ తరగతిలో 26వస్థానంలో ఉన్నట్లు తెలుస్తోంది. 3వతరగతిలో తెలంగాణ రాష్ట్రం 26 వస్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ 13వస్థానంలోఉండగా, 6వతరగతిలో తెలంగాణ 26వస్థానం, ఆంధ్రప్రదేశ్33వ స్థానంలో ఉండగా 9వతరగతిలో తెలంగాణ 17వస్థానంలో ఉండగా ఆంధ్రప్రదేశ్ 28 వస్థానంలో ఉన్నట్టుతెలుస్తోంది. విద్యాహక్కు చట్టం 2009 లో పొందుపరచిన బడుగుబలహీన వర్గాలకుచెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి మౌలికవసతులకల్పన,ఉపాధ్యాయుల వృత్తినైపుణ్యాల పెంపు తక్షణమే జరగాలి. కులవర్గ భాష, ప్రాంత లింగ వివక్షలేని సమ్మిళిత అందరికీ సమాన విద్యను అందించడం అనే ప్రాథమిక సూత్రాన్నిదృష్టిలో ఉంచుకొని చదువుకే తొలి తరమైన అయిన కుటుంబ విద్యార్థులకు పటిష్టమైనపునాది ఏర్పరచాలి. ఆధునిక విద్యా విధాన ప్రపంచంలో ప్రామాణికాలుగా పరిగణించబడ్డ 21వ శతాబ్దపు నైపుణ్యాలను పుణికిపుచ్చుకొనేలా విద్యావ్యవస్థనుబలపరచాలనేదే మూలసూత్రంగా, ఉపాధ్యాయులను ప్రాతిపదికన నిరంతర శిక్షణా కార్యక్రమాలద్వారా కరికులంలో స్థానికతనుజోడించడం, విశ్లేషణ అనుభవాత్మక విద్య తరగతి బోధనలో జోడించాలి. ●

# 9 రాష్ట్రాల్లో బిజెపి పాగా



మోడీ ప్రధాని అయినప్పటి నుంచి పార్టీ త్వరితగతిన విస్తరణ

హర్యానా నుంచి బెంగాల్ వరకు 'కమల' వికాసం

**న్యూఢిల్లీ, మే 9:** పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సాధించిన ఘన విజయం, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికింది. నరేంద్ర మోడీ 2014లో ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి, ఇప్పటివరకు మొత్తం తొమ్మిది రాష్ట్రాల్లో బిజెపి తొలిసారిగా ముఖ్యమంత్రి పదవిని కైవసం చేసుకుంది. ఈ ప్రస్థానం 2014లో హర్యానా, మహారాష్ట్రలతో ప్రారంభమైంది. ఆ తర్వాత అసోం (2016), అరుణాచల్ ప్రదేశ్ (2016), మణిపూర్ (2017), త్రిపుర (2018), ఒడిశా (2024), బీహార్ (2026), ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌తో ఈ జాబితా కొనసాగుతోంది. హర్యానాలో, బిజెపి తొలిసారిగా సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. మహారాష్ట్రలో, అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించి, 'మహాయుతి' కూటమిలోని మిత్ర పక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, దేవేంద్ర ఫడ్నవీస్ ఆ రాష్ట్రానికి తొలి బిజెపి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2016లో అసోంలో విజయం సాధించడం ద్వారా బిజెపి ఈశాన్య భారతదేశంలో తన విస్తరణను కొనసాగించింది. అక్కడ సర్బానంద సోనోవాల్ ఆ రాష్ట్రానికి బిజెపి తరపున తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అప్పటి నుండి, బిజెపి అసోంలో అధికారాన్ని నిలబెట్టుకుంటూ, ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికలతో కలిపి వరుసగా మరో రెండు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించింది. అదే సంవత్సరం (2016)లో, అరుణాచల్ ప్రదేశ్ రాజకీయాల్లో చోటుచేసుకున్న భారీ మార్పుల నేపథ్యంలో, బిజెపి అక్కడ తన తొలి పూర్తిస్థాయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జులై 2016లో, సుదీర్ఘ రాజకీయ సంక్షోభం నడుమ కాంగ్రెస్ నాయకుడు పేమా ఖండు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే, సెప్టెంబర్ నెలలో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన మెజారిటీ ఎమ్మెల్యేలు, బిజెపి మిత్రపక్షమైన 'పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్' (పిపిఎ)లో చేరారు. కొన్ని నెలల తర్వాత, 2016 డిసెంబర్‌లో, ఖండూ 33 మంది ఎమ్మెల్యేలతో కలిసి బిజెపిలో చేరారు. దీంతో ఆ పార్టీకి రాష్ట్రంలో స్పష్టమైన మెజారిటీ లభించి, మొట్టమొదటి స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. 2003లో అరుణాచల్ ప్రదేశ్‌లో బిజెపి మాజీ ముఖ్యమంత్రి గెగాంగ్ అపాంగ్ నేతృత్వంలో కొద్దికాలం పాటు ప్రభుత్వాన్ని నడిపింది. ఆ సమయంలో కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరిన అపాంగ్, కేవలం 44 రోజులు మాత్రమే ప్రభుత్వానికి నాయకత్వం వహించి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. 2017లో, మణిపూర్‌లో బిజెపి, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పిపి), నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్), ఇతర ప్రాంతీయ పార్టీలతో ఎన్నికల అనంతర పొత్తును కుదుర్చుకుని, ఎన్. బీరెన్ సింగ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. దీంతో ఆ సరిహద్దు రాష్ట్రంలో బిజెపికి ఇదే మొదటి ప్రభుత్వంగా నిలిచింది. 2018లో, త్రిపురలో లెఫ్ట్ ఫ్రంట్ దశాబ్దాల పాలనకు బిజెపి ముగింపు పలికి, బిప్లబ్ కుమార్ దేబ్ నేతృత్వంలో తన తొలి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2024లో తూర్పు భారతదేశంలో పార్టీ మరో ముందడుగు వేసింది. ఒడిశాలో బిజు జనతా దళ్‌ను ఓడించడంతో, నవీన్ పట్నాయక్ 24 ఏళ్ల నిరంతర పాలనకు ముగింపు పలుకుతూ, మోహన్ చరణ్ మాఝీ ఆ రాష్ట్రానికి బిజెపి మొదటి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నితీష్ కుమార్ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలలో బిజెపి దీర్ఘకాలంగా భాగస్వామిగా ఉన్న బీహార్‌లో, 2026 వరకు ఆ పార్టీకి ముఖ్యమంత్రి లేరు. రెండు దశాబ్దాలకు పైగా, చిన్న చిన్న అంతరాయాలతో పలు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీష్ కుమార్, ఈ ఏడాది ప్రారంభంలో పదవి నుంచి వైదొలిగి రాజ్యసభకు వెళ్లారు. ఆయన నిష్క్రమణ తర్వాత, బిజెపి ఆ రాష్ట్రానికి పార్టీ నుంచి మొదటి ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరిని నియమించింది. ఇటీవలి ఎన్నికలలో పశ్చిమ బెంగాల్‌లో విజయంతో, రాజకీయంగా పార్టీకి అందనిదిగా భావించబడుతున్న రాష్ట్రంలో బిజెపి ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ పార్టీ 294 అసెంబ్లీ స్థానాలకు గాను 207 స్థానాలను గెలుచుకుంది.



శనివారం కోల్‌కతాలో బిజెపి సీనియర్ కార్యకర్త మఖన్‌లాల్ సర్కార్‌తో భేటీ అయిన ప్రధాని మోడీ

## మఖన్‌లాల్ సర్కార్ ఓ స్ఫూర్తి

### బిజెపిలో ఇలాంటి కార్యకర్తలు ఉండడం గర్వకారణం : ప్రధాని

### ప్రమాణస్వీకార వేదికపై సర్కార్ ఆశీర్వాదం తీసుకున్న మోడీ

**కోల్‌కతా, మే 9 (ఐఎఎన్ఎస్):** బిజెపి అత్యంత సీనియర్ కార్యకర్తలలో ఒకరైన మఖన్‌లాల్ సర్కార్‌తో తాను జరిపిన భేటీకి సంబంధించిన ఫోటోలను ప్రధాని నరేంద్ర మోడీ శనివారం పంచుకున్నారు. ఆయనను ఒక 'స్ఫూర్తిదాయకమైన వ్యక్తి'గా అభివర్ణిస్తూ, అన్ని వర్గాల ప్రజలను పార్టీలో చేరడానికి ఆయన నిరంతరం ప్రేరేపిస్తున్నారని అన్నారు. పశ్చిమ బెంగాల్ తొమ్మిదవ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో, రాష్ట్రంలోని బిజెపి అత్యంత సీనియర్ కార్యకర్తలలో ఒకరైన మఖన్‌లాల్ సర్కార్ ఆశీర్వాదం ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్నారు. ఆయన మఖన్‌లాల్ సర్కార్‌ను పలకరించి, ఒక శాలువా బహూకరించి, ఆశీర్వాదం పొందారు. 98 ఏళ్ల వయసులోనూ, స్వాతంత్ర్యానంతర భారతదేశంలోని జాతీయవాద ఉద్యమంతో సంబంధం ఉన్న తొలితరం క్షేత్రస్థాయి నాయకులలో మఖన్‌లాల్ సర్కార్ ఒకరిగా నిలిచిపోయారు. ఈ మేరకు ప్రధాని మోడీ 'ఎక్స్'లో రాసుకొచ్చారు. "పశ్చిమ బెంగాల్‌లో మొట్టమొదటి బిజెపి ప్రభుత్వం నేడు ప్రమాణ స్వీకారం చేస్తున్న తరుణంలో, దేశానికి, ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌కు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన శాశ్వతమైన సేవను మనమందరం గుర్తు చేసుకోవడం సహజం. ఆయన ఆశయాలను నెరవేర్చడానికి అన్ని విధాలా కృషి చేస్తాం. కోల్‌కతాలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మఖన్‌లాల్ సర్కార్ జీని కలిసే అవకాశం నాకు లభించింది. నిబద్ధత కలిగిన జాతీయవాది అయిన ఆయన, డాక్టర్ ముఖర్జీతో కలిసి పనిచేశారు. ఆయనతో పాటు జమ్మూ కాశ్మీర్‌లో వెళ్తున్నప్పుడు అరెస్టు కూడా అయ్యారు. ఆయన తన జీవితాన్ని మన పార్టీకి అంకితం చేశారు. పశ్చిమ బెంగాల్ అంతటా పార్టీ పునాదిని విస్తరిస్తూ, అన్ని వర్గాల ప్రజలను పార్టీలో చేరడానికి ప్రేరేపించారు" అని మోడీ పేర్కొన్నారు. "ప్రజల మధ్య పనిచేసి, మన పార్టీని బలోపేతం చేసిన అటువంటి స్ఫూర్తిదాయకమైన వ్యక్తులు మనకు ఉన్నందుకు బిజెపిలో తాము గర్విస్తున్నాము" అని ప్రధాని మోడీ చేతులు జోడించారు.

**జనసంఘ్ నుంచి ప్రస్థానం**

మఖన్‌లాల్ సర్కార్ భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరైన శ్యామాప్రసాద్ ముఖర్జీ అనుచరుడిగా పేరుగాంచారు. 1952లో, కాశ్మీర్‌లో భారత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే ఉద్యమంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీతో పాటు సర్కార్ ఉండగా, అరెస్టు అయ్యారు. 1980లో బిజెపి ఏర్పడిన తర్వాత, ఆయన పశ్చిమ దినాజ్‌పూర్, జల్‌పాయిగురి మరియు డార్జిలింగ్ జిల్లాలకు సంస్థాగత సమన్వయకర్త అయ్యారు. కేవలం ఒక సంవత్సరంలోనే, ఆయన దాదాపు 10,000 మంది సభ్యులను చేర్చుకోవడంలో సహాయపడ్డారు. 1981 నుండి, ఆయన ఏడు సంవత్సరాల పాటు నిరంతరాయంగా జిల్లా అధ్యక్షుడిగా సేవలందించారు. సాధారణంగా బిజెపి నాయకులు ఒకే సంస్థాగత పదవిలో రెండేళ్లకు మించి కొనసాగలేని ఆ కాలంలో, ఇది ఒక అసాధారణమైన ఘనతగా పరిగణించబడింది.

**గర్వంగా, సంతోషంగా ఉంది: మఖన్‌లాల్ సర్కార్ కుటుంబం**

పశ్చిమ బెంగాల్‌లోని అత్యంత సీనియర్ భారతీయ జనతా పార్టీ (బిజెపి) కార్యకర్తలలో ఒకరైన మఖన్‌లాల్ సర్కార్ కుటుంబ సభ్యులు శనివారం మీడియాతో మాట్లాడుతూ, ఆయన ఏళ్ల తరబడి చేసిన కృషి ఎట్టకేలకు ఫలించినందుకు తాము 'గర్వంగా', 'సంతోషంగా' ఉన్నామని తెలిపారు.

## పంజాబ్ పరిశ్రమల మంత్రిని అరెస్టు చేసిన ఇడి



**చండీఘడ్, మే 9:** పంజాబ్ పరిశ్రమల, విద్యుత్తు శాఖ మంత్రి సంజీవ్ ఆరోరా నివాసంపై ఇవాళ ఈడీ తనిఖీలు చేపట్టింది. ఆ తర్వాత సంజీవ్ అరోరాను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చండీఘడ్‌లోని సెక్టార్ 2లో ఉన్న నివాసంలో ఆయన్ను అరెస్టు చేశారు. ఢిల్లీ, గురుగ్రామ్, చండీఘ్‌తో పాటు హాంప్టన్ స్కై రియాల్టీ లిమిటెడ్ సంస్థ కార్యాలయంలోనూ తనిఖీలు నిర్వహించారు. ఫేక్ జీఎస్టీలతో కొనుగోళ్లు చేసినట్లు సంజీవ్ అరోరా కంపెనీపై ఫిర్యాదులు ఉన్నాయి. సుమారు వంద కోట్ల ఖరీదైన మొబైల్ ఫోన్లు ఖరీదు చేసినట్లు ఉన్నది. దుబాయ్ నుంచి భారత్‌కు అక్రమ రీతిలో ఫండ్స్ తరలించారు. ఫేక్ జీఎస్టీ బిల్లులు సృష్టించారు. మంత్రి సంజీవ్ అరోరా ఇంటిపై దాడులు చేయడం ఈ ఏడాది ఇది మూడోసారి. మనీల్యాండరింగ్ కేసులో దర్యాప్తు జరుగుతున్నది. ఉదయం 5 గంటలకు చండీఘడ్‌లోని మంత్రి ఇంటికి ఈడీ చేరుకున్నది. ఆపరేషన్ సమయంలో మంత్రి నివాసం ముందు ఈడీ అధికారులకు చెందిన 8 వాహనాలను నిలిపారు. ఏప్రిల్‌లో ఓ సారి ఈడీ దాడులు నిర్వహించింది. ఫెమా చట్టం ఉల్లంఘన కింద ఓ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తు ఏజెన్సీలకు సహకరించనున్నట్లు ఆయన గతంలో చెప్పారు. పరిశ్రమలకు కేటాయించిన భూములను రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కోసం వాడుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసుతో లింకున్న మనీల్యాండింగ్ అంశంపై సంజీవ్ అరోరాను ప్రశ్నించారు. అరవింద్ కేజ్రీవాల్, భగవంత్ మాన్ సింగ్ లాంటి ఆప్ నేతలు అరోరాకు అండగా ఉన్నా ఈడీ మాత్రం తన పని తాను చేసుకుపోయింది. 2024లో ఓసారి కూడా ఈడీ తనిఖీ చేపట్టింది. పరిశ్రమలకు కేటాయించిన భూములను రెసిడెన్షియల్ ప్రాజెక్టుల కోసం వాడుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కేసుతో లింకున్న మనీల్యాండింగ్ అంశంపై సంజీవ్ ఆరోరాను ప్రశ్నిస్తున్నారు. తొలిసారి ఈడీ దాడి జరిగిన సమయంలో ఆయన రాజ్యసభ ఎంపీగా ఉన్నారు. మళ్లీ సంజీవ్ ఆరోరా నివాసంలో ఈడీ తనిఖీలు మొదలుపెట్టిందని పంజాబ్ సీఎం భగవంత్‌మాన్ తన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ సంవత్సరంలో ఇది మూడో సారి అని, చర్యలు తీసుకుంటామని, రెయిడ్స్ ఎన్ని సార్లు చేసినా ఏమీ దొరకలేదన్నారు.

## మాపార్టీలో ఏక్‌నాథ్ షిండేలు లేరు..



### జమ్ముకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, మే 9:** జమ్ముకశ్మీర్‌లో అధికారంలో ఉన్న జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్‌లో చీలిక ఊహాగానాలను సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. తమ పార్టీలో ఎక్‌నాథ్ షిండేలు ఎవరూ లేరని అన్నారు. ఫిరాయింపులు జరుగవచ్చన్న బీజేపీ వాదనలను ఆయన తోసిపుచ్చారు. జేకేఎన్‌సీలో అంతర్గత సంక్షోభం ఉన్నదని బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సునీల్ శర్మ ఆరోపించారు. ఆ పార్టీ నుంచి విడిపోవడానికి సిద్ధంగా ఉన్న ఏక్‌నాథ్ షిండేలు చాలా మంది ఉన్నారని ఆయన తెలిపారు. పార్టీలో నెలకొన్న అసమ్మతి భయంతోనే సీఎం తన మంత్రివర్గాన్ని విస్తరించలేక పోతున్నారని విమర్శించారు. ఒమర్ అబ్దుల్లా తన మంత్రివర్గాన్ని విస్తరించిన వెంటనే జేకేఎన్‌సీ పేక ముక్కలా కూలిపోతుందని వ్యాఖ్యానించారు. బీజేపీకి చెందిన ప్రతిపక్ష నేత సునీల్ శర్మ వ్యాఖ్యలను సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. జేకేఎన్‌సీలో ఫిరాయింపులు జరుగవచ్చని బీజేపీ చేస్తున్న వాదనలు వారి అసలు ఉద్దేశాలను బయటపెడుతున్నాయని విమర్శించారు. జేకేఎన్‌సీ ఎమ్మెల్యేలు పార్టీతోనే దృఢంగా ఉన్నారని స్పష్టం చేశారు. ఏ ఎమ్మెల్యే కూడా తిరుగుబాటు చేసి బీజేపీలో చేరబోరని ఆయన అన్నారు. మరోవైపు బీజేపీ ఉద్దేశాలను ఇది స్పష్టం చేస్తున్నది సీఎం ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. బీజేపీ సహాయంతోనే ఏక్‌నాథ్ షిండే పార్టీని వీడినట్లు గుర్తు చేశారు. ప్రతిపక్ష నాయకుడు (శర్మ) జమ్ము కశ్మీర్‌లో ముఖ్యమంత్రి కుర్చీని చేజిక్కించుకోవడానికి చాలా ఆత్రుతగా ఉన్నట్లు కనిపిస్తోంది. నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఏక్‌నాథ్ షిండేలు లేరని నేను ఆయనకు చెబుతున్నా అని అన్నారు. ఎన్సీలో అంతర్గత విభేదాలపై ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. మంత్రివర్గ విస్తరణలో జాప్యానికి, రాష్ట్ర హోదా పునరుద్ధరణకు మధ్య సంబంధం ఉన్నదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. మాకు రాష్ట్ర హోదా కల్పించకపోవడం వల్లే మంత్రివర్గ విస్తరణ జరుగలేదు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా నిరాకరించినందుకు బీజేపీని ప్రజలు క్షమించరు. ఇక్కడ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే తప్ప, జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను కేంద్రం పునరుద్ధరించకపోవచ్చని ప్రతిపక్ష నాయకుడి ప్రకటన ద్వారా స్పష్టమవుతోందని ఎద్దేవా చేశారు.

## నేను మాజీ కాదు..

### సోషల్ మీడియాలో ప్రొఫైల్‌ను మార్చిన మమత




**కోల్‌కతా, మే 9:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేయడంతో, మమతా బెనర్జీ తన 'ఎక్స్' బయోను మార్చారు. ఈ అప్‌డేట్‌లో ఆమెను మాజీ ముఖ్యమంత్రి అని పేర్కొనకుండా జాగ్రత్తపడ్డారు. బెంగాల్ ఎన్నికలలో తృణమూల్ ఘోర పరాజయం తర్వాత, మొండి వైఖరితో ఉన్న మమతా బెనర్జీ ఓటమిని అంగీకరించడానికి నిరాకరించారు. గవర్నర్‌కు తన రాజీ నామాను కూడా సమర్పించలేదు. శనివారం ఉదయం 11 గంటల వరకు, 'ఎక్స్'లోని ఆమె ప్రొఫైల్‌లో ఆమెను "గౌరవనీయ ముఖ్యమంత్రి, పశ్చిమ బెంగాల్" అని పేర్కొన్నారు. "మాజీ" అనే పదాన్ని జాగ్రత్తగా వాడకుండా, మమతా తనను తాను "పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి (15వ, 16వ, 17వ విధానసభ)" అని సంబోధించుకున్నారు. 1997లో కాంగ్రెస్ నుండి విడిపోయి ఆమె స్థాపించిన తృణమూల్ కాంగ్రెస్‌కు ఆమె వ్యవస్థాపక అధ్యక్షురాలని కూడా అందులో పేర్కొనబడింది. ఏదేమైనప్పటికీ, మమతా ఈ చర్యతో ఆమె చివరికి ఓటమిని అంగీకరించినట్లు సూచిస్తుంది.

## టివికెపై పోలీసులకు దినకరన్ ఫిర్యాదు



**చెన్నై, మే 9:** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటు చుట్టూ జరుగుతున్న రాజకీయాలు తారస్థాయికి చేరాయి. నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు తమ పార్టీ ఎమ్మెల్యే మద్దతు ఇస్తున్నట్లు నకిలీ లేఖను సృష్టించిందని ఆరోపిస్తూ అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం మరింత ముదిరింది. దీంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.

ఏఎంఎంకేకు చెందిన ఏకైక ఎమ్మెల్యే ఎస్. కామరాజ్ మద్దతు విషయంలో ఇరు పార్టీల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొంది. తమ ఎమ్మెల్యే మద్దతు లేఖను టీవీకే ఫోర్జరీ చేసి గవర్నర్‌కు సమర్పిం చిందని ఏఎంఎంకే అధినేత టీటీవీ దినకరన్ ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా మని హెచ్చరించిన కొన్ని గంటల్లోనే ఆ పని పూర్తి చేశారు. దినకరన్ ఆరోపణలను టీవీకే వెంటనే తిప్పికొట్టింది.

కామరాజ్ స్వయంగా తమకు మద్దతు లేఖ రాస్తున్న వీడియోను విడుదల చేసి, దినకరన్‌కు కౌంటర్ ఇచ్చింది. దినకరన్ అనుమతితోనే తాను టీవీకేకి మద్దతు ఇస్తున్నట్లు కామరాజ్ ఆ వీడియోలో పేర్కొనడం గమనార్హం. ఏఎంఎంకే ఎమ్మెల్యే కామరాజ్ స్వచ్ఛందంగా, సంతోషంగా మాకు మద్దతు లేఖ రాస్తున్న వీడి యో ఇది. దినకరన్ తప్పుడు ప్రచారం చేస్తు న్నారని టీవీకే ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రభు త్వ ఏర్పాటు కోసం తాము ఎవరితోనూ బేరసా రాలు ఆడాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమ టీటీవీ దినకరన్ అనూహ్యమైన మలుపు తిప్పారు. తన ఎమ్మెల్యే కామరాజ్‌తో కలిసి నేరుగా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిసి, అన్నాడీఎంకే నేత ఎడప్పాడి కె. పళనిస్వామికి తమ మద్దతు ఉంటుందని అధికారికంగా ప్రకటించారు. అంతకు ముందు తన ఎమ్మెల్యే కనిపించడం లేదని, రాజకీయ బేరసారాలకు గురై ఉండొచ్చని ఆరోపిం చిన దినకరన్, స్వయంగా ఆయన్ను గవర్నర్ వద్దకు తీసుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది.




### భారత్ అమ్ముల పొదిలోకి అగ్ని ఎంఐఆర్వీ

### ఒడిశా తీరంలో పరీక్షలు విజయవంతం

**భువనేశ్వర్, మే 9:** భారత అమ్ములపొదిలో అత్యాధునిక క్షిపణి వచ్చి చేరింది. అగ్ని ఎంఐఆర్వీ. ఇంటర్ కాంటినెంటల్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. ఈ తరహా క్షిపణి అభివృద్ధి చేయడం ఇదే మొదటిసారి. రక్షణ మంత్రిత్వ శాఖ విజయవంతంగా శనివారం పరీక్షించింది. ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుండి అగ్ని ఎంఐఆర్వీ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిను విజయవంతంగా పరీక్షించినట్లు ప్రకటించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో వ్యూహాత్మక రక్షణ సామర్థ్యాలలో మరో మెట్టు పైకెక్కినట్టయింది. 2026 అసెంబ్లీ ఎన్నికలు వన్ ఇండియాలో పూర్తి వివరాలు డీఆర్డీవో అభివృద్ధి చేసిన క్షిపణి ఇది. దీని ద్వారా మల్టీ పేలోడ్‌లను ప్రయోగించవచ్చు. హిందూ మహాసముద్ర రీజియన్ లోని వివిధ భౌగోళిక ప్రాంతాలలో విస్తరించి ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి ఈ మిస్సైల్స్. ఈ ప్రయోగం డీఆర్డీవో చాలా కాలంగా పనిచేస్తున్న అగ్ని6 క్షిపణి తయారీలో అడ్డంకులు తొలగిపోయినట్టయింది. అగ్ని6 క్షిపణి ప్రోగ్రామ్ కోసం రక్షణ మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం వేచి ఉన్నామని డీఆర్డీవో చైర్‌పర్సన్ సమీర్ వీ కామత్ ఇటీవల వెల్లడించారు. అగ్ని6 క్షిపణి 6,000 నుండి 10,000 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంటుంది. ప్రపంచ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, పశ్చిమాసియాలో ఉద్రిక్తత మధ్య భారత్ ఇటువంటి లాంగ్ రేంజ్ క్షిపణుల అభివృద్ధిని చేపట్టింది. ఈ క్రమంలోనే అగ్ని ఎంఐఆర్వీని తెరమీదికి తీసుకొచ్చింది. విజయవంతంగా పరీక్షించింది. ఎంఐఆర్వీ అంటే మల్టిపుల్ ఇండిపెండెంట్లీ టార్గెటబుల్ రీఎంట్రీ వెహికల్. ఒకే క్షిపణి ద్వారా అనేక లక్ష్యాలను ఛేదించే శక్తిగల క్షిపణిగా రక్షణ శాఖ వివరించింది.

## సిడిఎస్‌గా రాజాసుబ్రమణి

### నేవీ చీఫ్‌గా వైస్ అడ్మిరల్ కృష్ణస్వామినాథన్



**న్యూఢిల్లీ, మే 9:** భారత రక్షణ దళాల్లో నూతన చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్)గా లెఫ్టినెంట్ జన రల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. నౌకాదళానికి నూతన అధిపతిగా వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్‌ను ఎంపిక చేసింది. ప్రస్తుత సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ ఈనెల 30న పదవీ విరమణ చేయనుండగా, ఆయన స్థానంలో సుబ్రమణి బాధ్యతలు చేపడతారు. ఈయన సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు భారత ప్రభుత్వ సైనిక వ్యవహారాల విభాగం కార్యదర్శిగా కూడా వ్యవహరిస్తారు. ఇక, నేవీ చీఫ్ వైస్ అడ్మిరల్ దినేశ్ కుమార్ త్రిపాఠి మే 31న పదవీ విరమణ చేయనుండటంతో కృష్ణ స్వామినాథన్ ఆ పదవిని చేపట్టనున్నారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ) పూర్వ విద్యార్థి అయిన సుబ్రమణి, 1985లో గర్వాల్ రైఫిల్స్‌లో సైన్యంలోకి ప్రవేశించారు. 35 ఏళ్లకు పైబడిన తన సుదీర్ఘ కెరీర్‌లో అనేక కీలక పదవులు చేపట్టారు. ఆర్మీ వైస్ చీఫ్‌గా, సెంట్రల్ కమాండ్ చీఫ్‌గా, మిలిటరీ ఇంటెలిజెన్స్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ, మద్రాస్ యూనివర్సిటీ నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఫిల్ పూర్తిచేశారు. కజకిస్థాన్‌లోని భారత రాయబార కార్యాలయంలో డిఫెన్స్ అటాషెగా కూడా సేవలందించారు. సైన్యానికి చేసిన విశిష్ట సేవలకుగానూ పరమ విశిష్ట సేవా పతకం, అతి విశిష్ట సేవా పతకం, సేనా మెడల్, విశిష్ట సేవా పతకంవంటి పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు. నౌకాదళ నూతన అధిపతిగా నియమితులైన వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ 1987లో నేవీలో చేరారు. ఈయన కూడా ఎన్డీఏ పూర్వ విద్యార్థే. తన కెరీర్‌లో ఐఎన్ఎస్ విక్రమాదిత్య అనే విమాన వాహకనౌకతో పాటు పలు క్షిపణి నౌకలకు కమాండర్‌గా వ్యవహరించారు. వెస్టర్న్ ఫ్లీట్ కమాండర్‌గా, నేవీవైస్ చీఫ్‌గా, సదరన్ నేవల్ కమాండ్‌లో చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. నేవీలో శిక్షణ ప్రమాణాలను మెరుగు పరచడంలో, ఆపరేషనల్ సేఫ్టీని పర్యవేక్షించే ఇండియన్ నేవల్ సేఫ్టీ టీమ్‌ను ఏర్పాటు చేయడంలో కీలక పాత్రపోషించారు. ఆయన సేవలకుగానూ అతివిశిష్టసేవాపతకం, విశిష్టసేవా పతకాలను అందుకున్నారు.

## కేబినెట్ విస్తరణకోసం గవర్నర్‌ను కలిసిన సిఎం యోగి



**లక్నో, మే 9:** ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణ జరుగనుందనే ఊహాగానాల నేపథ్యంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాద్ శనివారం సాయంత్ర 6.30 గంటలకు గవర్నర్ ఆనందిబెన్ పటేల్‌ను కలుసుకోనున్నారు. మంత్రివర్గ విస్తరణలో కొత్తగా ఆరుగురికి చోటు కల్పించే అవకాశం ఉంది. యూపీ క్యాబినెట్‌లో మొత్తం 60 మందికి అవకాశం ఉండగా, ప్రస్తుతం ముఖ్యమంత్రి, ఇద్దరు ఉపముఖ్యమంత్రులుతో కలిసి 54 మంది ఉన్నారు. వీరిలో 21 మంది క్యాబినెట్ మంత్రులు, 14 మంది స్వతంత్ర హోదా కలిగిన మంత్రులు, 19 మంది సహాయ మంత్రులు ఉన్నారు. దీంతో కొత్తగా ఆరుగురికి మంత్రి వర్గంలో చోటు కల్పించే వీలుంది. మంత్రివర్గం నుంచి పలువురిని తప్పించాలని తొలుత పార్టీ అధిష్టానం ఆలోచన చేసిందని, అయితే ఇప్పుడు ఆ ఆలోచన విరమించుకుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొత్తగా మంత్రివర్గంలో చోటు కల్పించే ఆరుగురిలో కృష్ణ పాశ్వాన్, సమాజ్‌వాదీ పార్టీ రెబల్ ఎమ్మెల్యే పూజా పాల్, మనోజ్ పాండే, భూపేంద్ర చౌదరి, అశోక్ కటారియా, రోమి సహాని ఉంటారని తెలుస్తోంది. యోగి ఆదిత్యనాథ్ 2022లో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసారు.

2024 మార్చిలో తొలిసారి క్యాబినెట్ విస్తరణ జరిపారు. 2027లో ఉత్తప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండటంతో ప్రాంతాలు, సామాజికవర్గాల సమీకరణలను దృష్టిలో ఉంచుకుని తాజా మంత్రివర్గ విస్తరణ ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు సాయం అందించాం

### తొలిసారిగా చైనా బహిరంగంగానే ఒప్పకోలు

**న్యూఢిల్లీ, మే 9:** భారత్‌చేపట్టిన ఆపరేషన్ సింధూర్ సైనిక ఘర్షణ సమయంలో తాము పాకిస్థాన్‌కు ప్రత్యక్షంగా సాయం అందించామని చైనా తొలిసారి బహిరంగంగా అంగీకరించింది. ఆపరేషన్ సింధూర్ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా చైనా ప్రభుత్వ మీడియా సంస్థ సీసీటీవీలో ప్రసారమైన కథనాలతో ఈ సంచలన నిజం బయటపడింది. దీనిపై హాంకాంగ్‌కు చెందిన సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ కథనాన్ని ప్రచురించింది. 2025 ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26మంది పారులమృతికి కారణమైన ఉగ్రదాడికి ప్రతీకారంగా, 2025మే 7న భారత్ ఆపరేషన్ సింధూర్ ప్రారంభించింది. ఈ నాలుగు రోజుల ఘర్షణ సమయంలో, చైనాకు చెందిన ఏవియేషన్ ఇండస్ట్రీ కార్పొరేషన్ ఇంజనీర్లు జాంగ్ హెంగ్, జు డా పాక్‌లోని ఎయి ర్‌బేస్‌లో ఉండి అక్కడి వైమానిక దళానికి సాంకేతిక సహకారం అందించారు. ఎయిర్ బేస్‌లో యుద్ధ విమానాల గర్జనలు, హెచ్చరిక సైరన్ల మోత మధ్య, 50డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో పనిచేశామని ఇంజనీర్ జాంగ్ హెంగ్ సీసీటీవీ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ ఘర్షణ సమయంలో పాక్‌కు చైనా శాటిలైట్ ఇంటెలిజెన్స్ కూడా అందించిందని భారత సైన్యం గతంలోనే ఆరోపించింది. ఇప్పుడు చైనా ప్రభుత్వ మీడియానే స్వయంగా ఈ విషయాన్ని అంగీకరించడం, భారత్ చైనా పాకిస్థాన్ సంబంధాలలో కీలక పరిణామంగా మారింది.

## భక్తులకు ప్రసాదంగా డబ్బులు పంపిణీ

### బానోడా బాలాజీ ఆలయంలో వింత ఆచారం



**జైపూర్, మే 9:** ఆలయాల్లో లడ్డూలు, పులిహోర వంటి ప్రసాదాలకు బదులుగా రాజస్థాన్‌లోని బానోడా బాలాజీ ఆలయం తన విశిష్ట ఆచారంతో ప్రత్యేకంగా నిలిచింది. ఇక్కడ భక్తులకు డబ్బును ప్రసాదంగా అందిస్తారు. ఇది ఆలయానికి ఒక ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది. దీంతో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రసాదంగా పొందిన డబ్బును భద్రంగా ఉంచుకోవడం వల్ల తమకు ఐశ్వర్యం సిద్ధిస్తుందని, వ్యాపారాల్లో లాభాలు వస్తాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. కోరికలు నెరవేరిన పిదప, పొందిన సొమ్ముకు మరికొంత కలిపి ఆలయానికి తిరిగి సమర్పించడం ఇక్కడ విలక్షణమైన ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ ప్రత్యేక సంప్రదాయంతో, బానోడా బాలాజీ ఆలయం మహిమాన్విత పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. దూర ప్రాంతాల నుంచీ వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తారు. నిత్యం ఆలయం కిటకిటలాడుతూ, పండుగలు, ఉత్సవాల వేళ రద్దీ మరింతపెరుగుతుంది. డబ్బు ప్రసాదంతో పాటు, లడ్డు, పులిహోర వంటి ఇతర ప్రసాదాలను ఇక్కడ కొనుగోలు చేయవచ్చు. భక్తుల రద్దీ పెరుగుతుండటంతో, ఆలయ విస్తరణ పనులు చేపట్టారు. ఉత్సవాల సమయంలో నిర్ణీత దర్శన వేళలు పాటిస్తూ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



# బిజెపి టార్గెట్ తెలంగాణ

## బిఆర్ఎస్ మళ్లీ రాదు.. కాంగ్రెస్ అంటే ప్రజలు విసిగిపోయారు: ఎంపి ఈటల

**హైదరాబాద్, మే 9 ప్రభాతవార్త:** బిజెపి తదుపరి మజిలీ, టార్గెట్ తెలంగాణ అని, బిఆర్ఎస్ మళ్లీ రాదు.. కాంగ్రెస్ అంటే ప్రజలు విసిగిపోయారని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. సికింద్రాబాద్ నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ మూడవ సారి ప్రధాని అయ్యాక మోడీ తొలిసారి మన రాష్ట్రానికి వస్తున్నారని అన్నారు. భారతదేశాన్ని అస్థిరపరచాలని చూసిన శక్తులను తొక్కి పడేసి అఖండ భారతను సురక్షితంగా ఉంచుతామని మాట ఇచ్చి, సాధించిన విజయంతో ఆయన తెలంగాణకు వస్తున్నారని అన్నారు. బిజెపి తదుపరి మజిలీ, టార్గెట్ తెలంగాణ అని ప్రజలు అనుకుంటున్నారు. బిఆర్ఎస్ వద్దనుకొని కాంగ్రెస్‌కి ఓటు వేస్తే రెండేళ్లలోనే తేలిపోయిందన్నారు. తెలంగాణ అప్పుల ఊబిలో కోరుకుపోకుండా ఉండాలంటే, నియంతృత్వ పోకడలు పోవాలంటే, అభివృద్ధి చెందాలంటే బిజెపినే అధికారంలోకి రావాలనే భావన ప్రజల్లో ఉంది. రేపు మోడీ మీటింగ్‌కి ప్రజలు స్వచ్ఛందంగా వస్తు న్నారు. ఎన్నికల సమయంలో మోడీ ప్రచారానికి వచ్చినప్పుడు మల్కాజిగిరి ప్రజలు చూపిన ప్రేమను ఎక్కడా చూడలేదు అన్నారు. కంటెన్మెంట్‌లో 16 వేల ఓట్లతో ఎమ్మెల్యే విడిపోయినా మోడీ ప్రభావం వల్ల ఎంపి ఎన్నికల్లో 25 వేల ఓట్ల మెజారిటీ వచ్చిందన్నారు. ప్రజల ఉత్సాహం చూసి మా కార్యకర్తలు కూడా ఉత్సాహం అయ్యారు. ఆదివారం నిర్వహించే సమావేశానికి పెద్దఎత్తున హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలకు, తెలంగాణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లుగా మేము చేస్తున్న పనులు చూసి మీరు ఎక్కువ సంఖ్యలో హాజరైతే మాకు కూడా స్ఫూర్తిగా ఉంటుందని, మోడీకి అండగా నిలవాలని కోరుతున్నాను.

## బిజెపి దాడులు ప్రజాస్వామిక వ్యవస్థకు గొడ్డలి పెట్టు : సిపిఎం

**హైదరాబాద్,మే9,ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిజెపి పాల్పడుతున్న రాజకీయ దాడులు, ఘటనలను సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందనీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ వైరుధ్యాలను సిద్ధాంతపరంగా ఎదుర్కోవాలే తప్ప, భౌతిక దాడులకు దిగడం సరైంది కాదనీ పేర్కొన్నారు. కరీంనగర్, హుజూరాబాద్‌లోని బిఆర్ఎస్ ఎంఎల్ఎ క్యాంప్ ఆఫీసులపై, వాహనాలపై, ప్రజా ప్రతినిధుల కార్యాలయాలపై దాడులు జరగడం అమానుషమనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యక్తిగతంగా చౌకబారు విమర్శలు చేసుకోవడం శోచనీయమనీ . అధికార, ప్రతిపక్ష పార్టీలు సంయమనం పాటిస్తూ రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు ప్రజాస్వామ్య పరిధిలోనే ఉండాలనీ హితవు చెప్పారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేస్తోందని జాన్ వెస్లీ అన్నారు.

## టిజి ఇఎపిసిఇటి-2026 ప్రవేశానికి 93శాతం అభ్యర్థులు హాజరు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలోజీ యూనివర్సిటీ హైదరాబాద్‌లో జరిగిన కౌన్సెలింగ్‌కు శనివారం టిజి ఇఎపిసిఇటి-2026 అడ్మిషన్‌ల కోసం 93 శాతం అభ్యర్థులు హాజయ్యారు. ఉదయం పూట 34823 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 32540 మంది హాజరైనారు.2283 మంది అనుపస్థితి చెందారు. అదే విధంగా మధ్యాహ్నం 34808మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 32390 మంది ఉపస్థితైనారు 2418మంది అభ్యర్థులు అనుపస్థితైనారు. ఉదయం 93.44శాతం సాయంత్రం 9305శాతం మంది హాజరైనారు. ఆదిలాబాద్, భద్రాద్రి, హైదరాబాద్ నాలుగు జోన్లు, కరీంనగర్, ఖమ్మం, కోదాడ, మహబూబ్‌నగర్, నల్లగొండ,నిజామాబాద్,సంగారెడ్డి సత్తుపల్లి, సిద్దిపేట, వరంగల్ జోన్‌లలో వివిధ ఇంజనీరింగ్ ప్రొఫెషనల్ కోర్సులలో ప్రవేశాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు కాన్ఫిగరేషన్ డ్రైవ్ జరిపారు.

## అనుమానాస్పద స్థితిలో దంపతుల ఆత్మహత్య

### మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో విషాదం

**జడ్చర్ల, మే 9, ప్రభాతవార్త :** భార్యాభర్తలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. జడ్చర్ల మున్సిపాలిటీలోని 24వ వార్డు విజయనగర్ కాలనీలో దంపతులు ఆకుతోట శేఖర్ (56) వరాలు (49 ) ఇంట్లో పడుకున్న చోటే విగత జీవులుగా పడి ఉండడం చూసి స్థానికులు షాక్ కు గురయ్యారు.



శేఖర్, వరాలు (ఫైల్)

శేఖర్ జడ్చర్లలో బియ్యం వ్యాపారంతో పాటు చీటీల ఏజెంట్‌గా కూడా వ్యవహరించే వారు. కొంతకాలంగా తన భార్య వరాలు అనారోగ్యంతో బాధపడుతుండగా శేఖర్ కూడా ఎక్కువగా బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నట్లు స్థానికులు చెప్పారు. తెల్లవారినా తలుపులు తెరవకపోవడంతో అనుమానం వచ్చిన కుమారుడు కిటికీ ద్వారా చూడగా ఇద్దరు విగత జీవులుగా పడి ఉండటాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు.విషయం తెలుసుకున్న ఎస్ఐలు మల్లేష్ జయప్రద ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పురుగుమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలా ఇతర ఏవైనా ఆర్థిక సమస్యలు ఉన్నాయా లేదా కుటుంబ సమస్యలు ఉన్నాయా అనే పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతదేహాలను జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# విజయవంతంగా సాగిన రైతు వారోత్సవాలు

## వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. బి.గోపి వెల్లడి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** తెలంగాణలో వైభవంగా కొనసాగుతున్న రైతు వారోత్సవాలురైతు సంక్షేమం - ఆధునిక వ్యవసాయ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యంతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా, మే 4 నుండి 9 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'రైతు వారం" కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయని వ్యవసాయ సంచాలకులు డా.బి.గోపి వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖల సమన్వయంతో రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్, యాంత్రీకరణ, పశుసంవర్ధక మరియు నీటిపారుదల అంశాలపై విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు.నేల ఆరోగ్యం - శాస్త్రీయ సాగుకు తొలి అడుగుమే 4న వికారాబాద్ జిల్లా తాండూరులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతువారం కార్యక్రమాలను ప్రారంభించారు, సేంద్రియ రైతులు పండించిన పంటల ఉత్పత్తులను క్రయవిక్రయాల కోసం తెలంగాణ రాష్ట్ర విత్తన మరియు సేంద్రీయ ధ్రువీకరణ అధారిటీ డెవలప్ చేసిన టీజీ ఆర్గానిక్స్ మొబైల్ యాప్ గౌరవ మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించబడింది. రాష్ట్ర వ్యాప్తంగా 14,565 మట్టి నమూనాలను సేకరించి, 20,734 మట్టి విశ్లేషణ పత్రాలను రైతులకు అందజేశారు. నానో ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం, సన్న వరి సాగు వంటి అంశాలపై రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో 1,32,423 మంది రైతులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో ఉద్యానవన రంగానికి ఊతం మే 5న హనుమకొండలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ ఆధ్వర్యంలో మెగా రైతు మేళా నిర్వహించారు. ప్రత్యామ్నాయ పంటల సాగు, ముఖ్యంగా ఆయిల్ పామ్, నూనె గింజలు, పప్పు ధాన్యాల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. బిందు సేద్యం,నీటి పొదుపు సాంకేతికతల వినియోగంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.రైతుకు ఆర్థిక భరోసా - మార్కెటింగ్ సదుపాయాలపై దృష్టిమే 6న రైతులకు పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, సహకార సంఘాల సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 12,779 మంది రైతులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గోదాముల నిల్వ సదుపాయాలు, కనీస మద్దతు ధర,మార్కెటింగ్ అవకాశాలపై మార్కెటింగ్ శాఖ అధికారులు రైతులకు వివరించారు. పశుసంవర్ధక, మత్స్య నీటిపారుదల రంగాలకు ప్రాధాన్యం మే 8న నిర్వహించిన మండల స్థాయి సమావేశాల్లో పశుసంవర్ధక, మత్స్య మరియు నీటిపారుదల శాఖల అధికారులు రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వేసవిలో పశువుల సంరక్షణ, పచ్చిగడ్డి సాగు, చెరువుల నిర్వహణ, చేపల ఉత్పత్తి పెంపు, కాలువల మరమ్మతులు, గేట్ల నిర్వహణ వంటి అంశాలపై కార్యాచరణ వివరించారు.రైతు వారం కార్యక్రమాల ద్వారా రైతుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, వ్యవసాయ ఖర్చులు తగ్గించి, దిగుబడులు మరియు ఆదాయాలు పెంచడం ద్వారా తెలంగాణ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మెగా రైతు మేళలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన వరి మొక్కజొన్న జొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటుం దని రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గ చూపుతూ అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయాలని దీనికి ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తుందని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేస్తుందని రైతులు ఈ పంట పండించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని వారికి బదులుగా పప్పు దినుసులు కూరగాయ పంటలను పూల మొక్కలను పండించడం ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ,అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను తిలకించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మాత్యులతో పాటుగా మంత్రులు కొండా సురేఖ,శ్రీహరి,ఎంపీ కావ్య, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా.బి.గోపి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. చివరి రోజు మే 9న నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చెరువుల కంపచెట్లు గుర్రపు డెక్క తొలగింపు సమతుల్య నీటి వినియోగం పై రైతులకు అవగాహనతో ఈ రైతు వారోత్సవ అవగాహన కార్యక్రమాలు ముగిసాయి.

# తెలంగాణ అభివృద్ధికి మోడీ గ్యారెంటీ

## కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలది ఎంఐఎం అజెండా

### బిజెపి రాజ్యసభ సభ్యుడు డా. కె.లక్ష్మణ్



**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోందని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేసే పర్యటన అని బిజెపి రాజ్యసభ సభ్యులు డా. కె. లక్ష్మణ్ పేర్కొన్నారు. 'మోడీ అంటే మోడల్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఇండియా' అని, దేశ ప్రజలు తమ తీర్పుతో మోడీ పట్ల ఉన్న విశ్వాసాన్ని పదేపదే నిరూపిస్తు న్నారని అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా కమలం జెండా రెపరెపలాడుతున్న వేళ, గోల్కొండ కోటపై కాషాయ జెండా ఎగిరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ వికాస్, విశ్వాస్, విరాసత్ అనే నినాదాలతో సబ్ కా సాథ్ సబ్ కా వికాస్‌ను ఆచరణలో చూపిస్తుంటే.. కాంగ్రెస్, బిఆర్ఎస్, ఇండి కూటమికి ఎటువంటి అజెండా లేదని లక్ష్మణ్ విమర్శించారు. కాంగ్రెస్ + బిఆర్ఎస్ = ఎంఐఎం అని, ఈ మూడు పార్టీల పేర్లు వేరైనా వారి విధానాలు ఒకటేనని మండిపడ్డారు. అవినీతి, కుటుంబ పాలన, వంశపారంపర్య రాజకీయాలే ఆ పార్టీల లక్ష్యాలని, లౌకిక వాదం పేరుతో ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాలకు పాల్ప డుతూ హిందువులను, దేవీ దేవతలను కించపరచడమే వీరు పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నాయకత్వాన్ని మెప్పించుకోవడానికి 'కాంగ్రెస్ ఈజ్ ముస్లిం.. ముస్లిం ఈజ్ కాంగ్రెస్' అనే స్థాయికి దిగజారారని, ఆయన అనుముల రేవంత్ రెడ్డి కాదు.. అనుముల రేవంత రెడ్డిగా మారుతున్నారని ఆరోపించారు. నాడు సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి వెళ్లిన రాజేంద్ర ప్రసాద్‌ని అప్పటి ప్రధాని నెహ్రూ అడ్డుకుంటే, నేడు అయోధ్య రామమందిరాన్ని రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు ద్వేషిస్తున్నారని లక్ష్మణ్ ఎద్దేవా చేశారు.

సిఎం రేవంత్ రెడి హేట్ స్పీచ్ చట్టం గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని, ధైర్యముంటే హిందువులపై విద్వేష వ్యాఖ్యలు చేసిన ఓవైసీని జైల్లో వేయాలని సవాల్ విసిరారు. రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి పదేపదే భారత ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ సంస్థలను కించపరుస్తున్నారని, ఆపరేషన్ సిందూర్ వంటి సైనిక విజయాలను, మహిళా అధికారులు సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ వంటి వారి సేవలను కించపరచడం దురదృష్టకరమన్నారు. నిజాం రజాకార్ల అరాచక పాలనను సమర్థించే స్థాయికి దిగజారిన కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు వచ్చాయన్నారు. సర్దార్ పటేల్ లేకుంటే తెలంగాణ పరిస్థితి ఏమయ్యేదో ఆలోచించుకోవాలని సూచిం చారు. 2029 నాటికి తెలంగాణలో బిజెపి బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతుందని, ఇతర పార్టీల ప్రముఖులు సైతం మోదీ నాయకత్వాన్ని బలపరిచేందుకు సిద్ధంగా ఉన్నారని డా. కె.లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

## బదలీల నుండి దివ్యాంగ ఉద్యోగులకు మినహాయింపు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగుల బదలీల్లో వికలాంగ ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళాభి వృద్ధి, శిశు సంక్షేమ, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖ తాజాగా జారీ చేసిన ఉత్తర్వు ప్రకారం, 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఇకపై సాధారణ బదిలీలు, రొటేషనల్ బదిలీ విధానాల నుండి మినహాయింపు ఉంటుంది. దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 కింద జారీ చేసిన ఉత్తర్వులో, అర్హులైన ఉద్యోగులు పరిపాలనాపరమైన పరిమితులకు లోబడి వారి ప్రస్తుత పోస్టింగ్ స్థానంలో కొనసాగవచ్చని పేర్కొంది. నిర్దిష్ట వైకల్యాలున్న ఉద్యోగుల సేవలను గరిష్టంగా వినియోగించుకునేందుకు వారిని అక్కడే కొనసాగించాలని కూడా అందులో పేర్కొంది. అలాగే మేధో వైకల్యం ఉన్న పిల్లలు గల ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ మినహాయింపు వర్తిస్తుంది. 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఆధారపడిన కుమార్తెలు, కుమారులు, తల్లిదండ్రులు, జీవిత భాగస్వాములు, సోదరులు లేదా సోదరీమణుల సంరక్షకులకు, పరిపాలనా నిబంధనలకు లోబడి, సాధారణ బదిలీల నుండి మినహాయింపు ఉంటుందని తెలిపింది. కాగా దివ్యాంగులు, వృద్ధులు మరియు ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ డైరెక్టర్ వీటికి సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించారు. ఈ ప్రతిపాదనలను కూలంకషంగా పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

## టిజెఎస్ అధ్యక్ష పదవికి ప్రొఫెసర్ కోదండరాం నామినేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 9:** మే 12న హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ జన సమితి (టిజెఎస్) పార్టీ రాష్ట్ర 4వ ప్లీనరీ నేపథ్యంలో పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ ఇదివరకే విడుదల కాగా శనివారం ప్రొఫెసర్ కోదండరాంను అధ్యక్షులుగా బలపరుస్తూ పార్టీ నాయకులు 3 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియకు పార్టీ సీనియర్ నేతలు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వరరావు ప్రధాన ఎన్నికల అధికారిగా, మహమ్మద్ అఫ్జల్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ నెల 12న జరిగే ప్లీనరీలో నూతన అధ్యక్షుని ఎన్నికను లాంఛనంగా ప్రకటించనున్నారు.




బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో లింగ వివక్ష నివారణపై డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో జరిగిన చర్చాగోష్టిలో పాల్గొన్న డిజి చారు సిన్హా. చిత్రంలో వివిధ రంగాల ప్రముఖులు

## లింగ వివక్ష నివారణపై డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో చర్చాగోష్టి

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** సమాజంలో మహిళలకు ఎదురవుతున్న చిన్నచూపు, లింగ వివక్షత వారి మానసిక భద్రతపై తీవ్ర ప్రభా వం చూపుతుందని రాష్ట్ర మహిళా భద్రత విభాగం (డబ్ల్యుఎస్‌డబ్ల్యు) డిజి చారు సిన్హా తెలిపారు. బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లో శనివారం నాడు డబ్ల్యుఎస్‌డబ్ల్యు ఆధ్వర్యంలో వీ హబ్ వేదికగా జరిగిన స్టాండ్ విత్ హర్ చర్చాగోష్టి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో చారు సిన్హా మాట్లాడుతూ మహిళల పట్ల ఆయా రంగాలలో కొనసాగుతున్న వివక్షత సమూలంగా అంతరించాలని అన్నారు. ఉద్యోగాలు చేసే ప్రాంతంలో ఎగతాళి, అసభ్యకరంగా జోకులు వేయడం వంటి వి ప్రమాదకరంగా మారుతున్నాయని ఆమె తెలిపారు. ఇటువంటివి రూపుమాపాలని ఆమె కోరారు. ఇలాంటి తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ విషయంలో పురుషులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాలని ఆమె తెలిపారు. కార్పొరేట్ రంగ ం ప్రతినిధి శైలజ జోత్యుల మాట్లాడుతూ మహిళల ఎంపికను అందరు గౌరవించాలని కోరారు. ఇది సమాజ ఎదుగుదలలో కీలకమని ఆమె అ న్నారు. ఈ సమావేశంలొ సినీ దర్శకుడు శైలేష్ కొలను, టాటా అడ్వాన్స్ సిస్టం ఈడీ మసూద్ హుస్సేని, జర్నలిస్టు ప్రేమ మాలిని తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ లీవ్ పిటిషన్ హేయమైన చర్య

## 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

**హైదరాబాద్, మే 9,ప్రభాతవార్త:** డిఎస్‌సి 2003లో నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలని డివిజనల్ బెంచ్ స్పష్టమైన తీర్పు ఇవ్వగా ప్రభుత్వం స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం హేయమైన చర్యగా పిటిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి బిక్షంగౌడ్,మర్రి జయపాల్‌రెడ్డి జి.కృష్ణమూర్తిలు తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం 2004సెప్టెంబర్ 1కి ముందు జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా నియామకం పొందిన వారికి పాత పెన్షన్ వర్తింప చేయాలని అమలు చేస్తోందని అంతేకాకుండా రాష్ట్రప్రభుత్వాలు కేంద్రం ఇచ్చిన ఉత్తర్వులు 57/4, 57/5 ప్రకారం అమలు చేయాలని కూడా తెలిపిందని వారు గుర్తుచేశారు. ఇటీవల టిజిఇజెఎసితో చర్చలు జరిపిన ముఖ్యమంత్రి ఓల్డ్‌పెన్షన్ విధానంపై సానుకూల నిర్ణయం తీసుకొంటామని హామి ఇచ్చారని ఐనా స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం ద్వంద్వవైఖరీ అని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం నిర్ణయాన్ని పరిగణలోకి తీసుకోకుండా అధికార యంత్రాంగం తప్పుదోవ పట్టిస్తోందని ఆవేదన చెందారు. ఉద్యోగుల పట్ల సానుభూతిగా వ్యవహరిస్తూ స్పెషల్ లీవ్‌పిటీషన్ వెనక్కి తీసుకోవాలని కోరారు.

### సిపిఎస్ పెన్షన్ విధానం అమలు చేయడం తగదు : తపస్

ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలనీ తపస్ రాష్ట్ర అధ్యక్షులు ఒడ్నాల రాజశేఖర్,ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలులోకి వచ్చి నప్పుడు, దానికి అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4, 57/5 ఉత్తర్వులు అత్యంత కీలకమైనవి అన్నారు. వీటి ప్రకారం సిపిఎస్ అమలుకు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా నియామకమైన వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలనీ కోరారు. మన రాష్ట్రంలో ఐఎఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు ఈ ప్రయోజనాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సామాన్య ఉద్యోగ ఉపాధ్యాయులకు మాత్రం నిరాకరించడం సరైనది కాదనీ పేర్కొన్నారు .

### 57 మెమో అమలుపై ప్రభుత్వ చర్య అనైతికం : టిఎస్ యుటిఎఫ్ డిమాండ్

జాతీయ పెన్షన్ పథకం సిపిఎస్ అమలు తేదీకి ముందు విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఆ తదుపరి నియామకమైన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం 57 మెమో ద్వారా జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా హైకోర్టు తీర్పు ను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం పట్ల టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల జెఎసితో జరిపిన చర్చల్లో ఉపముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి కూడా పదిహేను రోజుల్లో నిర్వహించే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చి, అదేరోజు సుప్రీంకోర్టులో కేసు వేయడం అనైతికమని టిఎస్ యుటిఎఫ్ విమర్శించింది.

## రూ. 30,656 కోట్లతో 1,601 ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులు

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త :** ప్రధాన మంత్రి సంపద యోజన పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా 1,601 ప్రాజెక్టులు ఏర్పాటుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.30,656.57 కోట్లు కాగా, ఆమోదించబడిన గ్రాంట్లు రూ.8,853.38 కోట్ల సహాయ నిధులు ఉన్నాయి. సంపద యోజన కాంపొనెంట్ స్కీమ్‌ల కింద దాదాపు 60 ప్రాజెక్టులు ఆమోదించబడ్డాయని తాజాగా కేంద్ర అధికారులు తెలిపారు. వాటిలో ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ అష్యూరెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్కీమ్ కింద ఒక ప్రాజెక్టు అమలు చేయబడిందని వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించిన పంటలకోత అనంతర మౌలిక సదుపాయాలు మరియు ప్రాసెసింగ్ సౌకర్యాలను సృష్టించడం వలన రైతులకు అనంతర నష్టాలు తగ్గుతాయని కేంద్రం భావిస్తోంది. కాంపోనెంట్ పథకాలు ఆహార ప్రాసెసింగ్, సంరక్షణ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి వ్యవస్థాపకులకు గ్రాంట్ల రూపంలో ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొంది. వీటిలో ఇతరత్రా, పంటకోత అనంతర నష్టాలను తగ్గించడానికి కోల్డ్ స్టోరేజీలు మరియు రిఫ్రిజిరేటెడ్ వాహనాలు కూడా ఉండటం విశేషం. నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ సహాయంతో ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్, విలువ జోడింపు మౌలిక సదుపాయాల పథకం కింద అమలు చేయబడిన యూనిట్ల ప్రభావం పై అధ్యయన నివేదికను సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల మంత్రిత్వ శాఖ యొక్క ఇంటిగ్రేటెడ్ కోల్డ్ చైన్ మరియు విలువ జోడింపు మౌలిక సదుపాయాల పథకం జోక్యం కారణంగా, అన్ని రంగాలు వృధాలో కొంత తగ్గుదల చూపించగా, పండ్లు కూరగాయలు, పాడి, మత్స్య రంగాలు వృధాలో గణనీయమైన తగ్గుదల చూపించాయని పేర్కొంది.

# సింగరేణి భవిష్యత్తు కోసం 9 కొత్త గనులు

## ఇంధన అవసరాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

### సింగరేణి సిఎండి డాక్టర్ బుద్దప్రకాష్

**హైదరాబాద్, మే 9, ప్రభాతవార్త:** సంస్థకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న ఉద్దేశంతో కొత్త గనుల ఏర్పాటుకు సింగరేణి ముమ్మర సన్నాహాలు చేస్తోంది. బొగ్గు నిల్వలు అయిపోగా మూతపడుతున్న గనుల ఉత్పత్తిని భర్తీ చేయడంతో పాటు, కార్మికులకు ఉపాధిని కొనసాగించడానికి, పెరుగుతున్న రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చడానికి కొత్త గనులను ప్రారంభించాలని నిర్ణయించినట్లు సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి వెల్లడించారు. హైదరాబాద్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో 9 ప్రాజెక్టులు చేపట్టడానికి ప్రణాళిక రూపొందించి, కేంద్ర బొగ్గు, అటవీ, పర్యావరణ శాఖల అనుమతికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే 3 గనులకు అనుమతులు రాగా. వీటిలో ఒడిశా లోని నైనీ బ్లాక్‌లో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించడం జరిగిందన్నారు. దాదాపు దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కార్యరూపం దాల్చిందని చెప్పారు. అలాగే కొత్తగూడెంలో వీకే కోల్ మైన్ కూడా దాదాపు అన్ని అనుమతులను పూర్తి చేసుకుని బొగ్గు ఉత్పత్తికి సిద్ధమైందన్నారు. 2027-28 నాటికి సింగరేణిలో 4 గనులు మూతపడుతుండగా. ఏడాదికి 12.51 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోనుందని వివరించారు. అయితే కొత్తగా ప్రారంభించనున్న ఐదు ప్రాజెక్టుల వల్ల ఈ లోటును భర్తీ చేసుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. సింగరేణి ప్రాంతంలో ఇప్పటికే బొగ్గు తవ్వకాలు పూర్తి చేసుకొని మూతబడిన భూగర్భ గనుల లోతుల్లో ఇంకా మిగిలి ఉన్న బొగ్గు ఖనిజాన్ని వెలికి తీయడానికి ఈ ప్రాజెక్టులను చేపట్టినట్లు తెలిపారు. సింగరేణి రూపకల్పన చేసిన కొత్త ప్రాజెక్టుల్లో కొత్తగూడెం ఏరియాలో బొగ్గు తవ్వకాలు పూర్తిచేసిన భూగర్భ గనుల నుండి 190 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు గల వీకే కోల్ మైన్ ప్రధానమైనదిగా పేర్కొనవచ్చన్నారు. ఈ గనికి సంబంధించి ఇప్పటికే దాదాపు అన్ని అనుమతులు రాగా ఓవర్ బర్డెన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది, త్వరలో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఇక జేకే ఓపెన్ కాస్ట్ గని (ఇల్లందు ఏరియా) 19.68 మిలియన్ టన్నులు. రామగుండం ఓసీ1 విస్తరణ ప్రాజెక్టు (రామగుండం3 ఏరియా) 181.60 మిలియన్ టన్నులు.గోలేటి ఓపెన్ కాస్ట్ (బెల్లంపల్లి ఏరియా) 38.98 మిలియన్ టన్నులు.ఎం.వి.కె ఓపెన్ కాస్ట్30.34 మిలియన్ టన్నులు.మణుగూరు ఓపెన్ కాస్ట్ ఎక్స్ టెన్షన్ (మణుగూరు ఏరియా) 40.45 మిలియన్ టన్నులు.ఆర్.కె.పి ఓసీపీ ఫేజ్2 (మందమర్రి ఏరియా) 34.42 మిలియన్ టన్నులు. పీకే కోల్ మైన్, కొండాపూర్ (మణుగూరు ఏరియా) 62 మిలియన్ టన్నులు కలిగిన వీటి పనులు వేగతంగా జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు ఎల్.వి సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, పోట్రు గౌతమ్, తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డాక్టర్ విజయ్‌కుమార్ మృతి

**కల్వకుర్తి, మే 9 ప్రభాతవార్త:** జడ్చర్ల-కోదాడ ప్రధాన రహదారిపై కల్వకుర్తి సమీపంలోని సీబీఎం కళాశాల వద్ద శనివారం ఉదయం 7 గంటలకు చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వైద్యులు గైనకాలజిస్ట్ డాక్టర్ విజయ్ కుమార్ మృతి చెందారు. సంఘటనకు సంబంధించిన స్థానికులు తెలిపిన వివరాల మేరకు... అక్షరవనంలో డాక్టర్ విజయ్‌కుమార్ ప్రతి రోజు ఉదయం షెటిల్ బ్యాడ్మింటిన్ ఆడేవారు. రోజు లాగానే షెటిల్ అడి కల్వకుర్తికి తన కారులో వస్తున్న సందర్భంగా ఎదురుగా వస్తున్న స్కూల్ బస్సు ఎదు రెదురుగా ఢీకొన్న సంఘటనలో డాక్టర్ విజయ్‌కుమార్ తీవ్రంగా గాయ పడ్డారు. వెంటనే 108లో కల్వకుర్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందిస్తుంగా మృతి చెందినట్లు తోటి వైద్యులు తెలిపారు. మృతుడు డాక్టర్ విజయ్‌కుమార్ స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే వారని అది కాకుండా ప్రయివేటు ఆసుపత్రి ప్రజావైద్యశాలలో పని చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారని, చిన్న వయస్సులోనే అకాల మరణం చెందడం చాలా బాధకర మని కల్వకుర్తి వాసులు కన్నీంటిపర్యంతమయ్యారు. ఆసుపత్రి ఆవరణలో విషాద ఛాయలు అలుముకున్నాయి.



విజయ్‌కుమార్ (ఫైల్)

# భగవంతుని ప్రతిరూపం అమ్మ ఒకటే!




మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ అనే మన పురాణాలలో ప్రథమ స్తుతి తల్లితో మనం ప్రారంభించి తండ్రిని, గురువును, అతిథిని ఇలా ప్రణామ క్రమం చెప్పమని సంప్రదాయం నేర్పింది. ఆకలేస్తే అమ్మ, ఆపదొస్తే అమ్మ, ఆప్యాయత ఇస్తే అమ్మ, ఆదమరిస్తే జాగృతం చేసేది అమ్మ, మన అభివృద్ధిని కాంక్షి ంచేది అమ్మ, మనకొక ఆకృతి ఇచ్చి భువిపై ఉనికిని ప్రసాదించేది అమ్మ.

ఈ మానవ జన్మకే కాదు, జంతువులకు, పక్షులకు, వృక్షాలకు కూడా తల్లి రక్షణలోనే సాగుతుంది జీవనం. అరమరికలేని ఆప్యాయతను అందించే అమ్మ ప్రత్యామ్నాయం లేని పవిత్ర ప్రేమకు చలనరూపం. తల్లే దైవమని ఘోషించిన సకల వేద రూపం మాతృమూర్తి. అందుకే మాతృదేవతగా చెప్పబడుతోంది. తారతమ్యం చూపని చైతన్య మూర్తి అమ్మ. అటువంటి మాతృమూర్తి కోసం సంవత్సరంలో ఒకే ఒక్క రోజును కేటాయించే సంప్రదాయం కాదు భారతీ యులది. హిందూ దేశంలో జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే ఉపనిషత్సారం మనం గౌరవిస్తాం. కన్నతల్లి, మాతృభూమి స్వర్గం కంటే గొప్పవని తెలుసుకోవాలి. బిడ్డల ఆలనాపాలన చూస్తూ చక్కని భవిష్యత్తు నిర్మాణం కోసం నిరంతరం శ్రమిస్తూ బిడ్డల ఎదుగుదల చూసి నిస్వార్థంగా సంతోషించే మాతృమూర్తికోసం జీవితకాలం వెచ్చించాల్సిన కనీస ధర్మం. పాశ్చాత్యదేశాలలో పిల్లలు ఎదిగి తమతమ బాధ్యత తెలుసుకొని జీవించవలసిన స్థాయికి చేరుకుని తల్లి దండ్రులను వదలి వెళ్లిపోయి ఏడాదికి ఒక రోజు జననీజనకులకోసం మాతృదినోత్సవం, పితృదినోత్సవం వంటివి జరుపుకుంటారు. ప్రపంచ వ్యాప్తంగా 40కి పైగా దేశాలు ఈ సంప్రదాయం అనుసరిస్తున్నాయి మన చరిత్రలో శివాజీ తల్లి జిజియాబాయి తన కుమారునికి బాల్యం నుంచి స్త్రీల పట్ల గౌరవభావం, ధర్మానువర్తన, సమాజం కొరకు త్యాగనిరతి మొదలైన విషయాలపై అవగాహన కలిగించటం వలన మహిళలను గౌరవించటంలో అధికప్రాధాన్య మిచ్చేవాడు. కనుకనే చరిత్రలో శివాజీకి ఓ ప్రత్యేక స్థానం ఇస్తున్నాము. అది అతని మాతృమూర్తి పెంపకం వలన వచ్చిన వ్యక్తిత్వం. నేడు తల్లిపాత్ర తన ధర్మం మరచి విచక్షణ కోల్పోయి కన్నబిడ్డలను అతి చిన్న కారణాలకు పొట్టన పెట్టుకొనే కలియుగ మాతృమూర్తులు అక్కడక్కడ తారసపడు తున్నారు. వర్తమానంలో టీవీ చూడనివ్వడం లేదని 5 సం.ల పిల్లవాడిని తల్లి హతమార్చింది. ఏడాది బిడ్డ అడ్డుగా వస్తోందని హతమార్చి ప్రియునితో వెళ్ళిపోయినదొక తల్లి. మనసంతా కెలుకుతున్న అనుభూతి కలుగుతోంది. భారతదేశం మనకు అందించిన కొంతమంది మాతృమూర్తులు సర్వేపల్లి రాధాకృష్ణకు జన్మనిచ్చిన సీతమ్మ, సరోజినీదేవి మాతృ మూర్తురాలు వరద సుందరీదేవి, రవీంద్రనాథ్ ఠాగూర్ మాతృమూర్తి శారదాదేవి, పీ.వి. నరసింహారావు తల్లి రుక్మాబాయి, అటల్ బిహారీ వాజపేయి తల్లి కృష్ణాదేవి, అబ్దుల్ కలాం తల్లి ఆషియమ్మ, భగత్సింగ్ తల్లి విద్యావతి, నేతాజీ సుభాష్ చంద్రబోస్ తల్లి ప్రభావతీదేవి ఇలా అనేకమంది మాతృమూర్తులు అపురూప కానుకలుగా వారి సంతానాన్ని మనకు అందించి భారతదేశ గౌరవ ప్రతిష్ఠలను ఇనుమడింపచేసారు. మాతృత్వం భగవంతు డిచ్చిన వరం. అది పొందలేని మహిళలు ఎంతో కృంగిపోతున్నారు. విలాసాల కోసమో, స్వేచ్ఛ కోసమో బిడ్డలకు దూరమయి వారికి మాతృవియోగం కలిగించటం నేరం కాదా. ఇక్కడ ఆలోచించవలసిన విషయం ప్రాణం పోసే తల్లే బిడ్డల ప్రాణం తీసే దిశగా వెళ్ళడం. ఇది సమాజానికి హానికరం మరియు చెడు సంకేతం. దయచేసి మాతృమూర్తులందరూ అమ్మాఅనే పిలుపుకి కళంకం తీసుకొని రావద్దు. మనకు స్ఫూర్తినిచ్చిన మాతృమూర్తులకు కృతజ్ఞతలు.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

**చిట్కా:** లెదర్ వస్తువులు మురికి పట్టి వుంటే నిమ్మబద్దతో రుద్దండి.

**అంతర్వాణి**

# అందరికీ మేలు చేద్దాం..

మేలైనది చేయవలెనను కోరిక నాకు కలుగుచున్నది గాని, దానిని చేయుట నాకు కలుగుటలేదు. నేను చేయగోరు మేలు చేయగోరని కీడు చేయుచున్నాను (రోమా 7:18). మనం ఎవరికీ కీడు తలపెట్టాలని అనుకోం. సాధ్యమైనంతవరకు ఇతరులకు మేలుచేయాలని తపిస్తుంటాం. కానీ పైవాక్యం దేవుడి దృష్టిలో చూడాలి. ఆయన దృష్టిలో మనం మేలైనది చేయాలనే ఆశ ఉంటుంది. కోరికూడా ఉంటుంది. అందుకు ప్రయత్నిస్తుంటాం. ఇక్కడే మనం పొరపాట్లు చేస్తుంటాం. ఎందుకంటే ఎప్పుడైతే మనం దేవుడి రక్తంలోకడుగబడి, రక్షణ అనే ధన్యతలోకి వస్తామో అప్పుడు మనం అపవాదికి టార్గెట్గా మారిపోతాం. ఇక వాడు మనతో పోరాడుతూనేఉంటాడు. దేవుడికి ఇష్టమైన పనులు చేయకుండా ఆటంకపరుస్తూ ఉంటాడు. ప్రార్థన చేసుకోనివ్వడు, బైబిల్ చదువు కోనివ్వడు, ఇతరులు మనపై నిఘా ఉంచి, మన లోపాలను, తప్పులను ఎత్తిచూపాలని ప్రయత్నిస్తుంటారు. మనం క్రైస్తవులుగా మారితే ప్రపంచం మనల్నిదేవదూతలా మారిపోవాలని చూస్తుంది. అందుకే విశ్వాసులు నలిగిపోయినంతగా మరెవ్వరూ నలిగిపోరు. ప్రతి చోటా నీతిగా, నియితీగా ఉండాలి. అబద్దాలు చెప్పకూడదు. ఈ ప్రయత్నంలో మనం ఉంటే, లోకం మాత్రం మనల్ని నిందించేందుకు, విమర్శించేందుకుయత్ని స్తుంటుంది. మనల్ని అబద్ధికులుగా, అన్యాయస్తులుగా ముద్రించేందుకు ప్రయత్నిస్తుంది. అయినా పర్వాలేదు దేవుడి కోసంనమ్మకంగా జీవించాలి. సరే కొన్నిసార్లు కాదు చాలాసార్లు పొరపాట్లు చేస్తూనే ఉంటాం. అది మన శరీరంలో ఉన్న బలహీనత, దేవుడినియమానికి వ్యతిరేకంగా పోరాడే ఒక ముల్లు మన దేహంలో ఉంది. కానీ పూర్తిగా దేవుడిపై ఆధారపడినప్పుడు ఇలాంటి బలహీనతలనుమెల్లమెల్లగా జయిస్తుంటాం. సాధ్యమైనంతవరకు అందరికీ మేలు చేద్దాం. దేవుడు అట్టి కృప మనకు దయచేయునుగాక..

**- పి.వాణిపుష్ప**

# 'ఆమె' భద్రతకు 'సుమతి' భరోసా!



అది అర్ధరాత్రి 1 గంట సమయం. నిశిరాత్రివేళ..
ఎవరో ఒకామె బస్టాండ్లో నిలుచుని ఉంది. అలా ఒక్కతే ఒంటరిగా ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు అనిపిస్తుంది భారీగానూ ఉండదు. అలా అని బక్కపలచని ఆకారమూ కాదు. ఆమెను చూస్తే పెద్దామె కాదు అలా అని చిన్న వయస్కురాలిగానూ అనిపించదు. ఎవరైతేనేమి? ఆమె ఒక 'ఆడపిల్ల'. ఎక్కడ్నించి చూసారో ఏమో! కొందరు ఆకతాయిలు. అంగలు వేసుకుంటూ అక్కడికి నడిచొచ్చేసారు.

'అర్థరాత్రి ఆడపిల్ల ఒంటరిగా నడిరోడ్డుమీద నడిచి వెళ్లగలిగినపుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్ల'ని జాతిపిత మహాత్మాగాంధీ ఏనాడైతే అన్నారో గానీ స్వాతంత్ర్యం సిద్ధించి 79 ఏళ్ల గడచినా ఆయన కలలు కన్న 'స్త్రీ స్వాతంత్ర్యం' వచ్చినట్లు లేదు. మళ్లీ మళ్లీ అవే వ్యాఖ్యలు చెప్పుకుంటుంటాం. అందుకే ఈ సన్నివేశానికి అంతటి ప్రాధాన్యత. ఆమె ఉన్నది హైదరాబాద్లోని దిల్షుక్నగర్. బస్టాండులో బెదురు చూపులు లేవుకానీ ఎంతో ధైర్యంగా నిలబడి ఉంది. అలా అక్కడ ఆ సమయంలో ఆడపిల్ల ఉందంటే ఏ ప్రియుని కోసమో ఎదురు చూస్తూ ఉండచ్చు. లేదా ఎవరితోనో లేచి వచ్చేసేనా ఉండాలి. లేదా బతుకు తెరువు కోసం పొట్ట పోసుకుందామని ఊరినుంచి వచ్చేనైనా ఉండాలి లేదా పడుపుకత్తె అయినా అయి ఉండాలి. దూరంగా చూసే ఏ ఆకతాయి అయినా




ఇలాగే విశ్లేషించుకుంటారు ఎందుకంటే ఇది పాడు లోకం. ఏమైతేనే ఒంటరిగా ఉంది. అది పసికట్టిన పోకిరీలు, అర్ధరాత్రి పూట 'టీ'కోసమంటూ బయటికొచ్చిన ఆకతాయిలైనా అయిఉండాలి. దిల్సుఖ్నగర్ రాజీవ్చౌక్లోని ఓ లాడ్జి సమీపంలో 'ఒక ఆమె' ఒంటరిగా నిలబడి ఉంది. ఎక్కడ్నించో గమనించిన 'ఆకలి కళ్లు' (చూపులు) ఆమెను గమనించి చుట్టూ చేరాయి. ఒకరు ఇద్దరు ముగ్గురు ఇలా దాదాపు 40 మంది వరకు ఆమె ముందు నుంచి 'గేలి' చేస్తున్నారు. ఎంత తీసుకుంటావని అసభ్యకరమైన మాటలతో విసిగిస్తున్నా ఆమె మారు మాటలాడలేదు. మౌనంగా ఉండిపోయింది వారి వ్యంగ్య వచనాలకు ఆమెలో ఏ ఫీలింగూ లేదు. ఆమెకు ఏ మాత్రం భయం లేకపోయినా బిత్తర చూపులు చూస్తోంది. 'భీతహరిణేక్షణి'గా అనుకుంటారు కాబోలు ఆమెను చూసి. కొందరు ద్విచక్రవాహనాలపై ఆమెకు దగ్గరగా వచ్చి చేరారు. వెకిలి మాటలు తాకాలని ప్రయత్నించడం... మందుబాబులైతే మరీను. అయినా ఆమె ఓర్చుకుంది. పైగా నిదానించింది కూడా. ఆమెపై అసభ్యకర వ్యాఖ్యానాలు చేస్తూనేఉన్నారు. వారిలో వాళ్లకి ఒళు పైకి తెలియడం లేదు. వారి వెకిలిచేష్టలకు ఎక్కడికీ పరిగెత్తకుండా విసవిసలు పడకుండా అంత ధైర్యంగా ఉంటే వారు మరీ కేరింతలు కొట్టారు. ఉండుండి మరీ పేట్రేగిపోతున్నారు. అదే సమయంలో ఆ మహిళకు ఓ పోలీసు కానిస్టేబుల్ వచ్చి సెల్యూట్ చేశారు. అపుడు కానీ ఆ పోకిరీలకు ఆకతాయిలకు బుర్ర వెలగలేదు. వెంటనే అక్కడ్నించి పరుగు లంకించుకు న్నారు. ఆమె ఎవరో కాదు. మల్కాజ్గిరి పోలీసు కమిషనర్ సుమతి. విధి నిర్వహణలో ఎంతో చురుగ్గా వ్యవహరిస్తారని ప్రతీతి. అంతమంది పోకిరీలు, ఆకతాయిలూ ఒక్క పక్క విసిగి స్తున్నా కదలకుండా పరిస్థితులను పరిశీలి స్తున్న 'సుమతి' విశ్వరూపం బయట పడగానే వారంతా ఎక్కడి దొంగలు అక్కడినే గప్చిప్! అనుకున్నారు. తలోదారినా పారి పోయారు. ఐనా 'సుమతి' చుట్టూ మూగి అల్లరి చేసిన వారిని పోలీసులు వెదికి మరీ తీసుకొచ్చారు. వారందరికీ కౌన్సిలింగ్ ఇచ్చివదిలేసారు. మరోసారి వాళ్లలా ప్రవర్తించరని ఆశిద్దాం. నైట్ డ్యూటీ ఎస్ఐ గంగాధర్రెడ్డి కంట్రోల్రూంకు నుంచి వచ్చిన ఫోన్కాల్లో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆ మూడు గంటల పాటు పోకిరీల వేధింపులకు మౌనం వహిస్తున్నా, అదే సమయంలో ఏ ఒక పోలీసు అటువైపు గస్తీ తిరగకపోవడమూ ఆమె కళ్లు పరిశీలించాయి. గాంధీతాత ఆశయాలు ఎందుకు నెరవేరవో, ఆయన కలలు ఎందుకు తీరవో అప్పుడు తెలిసింది. కొత్తగా కమిషనర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కేవలం కొన్ని గంటల్లోనే ఆమె తన పరిధిలో క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనుకుంది. అందుకే ఎవరికీ చెప్పకుండా నేరుగా నడచుకుంటూ దిల్సుఖ్నగర్కు వెళ్లింది. ఎవరికీ అనుమానం రాకుండా అక్కడే నిలబడి పరిసరాలను పరిశీలించింది. సివిల్డ్రెస్లో (మఫ్టీ) వెళ్లడంతో ఎవరి బాగోతం ఏమిటో తెలిసింది.. నిజానికి సరూర్నగర్ పోలీస్స్టేషన్ పరిధిలో రాత్రివేళల్లో ఆకతాయిల అల్లర్లు, పోకిరీల పొగరుబోతు వ్యవహారాలు బాగా ఎక్కువని ప్రతీతి. కానీ ఇంత క్రితం ఏ అధికారీ ఇలాంటి నిఘా ఏర్పాటు చేయలేకపోయారు. నిందితుల విశ్వరూపం ఏమిటో కూడా ఏ పోలీసు అధికారీ పసిగట్టినట్టులేదు. లేకుంటే అలాంటి దృశ్యం మనకు కనపడేదికాదు. ఆ ప్రాంతంలోని బాధితులు కూడా పోలీసులకు చెప్పేందుకు ముందుకు వచ్చేవారుకాదు. దాంతో పేట్రేగి పోయారు. ఈ ఒక్క 'సుమతి' మేడమ్ తప్ప ఏ ఇతర పోలీసు అధికారీ అక్కడున్న పోకిరీలకు 'సుమతీ'శతకం బోధించేందుకు ముందుకు రాలేదంటే నమ్మండి! అయినా మనకెందుకులే..! అని మొహం తిప్పుకుని వెళ్లి పోయిన వారే! ఈసారి నగరంలో ఏ బస్టాండ్లో ఒంటరి ఆడపిల్ల కనబడినా ఆమె 'సుమతి' కావచ్చుననే ఆలోచన యువతలో, ఆకతాయిల్లో వస్తే గాంధీమహాత్ముని కలగన్న రోజు కళ్లెదుట కన్పిస్తుంది. మహిళల రక్షణ కోసం రాజీలేని పోరాటం చేసేందుకు తానున్నానంటూ పోలీస్ కమిషనర్ బి.సుమతి అభయ మిచ్చారు. ఎవరేనా మహిళలు వేధింపులకు గురైతే 87126 62111 వాట్సప్ నంబర్కు ఫిర్యాదు చేయమని కోరారు.

# 'రాయవలస' టీజర్ లాంచ్

రాయవలస టీజర్ చాలా కనెక్టింగ్గా ఉంది. : టీజర్ లాంచ్ ఈవెంట్లో హీరో ఆకాశ్ జగన్నాథ్ రాయవలస మీ అందరికీ నచ్చే సినిమా అవుతుంది. కంటెంట్ నచ్చితే తప్పకుండా సపోర్ట్ చేయండి: హీరో కార్తీక్ జయంతి కార్తిక్ జయంతిని హీరోగా పరిచయం చేస్తూ RaysuN ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ "రాయవలస". ఈ చిత్రాన్ని గోపీ కృష్ణ జె నిర్మించగా మహిళా దర్శకురాలు రాధిక జయంతి దర్శకత్వం వహించారు. Love Tied by Fate అనే ట్యాగ్లైన్ వస్తున్న ఈ సినిమా ఫస్ట్ లుక్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. యంగ్ హీరో ఆకాష్ జగన్నాథ్ ఈ వేడుకకు హాజరయ్యారు. టీజర్ లాంచ్ ఈవెంట్లో ఆకాష్ జగన్నాథ్ మాట్లాడుతూ.. ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ టీజర్ చూసినప్పుడు చాలా హ్యాపీగా అనిపించింది. టీజర్ చాలా బాగుంది. కార్తీక్ హీరోగా, వాళ్ల అమ్మ డైరెక్టర్గా, వాళ్ల నాన్న ప్రొడ్యూసర్గా ఉండడం చాలా క్రేజీగా అనిపించింది. కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉంది. కార్తీక్ని వాళ్ల తల్లిదండ్రులే ప్రొడ్యూస్ చేస్తూ డైరెక్ట్ చేయడం విశేషం. తల్లి డైరెక్ట్ చేయడం, ఫాదర్ ప్రొడ్యూస్ చేయడం, కొడుకు హీరోగా చేయడం ఈ కాంబినేషన్ చాలా ప్రత్యేకంగా ఉంది. ఈ ముగ్గురూ ఒకే ఫ్యామిలీ కావడం వల్ల సినిమా ఇంకా ఈజీ అయింది. హీరోకార్తీక్ మాట్లాడుతూ... ఈ వేడుకకు అతిథులుగా వచ్చిన దామోదర్ ప్రసాద్కి, ఆకాష్కి ధన్యవాదాలు. మీడియా అందరికీ థాంక్స్. టీజర్ మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా జరగడానికి కారణమైన మా అమ్మ, నాన్న, రాఖీకి థాంక్యూ. డైరెక్టర్ రాధిక జయంతి మాట్లాడుతూ... ఈ వేడుకకు వచ్చిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు.



# రికార్డ్ క్రియేట్ చేసిన రామ్చరణ్ 'పెద్ది'



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ రూరల్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' థియేటర్లలోకి రాకముందే సంచలనాలు సృష్టిస్తోంది. బుచ్చిబాబు సానా దర్శకత్వం లో తెరకెక్కుతున్న ఈ భారీ పాన్ ఇండియా చిత్రానికి నార్త్ అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ తుఫాన్లా దూసుకెళ్తున్నాయి. బుకింగ్స్ ప్రారంభమైన కేవలం నాలుగు గంటల్లోనే సినిమా 100కే డాలర్ల మార్క్ను దాటేసి ఆల్టైమ్ రికార్డ్ నమోదు చేసింది. ట్రైలర్ కూడా విడుదల కాకముందే ఈ స్థాయి ఓపెనింగ్ రావడం సెన్సేషనల్గా మారింది. రామ్ చరణ్ స్టార్ పవర్పై ప్రేక్షకులకు ఉన్న నమ్మకం, బుచ్చిబాబు స్టోరీ టెల్లింగ్ ప్రత్యేకత కలిసివచ్చి ఈ భారీ హైప్ను క్రియేట్ చేశాయి. నార్త్ అమెరికా రిలీజ్ ప్రత్యంగిరా సినిమాస్ నిర్వహి స్తోంది. వారి రిలీజ్ ప్లానింగ్ కూడా భారీ స్థాయిలో ఉంది. నార్త్ అమెరికాతో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, సింగపూర్ సహా పలు దేశాల్లో ఈ చిత్రాన్ని గ్రాండ్గా విడుదల చేయనున్నారు. ఇప్పటివరకు 'పెద్ది' నుంచి విడుదలైన రెండు పాటలు, రెండు గ్లింప్స్, పోస్టర్లు.. ప్రతి అప్డేట్కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చింది. రస్టిక్ మూడ్, రూరల్ బ్యాక్ డ్రాప్, రామ్ చరణ్ రగ్డ్ లుక్ అన్నీ సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ఇప్పటికే ఫైనల్ చేసిన థియేట్రికల్ ట్రైలర్ విడుదలైతే ఈ హైప్ మరింత రెట్టింపు అవుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. 'పెద్ది' జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుండగా, జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

**తెర**

# హ్యాపీ బర్త్ డే విజయ్ దేవరకొండ



స్టార్ గా, పర్సన్గా విజయ్ దేవరకొండ జర్నీ ఎప్పుడూ ప్రత్యేకమే. ఒక్కొక్కటిగా ఆయన అనౌన్స్ చేస్తున్న భారీ పాన్ ఇండియా సినిమాలు అందరినీ ఆశ్చర్య పరుస్తున్నాయి. హీరో కొత్త సినిమా ఆయన గత సినిమా సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్స్ మీద, ఆ సినిమా సాధించిన సక్సెస్ మీద ఆధారపడి ఉంటుంది. కానీ జయాపజయాలకు అతీతంగా విజయ్ దేవరకొండ క్రేజ్ ఎవరూ కదిలించలేని, శంకించలేని స్థాయికి చేరుకున్నట్లు ఆయన లైనప్ చూస్తే తెలుస్తోంది. రౌడీ జనార్థన, రణబాలి, శౌర్యవ్, వైరా బ్యానర్ కొత్త సినిమా.. ఈ మూడు చిత్రాలు ఏమాత్రం మారని విజయ్ స్టార్ డమ్, రేంజ్ను చూపిస్తున్నాయి. స్టార్గా తను ఎదగడమే కాదు తన ఆకర్షణతో తెలుగు సినిమాను కూడా మరింత ఎత్తుకి తీసుకెళ్తున్నాడు విజయ్. నిర్మాతలు విజయ్ స్టార్డమ్ను, థియేటర్ పుల్లింగ్ క్రేజ్ను, ఆయన స్టామినాను నమ్ముతున్నారు. దర్శకులు తాము ఊహించుకున్న పాత్రలను విజయ్ సమర్థవంతంగా పోషించగలడని, ఆ పాత్రలకు లైఫ్ ఇవ్వగలడని విశ్వసిస్తున్నారు. విజయ్ కెరీర్ ప్రతి ఒక్కరికీ తెలిసిందే. మూవీ లవర్స్ కు ఆయన ఫిల్మోగ్రఫీలో 90 పర్సెంట్ ఫేవరెట్ మూవీస్ ఉంటాయి. అతి తక్కువ కాలంలో పాన్ ఇండియా ఆడియెన్స్ ఆదరణ, ప్రేమ పొందడం విజయ్ ప్రత్యేకత. పెళ్లి చూపులు మూవీ విజయ్ కెరీర్కు గట్టి పునాది వేసింది. విరోష్ పెళ్లికి సంబంధించిన ప్రతి విశేషం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రధాని మోదీ ఆశీస్సులతో పాటు ఎందరో ప్రముఖ సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపారవేత్తలు, వివిధ రాష్ట్రాల అభిమానులు, ప్రజలు విరోష్ ను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

# కృతి స్టన్నింగ్ లుక్



డిజైనర్ లుక్ తో మెరిసిపోయింది. కృతి రెడ్ టాప్ షార్ట్స్ ధరించి ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి వెండితెరపై తన అద్భుత నటనతో కోట్లాదిమంది అభిమానుల మనసు గెలుచుకున్న నటి కృతి సనన్ ఇప్పుడు వ్యాపార రంగంలోనూ అప్రతిహతంగా దూసుకుపోతోంది. ఇటీవల ముంబైలో జరిగిన ప్రతిష్టాత్మక ఫెమినా బ్యూటీ అవార్డ్స్ 2026 వేడుకలో బ్యూటీ అంట్రప్రెన్యుర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారాన్ని అందుకున్నారు. కేవలం గ్లామర్ ప్రపంచానికే పరిమితం కాకుండా.. ఒక పారిశ్రామికవేత్తగా కృతి సాధిస్తున్న విజయాలు సినిమా రంగానికి ఆవల తనకు ఉన్న బలమైన పనితనాన్ని నిరూపిస్తున్నాయి. స్కిన్ కేర్ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కృతి ప్రారంభించిన వ్యాపార ప్రయాణం ఇప్పుడు ఒక మైలురాయిని చేరుకుంది. కృతి సనన్ స్థాపించిన స్కిన్ కేర్ బ్రాండ్ హైఫన్ అనతి కాలంలోనే సౌందర్య సాధనాల పరిశ్రమలో బలమైన ముద్ర వేసింది. సాధారణంగా సెలబ్రిటీలు బ్రాండ్ అంబాసిడర్లుగా మాత్రమే వ్యవహరిస్తుంటారు.. కానీ కృతి మాత్రం అందుకు భిన్నంగా ఉత్పత్తుల అభివృద్ధి.. బ్రాండ్ విజన్ .. క్వాలిటీ కంట్రోల్ వంటి విషయాల్లో స్వయంగా పాల్గొంటున్నారు. శరీరతత్వాన్ని బట్టి హైపెర్ఫార్మింగ్ సన్స్క్రీన్లు, బారియర్ రిపేర్ క్రీమ్లు గ్లో బూస్టింగ్ సీరమ్స్ వంటి వినూత్న ఉత్పత్తులను పరిచయం చేస్తూ వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకున్నారు. తన వ్యాపారాన్ని సామాన్యులకు చేరువ చేయడంలో కృతి అనుసరిస్తున్న వ్యూహాలు అద్భుతమనే చెప్పాలి. ఈ రంగంలో ఇప్పటికే పోటీపడుతున్న దీపిక పదుకొనే, కత్రిన లాంటి సీనియర్లకు భిన్నంగా కృతి తన బ్రాండ్ ని సక్సెస్ చేయడంలో సఫలమైంది. సామాన్యుల చర్మ సమస్యలను అర్థం చేసుకుంటూ.. అందరికీ అందుబాటులో ఉండే ధరలలో నాణ్యమైన ఉత్పత్తులను అందించడంలో విజయవంతమైంది. ఈ పారదర్శకతే తనను ఒక సక్సెస్ ఫుల్ అంట్రప్రెన్యూర్గా నిలబెట్టింది. వ్యాపారవేత్తగా బిజీగా ఉన్నా.. కృతి తన గ్లామర్ ప్రపంచాన్ని ఏమాత్రం విస్మరించడం లేదు. తాజాగా ప్రఖ్యాత మెరిసి పోయింది. కృతి రెడ్ టాప్ షార్ట్స్ ధరించి ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. ఈ సమ్మర్ కి అనుగుణంగా ఉండే విభిన్నమైన డిజైనర్ దుస్తులను ధరించి ఫోజు లిచ్చింది. ఈ బ్యూటీ ఆకర్షణీయమైన రూపంతో పాటు తను షేర్ చేస్తున్న వ్యక్తిగత విషయాలు కూడా నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి.


# అమెజాన్ ప్రైమ్‌లో 'డెకాయిట్'

అమెజాన్ ప్రైమ్లో ఓటీటీ స్పేస్ను డామినేట్ చేస్తూ ఇండియా వైడ్ నెంబర్ 1 ట్రెండింగ్లో దూసుకెళ్తున్న అడివి శేష్



'డెకాయిట్'అడివి శేష్ మరోసారి డిజిటల్ స్పేస్పై తనకున్న పట్టుని నిరూపించారు. ఆయన నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్' ఓటీటీలో సెన్సేషన్ సృష్టిస్తోంది. ఈ చిత్రం మే 8, 2026న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదలైన వెంటనే ఇండియా వైడ్ నెంబర్ 1 స్థానాన్ని దక్కించుకుంది. థియేటర్లలో విజయవంత మైన ప్రదర్శన అనంతరం ఓటీటీలోకి వచ్చిన ఈ సినిమా ఇప్పుడు డిజిటల్ స్పేస్లో కూడా భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. మంచి కంటెంట్ను ఎంపిక చేసుకోవడంలో అడివి శేష్కు ఉన్న విజన్ని మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్న కథలు, బలమైన కథనాలతో ఆయనకు ఉన్న క్రేజ్ 'డెకాయిట్'తో మరింత బలపడింది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ కథానాయికగా నటించగా, ఇద్దరి నటన సినిమాకి ప్రధాన బలంగా నిలిచింది. అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి, జైన్ మేరీ ఖాన్, కామాక్షి భాస్కర్ల వంటి ప్రముఖ నటీ నటులు కీలక పాత్రల్లో కనిపించారు. దర్శకుడిగా పరిచయమైన షనీల్ డియో ఈ చిత్రాన్ని స్టైలిష్గా, గ్రిప్పింగ్గా తెరకెక్కించారు. సినిమాటో గ్రాఫర్ ధనుష్ భాస్కర్ విజువల్స్, కొదాటి పవన్ కళ్యాణ్ ఎడిటింగ్, భీమ్స్ సిసిరోలియో సంగీతం సినిమాకి మరింత బలం చేకూర్చాయి. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్పై సుప్రియా యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మించిన ఈ చిత్రంలో ఉన్న హై ప్రొడక్షన్ వాల్యూస్ డిజిటల్ స్క్రీన్పైనా స్పష్టంగా కనిపిస్తున్నాయి. థ్రిల్లింగ్ కథనం, అద్భుతమైన టెక్నికల్ వాల్యూస్తో 'డెకాయిట్' స్ట్రీమింగ్ చార్ట్స్ను షేక్ చేస్తోంది. మంచి కంటెంట్కు ఎప్పుడూ ప్రేక్షకాదరణ ఉంటుందనే విషయాన్ని ఈ సినిమా మరోసారి

# 'రావు బహదూర్' జూలై 3న వరల్డ్ వైడ్ రిలీజ్



సూపర్స్టార్ మహేష్ బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్టైన్మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సైకాలజికల్ థ్రిల్లర్ 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా సమర్పిస్తున్నారు. తాజాగా మేకర్స్ ఈ చిత్రాన్ని జూలై 3న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్లో సత్యదేవ్ వయసు పైబడిన రాయల్ లుక్లో కనిపించారు. రాయల్ పర్పుల్ దుస్తులు, ముత్యాల అలంకరణలు, హ్యాండ్ ఫ్యాన్, వెనుక గ్రాండ్ సెటప్ కలిసి ఓ మిస్టీరియస్ అరిస్టోక్రాటిక్ ప్రపంచాన్ని చూపిస్తున్నాయి. పోస్టర్ మొత్తం సైకాలజికల్ డ్రామాకు తగ్గట్టుగా ఇంటెన్స్ వాతావరణాన్ని సృష్టిస్తోంది. ఈ చిత్రంలో దీపా థామస్ కథానాయికగా నటిస్తుండగా, వికాస్ ముప్పాల, బాలా పరాశర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, మాస్టర్ కిరణ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి స్ట్రాంగ్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. కార్తిక్ పరమార్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలను రోహన్ సింగ్ నిర్వహిస్తున్నారు.

# వినేష్‌తో రెజ్లింగ్ సమాఖ్య కుస్తీ



**న్యూఢిల్లీ:** భారత మేటి రెజ్లర్ వినేష్ ఫోగట్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వినేష్ ఫోగట్ జూన్ 26 వరకు జాతీయ పోటీల్లో పోటీ చేసేందుకు అనర్హురాలిగా భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్ఐ) ప్రకటించింది. క్రమశిక్షణా రాహిత్యం, డోపింగ్ నిరోధక నిబంధనల ఉల్లంఘనకు పాల్పడినట్లు ఆరోపిస్తూ నోటీసులు జారీ చేసింది. దీంతో ఉత్తర్‌ప్రదేశ్‌లోని గొండాలో నేటి నుంచి ప్రారంభమయ్యే జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ రెజ్లింగ్ టోర్నీకి వినేష్ ఫోగట్ మిస్సయింది.

ఇటీవల తిరిగి రెజ్లింగ్‌లోకి పునర్ ఎంట్రీ ఇచ్చిన వినేష్ ఫోగట్... యూపీలోని గోండాలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకుంది. అయితే రిజిస్ట్రేషన్ మొదలు పలు అంశాలు వివాదాస్పదమయ్యాయి. బ్రిజ్‌భూషణ్ సొంత ప్రాంతంలో పోటీపడడం తనను మానసిక ఒత్తిడికి గురిచేస్తోందని వినేష్ ఆందోళన వ్యక్తంచేసింది. పోటీల సందర్భంగా తనకు ఏం జరిగినా కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అవుతుందని హెచ్చరించింది.

అయితే, పోటీలు ప్రారంభానికి ఒకరోజు ముందే డబ్ల్యూఎఫ్ఐ నుంచి ఈ ప్రకటన వచ్చింది. ఈ క్రమంలో ఏకంగా డబ్ల్యుఎఫ్ఐ... పోటీల్లో పాల్గొనకుండా జూన్ 26 వరకు అనర్హత ప్రకటించడం సంచలనంగా మారింది. రిటైర్మెంట్ నుంచి తిరిగి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన ఆరు నెలల నోటీస్ వ్యవధిని పూర్తి చేయడంలో వినేష్ విఫలమైనట్లు డబ్ల్యూఎఫ్ఐ తెలిపింది. వినేశ్ ప్రవర్తన భారత రెజ్లింగ్ ప్రతిష్ఠను దెబ్బతీసిందని, దేశం అవమానపడేలా వ్యవహరించారని పేర్కొంది. జాతీయ, అంతర్జాతీయ రెజ్లింగ్ నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపించింది.

మహిళా రెజ్లింగ్‌కు ఆదరణ తెచ్చిన వినేష్ ఫోగట్...రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ మెడలిస్ట్. ఆసియా క్రీడల్లో స్వర్ణం, సిల్వర్ మెడల్స్.. కామన్‌వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు, ఏషియన్ ఛాంపియన్ షిప్‌లో మెడల్స్‌తో మెరిశారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఫైనల్ చేరింది. అయితే ఫైనల్‌కు ముందు నిర్వహించిన వెయిట్‌లో వంద గ్రాములు ఎక్కువగా ఉందని వినేష్ ఫోగట్‌పై అనర్హత వేటు పడింది. దీన్ని ఛాలెంజ్ చేసిన ఫోగట్... అదే ఏడాది అగస్టులో రెజ్లింగ్‌కు గుడ్‌బై చెప్పింది. రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి 2024లో హర్యానాలోని జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2023లో డబ్ల్యుఎఫ్ఐ అప్పటి అధ్యక్షుడు బ్రిజ్



భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలపై మహిళా రెజ్లర్లకు మద్దతుగా వినేష్ ఫోగట్ నిలిచింది.

## జైస్వాల్, షఫాలీ డోప్ కష్టాలు

**ముంబై:** భారత క్రికెటర్లు యశస్వీ జైస్వాల్, షఫాలీ వర్మలు డోప్ చిక్కుల్లో పడ్డారు. వీరిద్దరికి జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ(నాడా) నోటీసులు జారీ చేసింది. గతేడాది నిర్ణీత డోప్ పరీక్షలకు హాజరుకాకపోవడంతో ఈ నోటీసులు ఇచ్చింది. దీనిపై వివరణ ఇచ్చుకునేందుకు జైస్వాల్, షఫాలీకికి వారం రోజుల గడువిచ్చింది. గత డిసెంబర్ 17న యశస్వీ జైస్వాల్‌కు, నవంబర్ 7న షఫాలికి డోప్ పరీక్షలు జరగాల్సింది. అయితే వీటికి వీరు అందుబాటులోకి రాకపోవడంతో నాడా.. ఫిబ్రవరిలో వీరిద్దరి నుంచి వివరణ కోరింది. వీరు స్పందించక పోవడంతో తాజాగా నోటీసులు జారీ చేసింది. 12 నెలల వ్యవధిలో మూడుసార్లు డోపింగ్ పరీక్షలకు హాజరుకాకపోతే రెండేళ్లపాటు నిషేధం పడుతుంది. జైస్వాల్ ప్రస్తుతం ఐపీఎల్ 2026లో బిజీగా ఉండగా.. జూన్ 12 నుంచి ప్రారంభం కానున్న టీ20 మహిళా ప్రపంచ కప్‌కు షఫాలీ వర్మ సద్ధమవుతోంది. కాగా పరీక్షలకు హాజరు కాకపోవడంపై నాడా నుండి సమాచారం అందిందని బీసీసీఐ తెలిపింది. ఇది ఎలా జరిగిందో తాము వారితో తనిఖీ చేస్తామని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని బీసీసీఐ పేర్కొంది.







## శుభ్‌మన్ గిల్ కెప్టెన్ ఇన్నింగ్
## గుజరాత్ మరో విజయం

**జైపూర్:** గుజరాత్ టైటాన్స్ వరుసగా నాలుగో విక్టరీతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలోకి దూసుకెళ్లింది. జైపూర్‌లో జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 77పరుగుల తేడాతో గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 229 రన్స్ చేసింది. శుభ్‌మన్ గిల్(44 బంతుల్లో 84; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు సాయి సుదర్శన్(36 బంతుల్లో 55; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. ధాటిగా ఆడుతూ పవర్ ప్లే తొలి 6 ఓవర్లలోనే 82 రన్స్ సాధించారు. అదే జోరు కొనసాగిస్తూ తొలి వికెట్‌కు 118 రన్స్ జోడించారు. సుదర్శన్ అవుటైనా గిల్ మెరుపు ఇన్నింగ్స్ కొనసాగింది. గుజరాత్ స్కోరును 150 దాటించి అవుటయ్యాడు. స్లాగ్‌ఓవర్లలో వాషింగ్టన్ సుందర్(20 బంతుల్లో 37 నాటౌట్) ధాటిగా ఆడగా, తెవాటియా(14) చివరి ఓవర్లో 2 సిక్స్‌లు బాదాడంతో గుజరాత్ స్కోరు 229కు చేరింది.

230రన్స్‌తో బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ టాప్ ఆర్డర్‌ను సిరాజ్, రబడా కూల్చాగా, ఏస్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ మిడిల్ ఆర్డర్, హోల్డర్ లోయర్ ఆర్డర్ పనిపెట్టాడు. దీంతో రాజస్థాన్ 16.3 ఓవర్లలో 152కు కుప్పకూలింది. జడేజా(38) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాజస్థాన్ బౌలర్లలో రషీద్ 4, రబడా రెండు, హోల్డర్ 3 వికెట్లు పడగొట్టారు. ఈ ఓటమితో రాజస్థాన్ టాప్-4 నుంచి 5వ స్థానానికి చేరింది.

## తొలి రౌండ్‌లోనే జొకోవిచ్ ఔట్



**రోమ్:** టెన్నిస్ స్టార్ నోవాక్ జొకోవిచ్ ఇటాలియన్ ఓపెన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అతనిపై 2-6, 6-2, 6-4 తేడాతో క్వాలిఫయర్ డైనో ప్రిజ్నిక్ గెలుపొందాడు. కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేశాడు. గాయంతో పలు టోర్నీలకు దూరమైన జొకోవిచ్... కోలుకుని ఇటాలియన్ ఓపెన్ బరిలో దిగాడు. అయితే తొలి రౌండ్ పోరులో జొకోవిచ్ ఇబ్బంది పడ్డాడు. దీంతో అతని ఫిట్‌నెస్‌పై సందేహాలు ఏర్పడ్డాయి. 25వ గ్రాండ్ స్లామ్ టైటిల్‌పై ఫోకస్ పెట్టిన జొకోవిచ్...ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు ఇలా తొలి రౌండ్‌లోనే ఓటమి పొందడం ఆశ్చర్యం. గత ఏడాది మాడ్రిడ్ ఓపెన్ తర్వాత జొకోవిచ్ ఓ టోర్నీలో ఇంత త్వరగా నిష్క్రమించడం ఇదే మొదటిసారి,

ఇండియన్ వెల్స్ తర్వాత మొదటిసారి బరిలోకి దిగిన జొకోవిచ్... తొలి సెట్‌లో జోరు చూపాడు. క్వాలిఫయర్ డైనో ప్రిజ్నిక్ సర్వీసులను రెండు సార్లు బ్రేక్ చేసి తొలి సెట్‌ను 6-2తో ముగించి ఆధిక్యం చాటాడు. అయితే రెండో సెట్ నుంచి జొకోవిచ్ భుజం గాయం తిరగబెట్టినట్లు కనిపించాడు. ఇదే అదనుగా ప్రిజ్నిక్ మెరుగైన ఆటతో వరుసగా రెండు సెట్లను గెలుపొంది తరువాతి రౌండ్‌లో ప్రవేశించాడు. కాగా అలెగ్జాండర్ జ్వెరెవ్ తన తోటి జర్మన్ ఆటగాడైన డేనియల్ ఆల్ట్‌మాయర్‌ను 7-5, 6-3తో వరుస సెట్లలో సునాయాసంగా ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు.

## నిరాశపరిచిన వైభవ్ సూర్య

విధ్వంసకర ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(16 బంతుల్లో 36) మరోసారి నిరాశపరిచాడు. గత మ్యాచ్‌లో డీసీపై 4 రన్స్‌కే అవుటైన వైభవ్‌పై ఈ మ్యాచ్‌లో భారీ ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకున్నారు. తాను ఎదుర్కొన తొలి బంతినే లాంగ్‌ఆన్ మీదుగా సిక్స్‌గా మలిచాడు. ఇక రబడ వేసిన రెండో ఓవర్లో ఫైన్ లెగ్ మీదుగా , మిడ్ వికెట్ మీదుగా స్టాండ్స్‌లోకి పంపాడు. ఇక సిరాజ్ ఓవర్లో మొదటి బంతికి కవర్ బౌండరీ, రెండో బంతి డాట్, మూడో బంతి బ్యాక్ వర్డ్ పాయింట్ బౌండరీ, నాలుగో బంతికి మిడాఫ్ బౌండరీ ఇలా మూడు ఫోర్లు బాదాడు. షార్ట్ బాల్‌గా వచ్చిన అయిదో బంతిని ఆడబోయి అర్షద్‌కు మ్యాచ్ ఇచ్చి వైభవ్ పెవిలియన్ చేరాడు. రాజస్థాన్ స్కోరు 38లో 36 పరుగులు వైభవ్ బ్యాట్ నుంచి వచ్చినవే.



## ప్రైజ్‌మనీ ఇప్పించండి: చెస్ జీఎం అభిజిత్

**ఢిల్లీ:** గెలిచి టోర్నీ ప్రైజ్‌మనీ ఇప్పించండి మొర్రో అని వేడుకుంటున్నాడు చెస్ గ్రాండ్‌మాస్టర్ అభిజిత్ గుప్తా. ఈ ఏడాది జనవరిలో ఒడిషా ఓపెన్ చెస్ టైటిల్‌ను అభిజిత్ గెలుపొందాడు. అపుడు నిర్వాహకులు ట్రోఫీ అందించినా అయిదున్నర లక్షల ప్రైజ్‌మనీ ఇవ్వలేదు. తరువాత తరువాత అంటూ అయిదునెలలుగా నెట్టుకొంటూ వస్తున్నారు. దీంతో పలుమార్లు అడిగి వేసారిన అభిజిత్.. చివరకు కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖను ఆశ్రయించారు. నెలలోగా ప్రైజ్‌మనీ సొమ్ముఉ చెల్లిస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చి తప్పారని వాపోయారు.



# పెరగనున్న పెట్రోల్, డీజిల్ ధరలు!




**న్యూఢిల్లీ,మే 9:** వాహనదారులపై పెట్రోల్, డీజిల్ ధరల భారం పడే సూచనలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరగడంతో, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఎదుర్కొంటున్న నష్టాలను భర్తీచేసేందుకు ఇంధన ధరల పెంపు తప్పకపోవచ్చని తెలుస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుండి ఏకంగా 126 డాలర్లకు చేరుకోవడంతో, చమురు సంస్థలు ప్రతి నెలా దాదాపు రూ. 30వేల కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం, చమురు సంస్థలు కలిసి లీటర్ పెట్రోల్‌పై దాదాపు రూ.24 భారాన్ని భరిస్తూ వినియోగదారులకు ఉపశమనం కలిగిస్తున్నాయి. పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడి వల్ల ధరల సవరణ అనివార్యంగా కనిపిస్తోంది. ఒకవేళ ధరల పెంపునకు ఆమోదం లభిస్తే పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.4 నుండి రూ. 5 వరకు పెరగవచ్చు. వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.40 నుండి రూ.50 వరకు పెరిగే అవకాశం ఉంది. గత నాలుగు ఏళ్లుగా (2022 నుండి) ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు, ఈపరిణామం వాహనదారులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉంది. మధ్య ప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతలు మరియు హార్ముజ్ జలసంధిలో సరఫరాకు అంతరాయం కలగడం వల్ల ప్రపంచవ్యాప్త చమురు సరఫరాలో 20 శాతం ప్రభావితమైంది. ఇది ముడి చమురు ధరలను ఆకాశానికి చేర్చింది. భారత్ ప్రస్తుతం రష్యా, అమెరికా, పశ్చిమ ఆఫ్రికా దేశాల నుండి దిగుమతులను పెంచడం, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తోంది. ద్రవ్యోల్బణం పెరగకుండా ఉండటానికి, చమురు సంస్థల ఆర్థిక స్థితిని కాపాడటానికి ప్రభుత్వం ఇప్పుడు సమతుల్య నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

## అనిల్ అంబానీ ఇల్లు, కార్యాలయాల్లో
# సిబిఐ సోదాలు

**ముంబయి, మే 9:** రిలయన్స్ అనిల్ ధీరూబాయ్ అంబానీ గ్రూప్ అధినేత అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. అనిల్ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్ కంపెనీలైన రిలయన్స్ టెలికాం లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్‌లపై నమోదైన కేసులకు సంబంధించి ఈ సోదాలు జరిగినట్లు తెలుస్తోంది. బ్యాంకు మోసం కేసులో ముంబైలో అనిల్ అంబానీకి సంబంధించిన 17 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించినట్లు సీబీఐ తెలిపింది. కంపెనీల డైరెక్టర్ల నివాసాలు, మధ్యవర్తిత్వం వహించిన సంస్థల కార్యాలయాల్లో కూడా సోదాలు జరుపుతున్నట్లు సీబీఐ అధికారులు తెలిపారు. ఒకే చిరునామా నుంచి పలు మధ్యవర్తి కంపెనీలు పనిచేస్తున్నట్లు గుర్తించామని, దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడినట్లు ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీ ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ గ్రూప్‌పై 7 కేసులు నమోదయ్యాయి. రిలయన్స్ టెలికామ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ హోంఫైనాన్స్ వంటి సంస్థల డైరెక్టర్లు, కార్యాలయాలు, ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ముంబయి స్పెషల్‌కోర్టు జడ్జి జారీచేసిన వారంట్ల ఆధారంగా సోదాలు జరిపారు. ఈకేసుల్లో మొత్తం నష్టం రూ.27,337 కోట్లుగా ఉన్నట్లు సిబిఐ చెపుతోంది. అంతకుముందు కూడా సిబిఐ 14 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ అధికారులు డి.విశ్వనాథ్, జాయింట్ ప్రెసిడెంట్ అనిల్ కాల్యాలను గతనెల 20నే అరెస్టుచేసినట్లు తెలిపారు. ఈకేసులో కాల్యా విశ్వనాథ్‌ను బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణలో సాయంచేసారని, నిధుల వినియోగంలో కూడా ఆయన హస్తం ఉందని సిబిఐ వెల్లడించింది. ప్రస్తుతం వీరు జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నారు.








## 2.57 లక్షల కోట్ల పన్ను బకాయిలపై సిబిడిటి ఫోకస్

**న్యూఢిల్లీ, మే 9:** దేశంలో ఇప్పటికీ వసూలు కావాల్సి ఉన్న రూ.2.57 లక్షలకోట్ల పన్ను బకాయిలను రాబట్టేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు రంగంలోకి దిగింది. పన్ను విభాగం వివరాలను చూస్తే ప్రత్యేక బృందాలు ముందుగా 2027 ఆర్థిక సంవత్సరంలో పదివేల ఎక్కువ విలువల బకాయిలున్న కేసులపై ఫోకస్ పెంచారు. దాడులు సోదాలతోపాటు ముందు టెక్నాలజీ సాయంతో వీటి సమగ్ర వివరాలను సేకరించి ఆతర్వాతనే దాడులకు ఉపక్రమిస్తోంది. సెర్ సాయ్ తనఖా, అసెట్ డేటాబేస్‌ను వినియోగించి బకాయిదారుల ఆస్తులు, సురక్షిత రాబడుల వివరాలను సేకరిస్తున్నారు. మినహాయింపులు, తగ్గింపులను దుర్వినియోగం చేయకుండా ఉండే చర్యలు కూడా చేపట్టింది. 2026 ఆర్థికసంవత్సరంలో ఐటిశాఖ ఇప్పటివరకూ 2.24 లక్షల అప్పీళ్లను పరిష్కరించింది. రూ.8.27లక్షలకోట్లకు సంబంధించిన వివాదాలు పరిష్కరం అయ్యాయి. పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు ప్రస్తుతం 5.40 లక్షల నుంచి 4.95 లక్షలకు తగ్గించినట్లు సిబిడిటి వెల్లడించింది. బడ్జెట్ లక్ష్యాలప్రకారం ప్రత్యక్ష పన్నుల వసూళ్లు రూ.26.97 లక్షల కోట్లుగా ఉంది. నికరంగా ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 5.1శాతం వార్షిక వృద్ధితో రూ.23.4 లక్షల కోట్లుగా ఉన్నాయి. సవరించిన అంచనాలు రూ.24.21 లక్షలకోట్లకంటే తగ్గాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.